- తెలుగు కవిత్వం - బాలపాలేరుల జీవిత చిత్రణ
- తెలంగాణ నవల - భాష
- భారతీయీకరణ
- తెలంగాణ నవలలు - కులవృత్తుల ప్రస్తావన
- ఆచార్య మసన చెన్నప్ప సాహిత్య సేవ
- ఆత్మ చరితము - విశేషాంశాలు
- అడిగోపుల వెంకటరత్నం కవిత్వం - ప్రపంచీకరణ ప్రభావం
- జి.వి.జగదీశ్వరస్వామి, అనుముల శ్రీహరి


# మూసీ

# MUSI


◆ Samputi : 25 ◆ Sanchika : 12 ◆ Pages : 64 ◆ Rs. 20
◆ October 2022

UGC Care List
Approved Journal


మూసీ 25 వసంతాలు



శ్రీ హరిహర త్రిశక్తి క్షేత్రం, నవాలయ ఆవరణం, శ్రీ విద్యాపురం, వలిగొండ, యాదాద్రి భువనగిరి జిల్లా.



మూసీ
సాహిత్య సాంస్కృతిక చారిత్రక
చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక



వ్యవస్థాపకులు
శ్రీ బి.ఎన్.శాస్త్రి

సంపుటి : 25 సంచిక : 12
అక్టోబర్ - 2022
'శుభకృత్' ఆశ్వీజ మాసం

**సంపాదకులు** (EDITOR)
**సాగి కమలాకర శర్మ**
**SAGI KAMALAKARA SHARMA**

**సహ సంపాదకులు** (ASSOCIATE EDITOR)
**డా. దత్తయ్య అట్టెం**
**Dr. DATTAIAH ATTEM**

**Printed and Published by**
B. Anantha Laxmi

***Type Setting at :***
**Kavyasree Graphics**
**Ph: 934 797 1177**

**Printed at : Sri Sai Process**
**Ph. 27563075**

**విడిప్రతి : 20/-**
**సంవత్సర చందా : 200/-**
**శాశ్వత సభ్యత్వం : 2500/-**
**(పది సంవత్సరాలు మాత్రమే)**

చెక్కులు, డి.డి.లు 'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine) పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : మేనేజర్, మూసీ మాసపత్రిక,
2-2-1109/బికె - ఎల్ఐజి-10,
బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట,
హైదరాబాద్ - 500 013
ఫోన్ : 934 797 1177
email : editormusi@gmail.com

INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 2457-0796
UGC APPROVED JOURNAL

# ఈ సంచికలో ...

## వ్యాసాలు


తెలుగు కవిత్వం - బాలపాలేరుల జీవిత చిత్రణ ... సుంకర గోపాలయ్య 7
తడిపి మోపెడు (బందారం కథలు -11) ... డా. నందిని సిధారెడ్డి 11
తెలంగాణ నవల - భాష ... డా. మల్లేశ్ మంత్రి 15
పద్య మనోహరం - 35 ... డా. గన్నమరాజు గిరిజా మనోహర్ బాబు 20
భారతీయీకరణ5 : ఆంగ్లమూలం : బలరాజ్ మధోక్, తెలుగు : కోవెల సంపత్కుమార 21
గ్రంథాలయ జ్యోతి (గ్రంథాంతరంగం-17) ... ఘట్టమరాజు 25
తెలంగాణ నవలలు - కులవృత్తుల ప్రస్తావన... సుధామల్ల స్రవంతి 28
ఆచార్య మసన చెన్నప్ప సాహిత్య సేవ (2) ... ఆచార్య సూర్యా ధనుంజయ్ 33
ఆత్మ చరితము - విశేషాంశాలు ... డా. శిరీష ఈదుపుగంటి 41
అడిగోపుల వెంకటరత్నం కవిత్వం - ప్రపంచీకరణ ప్రభావం ... ఎస్.వి.పద్మకుమారి 47
జి.వి. జగదీశ్వర స్వామి, అనుముల శ్రీహరి ... డా. పెబ్బేటి మల్లికార్జున్ 51


## కవితలు


జగద్ధాత్రీ! పాహి పాహి! ... డా.వొజ్జల శరత్ బాబు - 5; తుకారాం అభంగం ... డా. మంత్రి శ్రీనివాస్ - 6; పూలతేరు ... డా. గన్నోజు శ్రీనివాసాచారి - 6; క్లాస్ రూపం ... ఎన్. గోపి - 14; శ్రీమాతా వందనం - అన్నమరాజు ప్రభాకర రావు - 19; నైవేద్యం ... గురిజాల రామశేషయ్య - 19; ఇస్త్రీ బట్టలు ... ఎజ్జు మల్లయ్య - 44; అష్టాదశ శక్తి పీఠ వైభవం ... అవధాని భానుప్రకాశాచార్య - 45; అమ్మ ... విశాల - 50; మేఘాలు - జీవ ప్రాణాలు (మణిపూసలు) ... చింతోజు పద్మావతి - 53; దుఃఖం లేనోడు ... డా. సబ్బని లక్ష్మీనారాయణ - 62.


## సమీక్షలు


సమాజాన్ని జాగృత పరిచే నవల 'అవతలి గుడిసె' ... బొమ్మెర సతీశ్ 55
శతజయంతి సాహితీ మూర్తుల కెత్తిన పతాక ... డా. శ్రీరంగాచార్య 58
'జీవితం ఒక నాటక రంగం' నవలా దర్శనం ... తుళ్ళూరు రవి 59
స్వీకృతి ... 61


**ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**

*Printed, Published and Owned by* : **B. Anantha Laxmi,** 3-4-245/1, Lingampally, Kachiguda, Hyderbad - 500 027. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma. RNI No. 37723/80**

ISSN 2457-0796

UGC Care List Approved Journal

మూసీ మాసపత్రిక  సంపుటి -25 : సంచిక - 12  (4)  హైదరాబాద్  అక్టోబర్ : 2022

## సంపాదకీయం







వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి

స్థాయి విస్తరించాలి

దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
అమృతమూర్తిగా
మారాలి

**నీలో దీపం వెలిగించు**
**నీవే వెలుగై వ్యాపించు**





# ఆకాశం - అవకాశం

కాశత ఇతి కాశం, కాశృ దీప్తౌ, ప్రకాశించునది. నిత్య జీవితంలో ఆకాశ శబ్దాన్ని, అవకాశ శబ్దాన్ని వాడకుండా ఉండలేము. ప్రకాశించేది కాశం అయితే 'ఆ' అనే ఉపసర్గ చేరినప్పుడు అది అంతటా వ్యాపించేది, విస్తరించినది, ఎక్కువ స్థాయి అనే అర్థంలో వినియోగిస్తారు. ప్రకాశ శబ్దంలోనూ ప్రకృష్టమైన కాశమనే అర్థం. ఆలోచన, ఆనందం, ఆరోహణ మొదలైన అన్ని శబ్దాల్లోనూ 'ఆ' ఉపసర్గ విస్తార భావంలోనే వినియోగ పడుతుంది. 'అవ' శబ్దం క్రిందికి రావడం, స్థాయి తక్కువ, పరిమితం అనే అర్థాల్లో వినియోగించడం జరుగుతుంది. అవమానం, అవరోహణ, అవనతం, అవకాశం అనే శబ్దాల్లో తెలియకుండానే 'అవ' ఉపసర్గ ఉంటుంది.

శక్తి ఆకాశంగా, వాయువుగా, అగ్నిగా, జలంగా, భూమిగా మారుతూ క్రిందికి వస్తుంది. భూ స్థాయిలో ఉన్న మనం క్రమంగా ఆకాశ స్థాయి నుండి శక్తి స్థాయికి చేరుకోవాల్సిన అవసరం ఉంది. భూ స్థాయిలో ఉన్నవాళ్ళు తమకున్న బంధనాలను, భావాలను క్రమంగా తగ్గించుకుంటూ ఎదగడానికి ప్రయత్నిస్తూ ఉంటే జలం, అగ్ని, వాయు, ఆకాశ, శక్తి స్థాయిలలోకి చేరగలం. బంధనాలతో పదార్థాలుగా మారిన అణువులన్నీ, జ్ఞానంతో వికసిస్తూ బంధనాలను విచ్ఛేదం చేసుకుంటూ అణుస్థాయి (ఆత్మస్థాయి)కి చేరాల్సిన అవసరం ఉంది. దీనికి చాలా ప్రయత్నం, జ్ఞానం అవసరం. ఈ విధంగా చేరడానికి మనకు కలిగే వానిని 'అవకాశాలు' అంటారు. అవకాశాలను వినియోగించుకుంటూ ఆకాశ స్థాయికి చేరడమే జీవిత లక్ష్యం.

మనలో శక్తి తగ్గినప్పుడల్లా పెంచుకునే అవకాశాన్ని ఈ విశ్వం మనకు ఇస్తూనే ఉంటుంది. ఆ విషయం మనం అర్థం చేసుకుంటూ ఉండాలి. దానికోసం విశ్వాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం చేయాలి. పంచభూతాల ప్రవర్తనలపై దృష్టి సారించాలి. లోకజ్ఞానం కన్నా ప్రకృతి జ్ఞానం పెంచుకునే ప్రయత్నం చేయాలి. ఈ ప్రయత్నం మాత్రమే మనం చేసేది. మన శక్తి కన్నా ఉన్నత శక్తి చుట్టూ మన మనస్సును కేంద్రీకరించడం ప్రారంభించాలి. అటువంటి సందర్భంలోనే మనలో పరిణతి ఏర్పడుతుంది. ఆ పరిణతి వల్ల ఈ విశ్వం మనకు ఏవో అవకాశాలను ఇస్తూ ఉంటుంది. వాటిని కేవలం తాత్కాలికమైన ఎదుగుదలకు కాకుండా ఇంకా పెద్ద స్థాయిల్లోకి చేరడానికి వినియోగించుకోవాలి. మన బలహీనతలు, బంధాల వల్ల మనం కేవలం ఈ లోక అవసరాలైన ధనం, సుఖం మొదలైన వానిని మాత్రమే పెంచుకునే ప్రయత్నం చేస్తుంటాం. కాని మన స్థాయిని పెంచుకోవడం మాత్రం చేయం. కారణం దానిపై మనకు అవగాహన లేకపోవడమే.

మన చుట్టూ ఉన్న వాతావరణం, మన శక్తి సంపదలను గమనిస్తూ, ఉన్న స్థాయి కన్నా భావనలు ఎప్పటికీ ఉన్నత స్థాయికి చేరడానికి ప్రయత్నిస్తే విశ్వం మనకు అనేక అవకాశాలు ఇస్తూనే ఉంటుంది. మనకు కలిగే ప్రతి అవకాశం కూడా ఆకాశ స్థాయికి చేరడానికి మాత్రమే. ఈ విషయం మనం గుర్తు చేసుకుంటూ ఉండాలి. మన ప్రమేయం లేకుండానే మనకు అనేక అవకాశాలు కలుగుతుంటాయి. అవి మళ్ళీ క్రిందికి తోసేసేవి కాగూడదు. అవకాశం వినియోగించుకోవడానికి మాత్రమే. వెలుగును పెంచుకోవడానికి మాత్రమే. ఆకాశ స్థాయికి చేరడానికి మాత్రమే. మనస్సు నిరంతరం ఆకాశ స్థాయిని చేరడానికి లోక వ్యవహారాలు తగ్గించుకొని ఆకాశాన్ని, వెలుగును, వేడిమిని, వాయువును గమనిస్తూ, భావిస్తూ, దర్శిస్తూ ఉంటే స్థాయి తగ్గే అవకాశం ఉండదు. క్రింది స్థాయిలో పొందడానికి అవకాశాలు వస్తాయి. వాటిని వదిలి పెట్టి ఎప్పటికీ ఉన్నత భావాలు, విషయాలపై దృష్టి కేంద్రీకరిస్తే ఇతరులకు మనం ఆదర్శం అవుతాం.

# జగద్ధాత్రీ! పాహి పాహి!



క్రూరపు భావముల్ ఘోరమై చెలగుటన్
తొలగించ రావమ్మ పలుకులమ్మ
దుర్భర కృత్యముల్ నిర్భయంబుగ హెచ్చ
దండింప రావమ్మ చండికగను
మాలిన్య చిత్తముల్ మంటలన్నెంచగా
చల్లార్ప రావమ్మ శైలపుత్రి
దుర్మద శీలముల్ దుర్నీతి రాపాడ
దునుమాడ రావమ్మ కనకదుర్గ
పరిగి పెరగుఉచుండిరి కదా ! భువి పాప
కర్ములందరు భావ భాగ్యముల జెరుప
నట్టివారి నణచగ రావమ్మ యంబ
జనని జగదంబ పావనీ! చంద్రఘంట!

జారులు చోరులు దారుణ
మారణ హోమము సలుపుచు మానవ విధులన్
మారక మొనర్చ వారిని
జోరుగ దునుమను కనుమిటు శోభన దీప్తి!

విపరీత పోకడల్ వెఱ్ఱి వేషములెన్నొ
వెలయించుచుండిరి వేయి తీర్లు
మహిష వారసుల్ మహి వీడలేదింక
మూర్ఖపు ఛాయలు ముసిరి నిలిచె
శుంభ నిశుంభుల సోదర దౌష్ట్యముల్
దుర్నిరీక్ష్యములయ్యె త్రోవనిండ
రక్త బీజాంగముల్ రాటు దేలుచునుండె
మహిని వేదికనెక్కి మాయజేయ
స్త్రీలు బాలురు వృద్ధులు రేయి బగలు
భయము హెచ్చుగ బ్రతుకది భారమవ్వ
నిన్ను వేడుచునుండిరి నిగమ కల్ప
వల్లి! తల్లీ! శరణు నీవె వారిజాక్షి!

మొల్లలు జాజులు మల్లెలు నిండుగ
నిడెదను బ్రోవుమా! నీరజాక్షి!
మందార చామంతి నంది వర్ధనముల
నర్పింతు రక్షించు మఖిల జనని
పారిజాత కమల బంతి మోదుగలతో
నర్చింతు కాపాడు మమ్ము కాళి!
కనకాంబరమ్ములు గలయ గులాబీల
పూజింతు కనవమ్మ పూర్ణరాశి!
పట్టు కుచ్చులు దవనముల్ కట్టి కూర్తు
కలువ విరులమాలలు వేతు కరణజూపు
జగతి శక్తి రూపిణివమ్మ చారునేత్రి
భారతీ లక్ష్మి! కాళికా భావరూపి!



తిమిర సంహారమ్ము ధీయుక్తి జేయంగ
నినుబోలు వారేరి నిఖిల జగతి
దుష్టశిక్షణ జేయ శిష్ట రక్షణ జేయ
నీ సాటి శక్తులు నేల లేవు
ధర్మరక్షణ జేయ కర్మభువిని బ్రోవ
నిన్నాపు యోధుల నెగడు లేదు
కోటి సూర్యుల వెల్గు గుమ్మరించెడి జ్యోతి
బ్రహ్మాండ మందెట పాలుపోదు
భాసురమగు నీ మహిమల భావమిట్టు
లనుచు వర్ణింప తరమౌన యాది శక్తి
శిరము నీ చరణమ్ముల చెంతనుంచె
ద నెపుడైన నీ దాసత్వ తన్మయముగ



మెట్టెలు పారాణి మెరుగైన యందెలు
పాదద్వయంబున భక్తినిడెద
మొలకు నొడ్డాణంబు మోచేతి కంకణం
చేతుల గాజులు జేర్చి నిడెద
కంఠెలు హారముల్ కల్యాణ మంగళ
సూత్రము శోభిల్ల జూడ నిడెద
ముక్కెర లోలాకు ముద్దుటుంగరములు
పాపిట బిళ్ళను బత్తి నిడెద
చెంపలకు చారెడు పసుపు చెక్కిళులకు
గంధము నుదుట తిలకంబు కాటు కను
దోయి సిగల పువ్వులనెన్నొ తురిమి కొలుతు
శాంకరీ శుభంకరి గౌరి! జయము నీకు!

---

**డా. వాజ్జల శరత్‌బాబు**
**ఉపాధ్యాయులు, హైద్రాబాద్, ఫోన్ : 9963533937**

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 12 (6)
UGC Care List Approved Journal
హైదరాబాద్ అక్టోబర్ : 2022

# పూల తేరు ...!



బ్రతుకునిచ్చు నమ్మ బంగారుబతుకమ్మ
స్ఫూర్తి కీర్తినొసగి శుభము లిచ్చు
పువ్వుపువ్వులోన పుట్టెడు పుణ్యము
కలుగజేయు మనకు కలిమి బలిమి!

రంగురంగుపూల రాశుల బతుకమ్మ
ఆటపాటలందు నలరు చుండ
అందచందములకు నపురూప దృశ్యంబు
చూసితీరవలయు స్ఫూర్తి ప్రదము!



తేజరిల్లుచుండు తెలగాణ మందున
మరువలేరు స్త్రీలు మనసు లోన
రాష్ట్రప్రభుత తీరు రమణీయ భావన
పల్లె పట్న ప్రజల పారవశము!



మూలకారణంబు ముచ్చట్ల పరువడి
ఆడమగలకిలను హాయి నిచ్చు
మధురమైన గాన మంజుల గీతాల
గౌరిమాత కిచ్చు గౌరవంబు!

పడతులంతకూడి బతుకమ్మలాడుతు
కన్నులపండువగాను కాంతులీన
మోదమలర తిరుగ బొడ్డెమ్మ చుట్టును
కొమ్మలంత హాస కోర్కెలమర!




పసుపుతోడజేసి పసిడి గౌరమ్మకు
తీరుతీరుపూల తీర్చిదిద్ది
భక్తిమీర స్త్రీలు బాగుగా కొలువగ
అభయమివ్వుతల్లి నంజలిడుదు!

బంగరుబతుకమ్మ భాతి తెలంగాణ
సాలు సాలు సాగు సంబరమ్ము
జలధి దాటి తాను జగమంత ప్రాకుచు
పూజలందుకొనెడి పూలతేరు!



డాక్టర్ గన్నోజు శ్రీనివాసాచారి
మహబూబ్ నగర్, ఫోన్ : 85558 99493

# తుకారాం అభంగం

సాధు జనుల సహవాసము
శుద్ధ శ్రీ గంగా ప్రవాహము
భాగ్యమదే చేయి విడవకు
అదే భగవంతుని వాసము

చూడు మరలి ప్రీతిగ నిలిచే
నీ వీపుతట్టి సదానందుడు
అదుముకోరా ఆత్మరూపిని
ఆది అనంత పరంజ్యోతిని

అంగుష్ఠ ప్రమాణ రూపము
సాధనమున సాదృశ్యము
సాధించు నిన్ను నీవు గెలిచి
పరమాత్మ పరబ్రహ్మ రూపిని

తుకా పలుకు నిదే సత్యము
ఇటుక మీద స్వామి తత్వము




అనువాదం : డా॥ మంత్రి శ్రీనివాస్
ఆదిలాబాద్.
ఫోన్ : 83283 33720

# తెలుగు కవిత్వం – బాల పాలేరుల జీవిత చిత్రణ

**డా. సుంకర గోపాలయ్య,** తెలుగు శాఖాధిపతి, డి.ఆర్.జి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తాడేపల్లిగూడెం. ఫోన్ : 9492638547



**"పాపం, పుణ్యం, ప్రపంచమార్గం**
**కష్టం, సౌఖ్యం, శ్లేషార్థాలూ**
**ఏమీ ఎరుగని పూవుల్లారా**
**అయిదారేడుల పాపల్లారా**
**మెరుపు మెరిస్తే**
**వాన కురిస్తే**
**ఆకసమున హరివిల్లు విరిస్తే**
**అవి మీకే అని ఆనందించే**
**కూనల్లారా !"** అని శ్రీశ్రీ బాల్యాన్ని గుర్తు చేసుకున్న సంగతి మనకు తెలుసు. ఇది 1934లో రాసిన కవిత. అప్పటికే మన ప్రాంతంలో 'పాలేరు' వ్యవస్థ ఉంది. బాల పాలేర్లుగా తమ అపూరూపమైన బాల్యాన్ని కోల్పోయిన సన్నివేశం ఉంది. వారి ఆనందాన్ని అదిమేయడం ఉంది. కొందరికి బాల్యం ఒక వసంతం. మరికొందరికి ఎడారి. అలా ఎప్పటినుంచో కిందకు చూసే ఆకాశం, నిలబడి కలలు కనే కొండలు, ....రివ్వున వీచే గాలి, ప్రవహిస్తూ పాట పాడే ఏరు, ఎగురుతూ ఎగురుతూ పలకరించే పక్షులు...... ఉన్నట్టుండి వాన పాట పాడే మేఘం, అలా నవ్వుతూ పలకరించే పువ్వు.... ఇవన్నీ బాల్యంలో అద్భుతాలే.... మరి అందరి బాల్యం ఇలానే ఉంటుందా, ఉత్పాతాలు లేవా .... ఉప్పెనలు రావా అంటే ఉన్నాయి.

మా చిన్నతనంలో, మా ఊర్లో నాతోపాటూ బడికి రావాల్సిన పిల్లలు.. చేతిలో కర్ర.... మరో చేతిలో సత్తు క్యారేజి పట్టుకొని వెళ్లడం చూశాను. కుటుంబం.. కుటుంబం మరో కుటుంబానికి అంటే ఆర్థికంగా బలసిన కుటుంబానికి, నిచ్చెన మెట్ల వ్యవస్థలో పైనున్న కుటుంబానికి చాకిరీ చేయడం చూశాను. ఈ వ్యవస్థకు మూలాలు ఎప్పటి నుండో ఉన్నాయి. కలిగి ఉన్నవాళ్ళు / కలిగి లేని వాళ్ళు... వారి మధ్య ఉన్న ఋణాలు, ఆర్థిక లావాదేవీలు.. వాళ్లని బానిసలుగా చేసి, ఊబిలోకి లాగేవాళ్ళు.

భారతదేశ చరిత్రలో బానిసత్వ ఆనవాళ్ళు పురాతన, మధ్య, ఆంగ్లేయుల కాలంలోను ఉన్నట్లు చరిత్ర చెబుతోంది. కౌటిల్యుని అర్థశాస్త్రంలో 9 రకాల "దాస" అని పిలువబడే బానిసలు ఉండేవారని తెలిపాడు. మనుషులను అమ్మడం, కొనడం కొనసాగేది. మనువాద శాస్త్రం ప్రకారం 7 రకాల బానిసలు ఉండేవాళ్ళు. ఏది ఏమైనప్పటికి బానిసత్వం, వెట్టిచాకిరి వీటికి ప్రధాన కారణంగా గ్రామీణుల్లో ఉన్న పేదరికం మరియు సమాజంలోని కులవ్యవస్థను ప్రధానంగా చెప్పవచ్చు. పొలంలేని వాళ్ళు, నిమ్నకులాలు వాళ్ళు, శూద్రులు వివిధ రకాల పనుల్లో బానిసలుగా చూడబడ్డారు. బ్రిటిష్ ప్రభుత్వం 1843, 1861 చేసిన చట్టాలతో బానిసల వ్యాపారానికి అడ్డుకట్ట వేయడం జరిగింది. మొదటి లా కమీషన్ కూడా మానవతా దృక్పథాన్ని కనబరిచింది. వెట్టిచాకిరీ వ్యవస్థలో వ్యవసాయ పరమైన పనులు కూడా ఉండేవి. పశువులు కాయడం, పంట వేసిన నాటి నుండి ఇంటికి వచ్చేవరకు అన్నీ పనులు చేయడం.... కుటుంబం మొత్తం యజమానికి బానిసలుగా ఉండటం, తండ్రి పాలేరుతనం చేయడం, చిన్న బిడ్డను కూడా **"బాల పాలేరుగా చూడటం"** మొదలైంది.

ఈ 'పాలేరు' అన్న మాటకి **"మేడిపాలికి దున్నెడు మరక"** అనే అర్థం శబ్దరత్నాకరంలో ఉంది. ఇది దేశ్యము మరియు విశేష్యము ఐన పదం. **రోజు లెక్క కాక సంవత్సరానికి ఏర్పరచుకొని పొలం పని చేసేవాడు, సేద్యగాడు** అనే ప్రాంతీయ మాండలిక అర్థం కూడా ఉంది. కూలి, పాలేరు అని కళింగ ప్రాంతంలో వాడుక ఉంది. కూలోడు అని తెలంగాణా మాండలికంలో వాడుక ఉంది. **సేద్దెగాడు, గాసగాడు** అని రాయలసీమ మాండలికంలో ఉంది. జి.ఎన్. రెడ్డి పర్యాయపద నిఘంటువులో 'రైతు' అనే అర్థం ఇచ్చాడు. **"పాలికాపు"** అనేది గోదావరి జిల్లాల మండలికం. బ్రౌణ్యంలో An under Farmer, a Sub-renter, లేదా A hired Cultivator, or labourer అని అర్థం ఇచ్చారు. పై అర్థాలు పరిశీలిస్తే బాగానే ఉన్నాయి కానీ పాలేరుగా ఏర్పాటు చేసుకొని, కనీస పనిగంటలు లేకుండా, సక్రమమైన తిండి పెట్టకుండా, న్యాయమైన వేతనం లేకుండా వారి దగ్గర బండ చాకిరీ కాదు కొండ చాకిరీ చేయించుకునే వారు. ఓ ఆదివారం లేదు వీకెండ్ లేదు, అనారోగ్యం కాదు, కక్కు కాదు కళ్యాణమూ కాదు సేద్యగాడు సేద తీరే దానికి లేదు. ఇలాంటి దృశ్యాలు మా చిన్నప్పుడు చాలానే చూశాం. కానీ ఈ వ్యాసంలో మనం పాలేర్లుగా మారిన పిల్లలు గురించి మాట్లాడుకోబోతున్నాం. తమ బాల్యాన్ని పణంగా పెట్టి, జీవితాన్ని కోల్పోయిన 'బాలపాలేర్లు' గురించి తెలుగు కవిత్వంలో ఎవరైనా పట్టించుకున్నారో లేదో పరిశీలిద్దాం. **'పాలేరు'** అనగానే **బోయి భీమన్న** గారి నాటకం ప్రసక్తి లేకుండా మాట ముందుకు సాగదు. భీమన్నకి పద్మశ్రీ వచ్చినప్పుడు ఒక పద్యం రాసుకున్నారు.

**పాలేరుగ పుట్టితి, మా**
**మాలకు ఋషి వారసత్వ మార్జించితి, వాక్**
**శ్రీ లలితను సేవించితి**
**పాలించితి కావ్య జగము పద్మశ్రీనై**

భూస్వామ్య వ్యవస్థ, ధనిక వ్యవస్థ కొందరిని కులం పేరుతో తొక్కి ఉంచింది. హీనమైన, బరువైన బ్రతుకుకి భారమైన పనులకే

పరిమితం చేసింది. సమానంగా బ్రతకాల్సిన వారిని అణచి ఉంచటమే గాక నాగరికతా సంస్కృతుల నుంచి వేరు చేసింది. సమాన హక్కులు, ఫలితాలు లేకుండా చేసింది.

బోయి భీమన్న తన నాటకంలో పాలేరు వెంకన్న నాటకాంతంలో డిప్యూటీ కలెక్టర్ స్థాయికి ఎదిగిన తీరును చూపుతాడు. పాలేరుగా వెంకన్న పడే బాధల్ని చూపుతాడు. ఆ నాటకం చూసి చాలమంది మారినట్లు, గొప్ప సాంఘిక మార్పు వచ్చినట్టు మనకు తెలుసు. తెలంగాణాలో దొరల పాలనలో ఎంతోమంది పిల్లలు చదువుకి దూరమై పాలేర్లుగా దుర్భర జీవితాలను గడిపారు. 1938లో బాలల హక్కుల చట్టం చేశారు. 1976లో వెట్టిచాకిరీ వ్యవస్థ రద్దు గురించి చట్టం చేశారు. 1986లో బాల కార్మిక నిషేధ చట్టం చేశారు. అయినా బాల కార్మికులు తగ్గారా, వ్యవస్థ పూర్తిగా అదృశ్యమైందా అంటే కోటి రూపాయల ప్రశ్న. **'బాల పాలేరు'** అనగానే ఇప్పటికీ గుర్తుకు వచ్చే పాట **సుద్దాల హనుమంతు** రాసిన 'పల్లెటూరి పిల్లగాడా' ఆయన ఉద్యమ సమయంలో ఊరూరా తిరుగుతూ పాటను నీటిపాయగా ప్రవహింజేస్తున్న కాలంలో, పశువులు కాసే పసిబాలుణ్ణి చూసి–

**"పల్లెటూరి పిల్లగాడ**
**పసులు గాసే మొనగాడ**
**పాలు మరచి ఎన్నాళ్లయిందో**
**ఓ పాల బుగ్గల జీతగాడ**
**కొలువు కుదిరి ఎన్నాళ్లయిందో "**

తెలంగాణా వెట్టి చాకిరీ వేదనా గీతానికి పల్లవి ఈ గీతం. పాలకోసం గుక్కపట్టి ఏడ్చే శిశువులపై జాలిచూపని దొరతనం పాలబుగ్గల పసివాడిని పసులకాపరిగా పనిచేయించుకోవడంలో ఆశ్చర్యమేమి లేదు. ఈ పాట బాల్య జీతగాళ్ల దుస్థితిని ఆవిష్కరిస్తుంది.

**"చాలీ చాలని చింపులంగి**
**చల్లగాలికి సగము ఖాళీ**
**గోనెచింపు కొప్పెర పెట్టావా**
**పాల బుగ్గల జీతగాడ**
**దానికి చిల్లులెన్నో లెక్కపెట్టావా"**

కూడు, గూడు మనిషి ప్రాథమిక అవసరాలు, గుడ్డ కూడ లేకపోవడం, ఒంటిపై చాలీచాలని చిరిగిని అంగితో వణికించే చలిలో పనిచేయడం, అనేక చిల్లులున్న కొప్పెరతో ఎండా, వానలతో చేసే జీవన పోరాటాన్ని గుర్తుచేస్తూ పసులు గాసే మొనగాడు అని చెప్పడంలో ఔచిత్యం ఉంది. ఇందులో 'బాలపాలేరు' ఎలా ఉండేవాడో చెబుతూ తాటిజెగ్గల కాలిజోడు, తప్పటడుగుల నడక తీరు, స్నేహితుల తోడు కూడా లేకుండా నీకు 'చేతిలో కర్ర' తోడైంది. బాల్యం కర్రతో పంచుకోవాల్సిరావడం ఎంత విషాదమో కవి మనకు చెప్పకనే చెబుతున్నాడు.

**"కాలువై కన్నీరు గార**
**కండ్లపై రెండు చేతులాడ**
**వెక్కి వెక్కి ఏడ్చుచున్నావా ఓ పాలబుగ్గల జీతగాడ**
**ఎవ్వరేమన్నారో చెప్పేవా"**

ఇందులో వయసుకు మించిన కష్టం, బాధ్యతలు, యజమాని పెట్టే కష్టాలు, మనసును గాయపెట్టేలా తగిలిన తిట్లు, దూరంగా ఉన్న అమ్మ.. ఇవన్నీ గుర్తుకొచ్చి పసి హృదయ వేదనా స్వరం వినిపిస్తుంది.

**"పాలి కాపు నిన్నే కొట్టాడా**
**నీకు జీతం నెలకు కుంచం**
**తాలు వడిపిలి కల్తిగాసం**
**కొలువగా సేరు తక్కువ వచ్చిందా**
**ఓ పాలబుగ్గల జీతగాడ"**

ఇక్కడ పిల్లవాడు ఎన్ని కష్టాలు ఓర్చినా, భరించినా తిండి గింజల కోసమే కానీ అక్కడే మోసపోవడం, తాలువడ్లు, పొట్టు, ఊకతో ఉన్న వడ్లు.... వాటిని కొలిచినా సేరు తక్కువే ఎటుచూసినా మోసమే శ్రమ దోపిడి...

ఆనాటి సమాజంలో గ్రామీణ ప్రాంతంలోని దొరలు, భూస్వాములు, అగ్రకులాలు తమ దగ్గర పనిచేసే వారిని, వారి పిల్లలను బడికి దూరం చేశారు. కాదు పెట్టారు. చదువుపై అప్రకటిత నిషేధం. కింద కులాలవారు, వెట్టిలో ఉన్నవాళ్ళు నిరక్షరాసులైనారు. అక్షరం నేర్చుకుంటే ప్రశ్నిస్తారు అని గుర్తించిన యజమానులు, తమ ఆధిపత్యానికి ఎసరు తగులుతుందని వీరిని విద్యకు దూరం చేశారు.

**"పాఠశాల ముందు చేరి**
**తోటి బాలుర తొంగి చూసి**
**ఏటి కోయీ వెలవెల బోతావు**
**ఓపాలబుగ్గల జీతగాడ**
**వెలుగులేని జీవితమంటావా"** అని పాట ముగుస్తుంది.

అయితే తరువాత వచ్చిన చట్టాల ప్రభావంతో 'బాల పాలేర్లు' గణనీయంగా తగ్గారు అనే విషయం చెప్పవచ్చు గానీ బాల కార్మికులు మాత్రం ఉన్నారు. ఐక్యరాజ్యసమితి 1989లో బాలల హక్కుల అంతర్జాతీయ ఒడంబడికను రూపొందించింది. దీనికి అనుగుణంగా 1992డిసెంబరు 11న భారతప్రభుత్వం ఆమోదించి, సంతకం కూడా చేసింది. ఆ ఒడంబడిక ప్రకారం 18 సం॥రాల వయస్సులోపు మానవుల్ని 'బాలలు'గా పరిగణించింది. భారత ప్రభుత్వం ఈ మధ్య 14 సం॥ వరకు మాత్రమే 'బాలలు' అనే నిర్వచనం వర్తిస్తుందని మార్పు చేసింది. **'బాలపాలేర్లు'** నేపథ్యంగా వచన కవిత్వంలో ఏమైనా కవితలు ఉన్నాయా అని పరిశీలిస్తే... వచన కవులు పెద్దగా స్పందించలేదని గుర్తించవచ్చు. రెండు రాష్ట్రాలలోను జల్లెడ పడితే, వలవేస్తే 7 కవితలు దొరికాయి.

సుదేరా రచించిన **'పాలబుగ్గల పాలేరు'** కవిత హృద్యంగా ఉంటుంది. ఇది 2003లో రాసిన కవిత. 89 పాదాల కవిత ప్రతి లైను ఉటంకించదగింది.

**"ఓ కందువాను డాలుగా చేసుకొని**
**ఓ గోచిపాతని కవచంలా అడ్డు పెట్టుకొని**
**సమరం సాగిస్తుంటాడు వాడు**
**తన కన్నీళ్ళని కడవలకెత్తి వాకిట కల్లాపేస్తాడు**
**తన చెమట పరిమళాన్ని చేనంతా విరజిమ్ముతాడు**
**మేతేసే చేతులకోసం కొట్టంలో గొడ్లు గొంతెత్తి - అరుస్తున్నప్పుడు**
**పోలేరమ్మరాటకి అంటదీసి కట్టిన మేక పిల్లై**
**విలవిల్లాడిపోతాడు - వాడు**
**పాలెరై తన ఆయుష్షనంతటినీ నేల నిగారింపు కోసమే**
**- పొలిగా చల్లేస్తుంటాడు"**

అంటూ 'బాలపాలేరు' ను ప్రత్యక్షం చేస్తాడు. చద్దిముద్దకోసం చదువుకోవలసిన వయసుని కోసి కసువుగా మేపుతుంటాడు, అంటరాని పెంట పొగై అందమైన ఆశల్ని కుళ్ళబెట్టుకొంటాడు. లేలేత రెక్కల్ని ముక్కలుగా నరుక్కొని, నారుమళ్ళకి నంజు పెడుతుంటాడు.

**"నిత్య బానిసత్వానికి బతుకుని కుదవ పెట్టుకొని 'ఎలపట - దాపట' ఎడ్లమధ్య నలిగిపోయే నాగలి కాడివాడు"** అంటూ సుదేరా బలమైన వాక్యాలతో చెబుతాడు. 'బాలపాలేరు'గా వాడి శ్రమరూపాన్ని చూపుతాడు. మొక్కజొన్న చేల్లో చిలకల్ని తోలే దిష్టిబొమ్మగా, పల్లేరు కాయల పక్కపై పవళించే బాల భీష్ముడిగా, బతుకంతా కంతలమయమైన వాడికి, ఆశల అరికాళ్ల నిండా ఆనెలు మొల్చిన వాడు, పచ్చదనం కోసం, పశుసంతతికోసం... పడుచుదనాన్ని ధారపోసే సదాశయ శిఖరమైన వాడికి అంటూ ... పాలేరును ధనాత్మక కోణంలో చూపుతాడు. పొలంకోసం పగిలి పగిలి వాడి కాళ్ళు నాగేటి చాళ్ళల్లో పరుగెత్తే నీళ్ళవుతాయని, దాళ్వా ఆకుమళ్లో గళ్లకి అడ్డం పడే వంద్రు కట్టలవుతాయని, పాలుగారే పసితనమ్మిది చెరిగిపోని నిలువెత్తు పేదమరక వాడని వాపోతాడు.

**"బాల్యం అమ్మబడును"** అనే కవితలో **జైత్ర** అనే కవయిత్రి...

**అయ్యలారా! తల్లులార**
**పండగల కేముందీ....**
**కేలండర్‌లో తేదీలు ప్రసవిస్తూనే వుంటాయ్.**
**ఈ రెక్కల కెరటాలకు విశ్రాంతి లేదు**
**ఈ రెప్పల కన్నీటికి ఉపశమనం లేదు**
**పొద్దును నిద్రలేపే ఆ చిన్నారి**
**పాలేరు బతుకులే బానిస కథలే'** అని ఆక్రోశించింది. బాలల దినోత్సవం నాడు చాచాజీ మళ్లీ పుట్టాలని కోరుకోవడం, గాంధీ జయంతి రోజు గాంధీ మళ్లీ పుట్టాలని కోరుకోవడం...... కొంతమంది చేస్తుంటారు. మరి వీళ్ళు ఎవరిని ఉద్ధరించడానికి పుట్టారో తెలియదు.

**"దండెకడియం"** కవితా సంకలనం ద్వారా మన ముందుకు వచ్చిన **"తగుళ్ల గోపాల్"** ఓ బాలపాలేరు కానీ ఉపాధ్యాయుడు రాజవర్ధన్‌రెడ్డి ప్రోత్సాహంతో తాను ఓ ఉపాధ్యాయుడై మంచికవిగా గుర్తింపు పొందాడు. తగుళ్ళ గోపాల్ తన 'బాలపాలేరు' జీవితం గురించి రాసిన కవిత **"ముల్లుపాతం"** తను పశుల కాపరిగా ఉన్నప్పటి జ్ఞాపకాలను చెప్పాడు.

**"కంపల మీదంగ, ఒరికొయ్యల మీదంగ**
**ఎగిరి దుంకి ఆవుల్ని మర్లేసినంక**



**తూట్లు పడిన జల్లెడలాగా అరికాళ్ళు**
**ఎక్కడ కూర్చొంటె అక్కడ**
**కాళ్లను ముంద లేసుకొని**
**ముండ్లను తీయదంతోనే**
**గడిచిపోయింది బాల్యం"** అని చెబుతూ ఇలా గుచ్చుకున్న ముల్లు తనకో పాఠం, పోరాటం నేర్పిందని బతకడం నేర్పిందని ప్రకటిస్తాడు.

**"చిన్నప్పుడు**
**బొబ్బలెక్కిన నా కాళ్ళను జూసి**
**లబ్బరి చెప్పుల్ని కొనియ్యడమే కాదు**
**నా బతుకు పాదానికి ముల్లు నాటకుండ**
**అక్షరాన్ని తొడిగిండు మా సారు"** అని అక్షరం యొక్క శక్తిని వ్యక్త పరుస్తాడు.

మరో తెలంగాణ కవి **నాగిళ్ళ రమేష్** **"నల్ల కొడిసె వన్నె పోరగాడు"** అనే కవితలో బాలపాలేరు పనితనాన్ని చిత్రీకరించాడు.

**"పెండతో మెత్తువేసిన గాదెలోకి దిగి**
**గిన్నెతోటి అడుగు వడ్లను ఎత్తేటందుకు**
**ముక్కులనిండా, నెత్తి నిండా**
**దుమ్ము పోసుకున్న ఆ పోరడేడి"**

**"ఇరికి కొమ్మను నరుకుతూ**
**గొడ్డలి చిప్ప కాలుకొస్తే**
**గాయాన్ని దాసుకున్న**
**ఆ మెరిగెకళ్ళ అమాయకుణ్ణి**
**అచ్చంగా నాకు దొరక బట్టిస్తారా"** అని చెప్పి

**"వేళ్ల సందున చితికిన**
**బల్సుకు పండ్ల మెత్తని తీపి పుట్టుక**
**తెలిసినోడిని, గొడ్లను గాసుకుంట**
**గట్టుదొనెలో మందాలున్న**
**వాన నీళ్ళ మాధుర్యాన్ని నింపుకున్నోడిని**
**నన్ను నాకు కాస్త ఎవరైనా అప్పజెప్పండి"**

బాలపాలేరుగా తాదాత్మ్యీకరణ చెందాడు. ఇక్కడ మనం గమనించాల్సింది కొందరు బాలపాలేరు బాధల్ని చిత్రికరిస్తే, మరి కొందరు అక్కడనుండే బతుకు సులువు తెలుసుకున్నట్లుగా చిత్రీకరించాడు.

**'బహువచనం'** సంకలనంలో చిత్రం.. **ప్రసాద** అనే కవి రాసిన **'సిచ్చ'** అనే కవిత దొరసానమ్మ పెట్టిన బాధలకు, కొడుకుని కోల్పోయిన తల్లి హృదయాన్ని ఆవిష్కరించాడు.

**"యిస్వాసం ఉన్నోళ్ళం**
**గాబట్టేగా దొర్సానీ**
**మన సిన్న దొర్సాని ఇస్కూల్ల జేరినేడే**
**మా సంటోణ్ణి మీ జీతంల బెడ్తిమి"**

వాడికి జ్వరమొచ్చినా, గుణమొచ్చినా కాపాడుకున్నా, గోడ్లతో కూడా తిరిగి తిరిగి గజ్జల్లో ఉరుముదిగితే ఒడిలో పడుకో బెట్టుకొని, తెడ్డుతో కాసి కాపాడుకున్నా.... కానీ మీ దొర గాట్లో గొడ్డును గొట్టినట్టు కొట్టినా, గొడ్రాలు మాదిరి చూసిన పాపిష్టి దాన్ని అలాంటిది నా కొడుకుని కరెంట్ షాక్ సాకుతో చంపేశారు. ఇగ మీరు కంటి నిండా నిద్రపోండి... శాపాలు పెట్టడానికి కూడా మాది పిల్లి పిరికితనం. అని ఓ తల్లి వేదనను రాశాడు.

**"అవునులే దొరా !**
**నా కొడుకు కానక కరంటు బట్టే సచ్చిందు**
**అన్ని కచ్చ బట్టి సంప,**
**ఎవడి పెండ్లాం బిడ్డల కన్నా అలవాటైందా**
**నా సొదు తాగినోళ్లంతా**
**ఎనకా ముందు ఆడి కాళ్ళకాడికి పోయేటోల్లె'**

తర్వాత మీరు కూడా పోతారని ఆ తల్లి ఆక్రోశంతో కవిత ముగుస్తుంది.

మెట్టా నాగేశ్వరరావు రచించిన **'మనికపద్యం'** కవితా సంపుటిలో **'పసులు గాసే పోరడు'** వేరే కోణంలో రాసిన కవిత-

**"వాడినల్లంత దూరంలో చూడగానే**
**పడుకున్న పసులన్నీ లేచి నిలబడతాయి**
**రోజంతా సూర్యుడిలెక్క**
**పసులెంట తిరుగుతూనే వుంటాడు**
**ఏ పశువు కన్నా ఒంట్లో బాగాలేదంటే**
**వాడికి నిద్రాహారాలుండవు"** అని చెబుతూ ఒక ఆశావహ ముగింపు ఇలా ఇస్తాడు.

**'నేను ప్రార్థిస్తుంటాను**
**పసువుల్ని వాడిని ప్రేమగా చూసుకున్నట్టు**
**పని జేయించుకునే యజమానైనా**
**వాడిని చేరదీసి అంతే ప్రేమ వాడికివ్వాలని'**

పాలేర్లు పడే బాధల్ని హృద్యంగా వర్ణించిన మరో దీర్ఘకావ్యం. గొడిముక్క ఆర్. రామకృష్ణగారు రాశారు. శారీరక కష్టం, యజమాని మాటల దెబ్బల గురించి, పాలేర్ల ఆకలి బాధలు, జీతపు బాధలు, మోసాలు ఆవేదనతో చిత్రీకరించారు.

బాల పాలేర్లుగా పిల్లలు ఇప్పటికీ అక్కడక్కడా కనిపిస్తుంటారు. ఆర్టికల్-45, 14సం॥లోపు పిల్లలకు ఉచిత నిర్బంధ విద్య, విద్యాహక్కు చట్టం, మధ్యాహ్న భోజనం లాంటి పథకాలు వచ్చాక తీవ్రత చాలా వరకు తగ్గింది. కానీ బాల కార్మికుల సంఖ్య మాత్రం హెచ్చుగానే ఉందని చెప్పాలి. 2011లెక్కల ప్రకారం దేశంలో దాదాపు కోటి వరుకు బాల కార్మికులు ఉన్నట్లు అంచనా. యునిసెఫ్ బాలల హక్కుల పేరిట చట్టం చేసింది. రాజ్యాంగంలో ఆర్టికల్ 24, 39 (ఎఫ్) 39 (ఇ) లాంటి ఆదేశ సూత్రాలు బాల్యాన్ని నాశనం చేసే రీతిలో బాలుడు లేదా బాలిక పనిచేయడం, వారి మానసిక, శారీరక అభివృద్ధికి, వినోదానికి, అక్షర జ్ఞానానికి దూరం చేయడం నేరంగా పరిగణించారు. శ్రీశ్రీ అన్నట్లు-

**"బాలలే విజ్ఞాన కేతువులు**
**నేడు రేపుల మధ్య సేతువులు**
**చంద్ర బంధుర సుధా శీతవులు**
**మానవత్వ వికాస హేతువులు"**

కనుక బాల్యాన్ని బాల్యం లాగే చూడాలి. శ్రమ దోపిడి ఏ రూపంలో ఉన్నా అడ్డుకోవడం మన కనీస బాధ్యత. చాలా స్వచ్ఛంద సంస్థలు అద్భుతంగా పనిచేస్తున్నాయి. మనమూ ఓ చేయి అందిద్దాం. బాలలకు భరోసా ఇద్దాం.

**ఆధార గ్రంథాలు :**

1. జీవనోత్సవం -ఎక్స్‌రే అవార్డు కవితల సంకలనం - కొల్లూరి
2. దీర్ఘ కవితా వికాసం - డా॥ పెళ్లూరు సునీల్
3. దండెకడియం - తగుళ్ల గోపాల్
4. పాలేరు - బోయి భీమన్న
5. మనిషోక పద్యం - మెట్టా నాగేశ్వరరావు
6. ఉద్దరాసి పురుగు - నాగిళ్ల రమేష్
7. బాలల హక్కులు - వికాస్ సంస్థ.

బండారం కథలు -11

# తడిసి మోపెడు

డా. నందిని సిధారెడ్డి, ఫోన్ : 9440 381148



నెలరోజులు దినాం వాన కురిసినా నిండని చెరువు ఆరోజు ఒక్కవానకే నిండి అలుగు పారటం ఆశ్చర్యంగా ఉంది. సాయంత్రం వచ్చిన వాన, సాయంత్రం వచ్చిన చుట్టం తొందరగా పోరని సామెత. నిజమే. సాయంత్రం పొద్దు వంగేదాకా మొగులు మీద ఏ అలికిడి లేదు. చీకటి పడే సమయానికి దడదడమని ఒక్కసారే కుమ్మరించింది. రాళ్లు తాకినట్టే పెద్ద పెద్ద చినుకులు. అంతకుముందే కొంచెం కొంచెం ఉరుముతుంటే ఈ ఉరుమాలకేం తక్కువలేదు అనుకున్నా రంతా. చూస్తుండగానే మెరుపులు మొదలయ్యాయి. 'మెరిసెతందుకు సిగ్గనిపిస్తలేదెమో' అన్నదో ముసలమ్మ వాన మీద నమ్మకం లేక. పనులు చేసుకునేవాళ్లు 'వచ్చేదా చచ్చేదా ఊకూకె బెదిరిస్తది'అనుకుని తమ పని తాము చేసుకుంటున్నారు. అంతలోనే వాన. వానశేర్లు ఆ వూర్లోనే దిగినట్టు వాన. మేఘాలు ఉరుముతూనే ఉన్నాయి. మనుషులు ఉరుకుతూనే ఉన్నారు. వాన అందుకుంది. అందుకున్నదంటే ఇక ఇడువలేదు. పడుతూనే ఉన్నది. దమ్ము తీసుకుంటూ పడుతూ ఉంది. మేఘాలకు రంధ్రాలు పడ్డట్టు కురుస్తున్నది వాన. ఉరుములకు భయపడి పశువులు అరుస్తున్నాయి. పిడుగు పడకుండా ఉండటానికి 'అర్జున ఫల్గుణ పార్థ కిరీటి... ' పిరికి పిల్లలు తెలివిగా స్మరించుకుంటున్నారు. వాన, శిగమొచ్చినట్టే వచ్చి ఇసిరిసిరి కొడుతుంది. దరాదరా దంచుమంటే దంచుతున్నది. చీకటీ, వానా ఒక్కటైనాయి. పెంట బొందలు నిండి పారుతున్నాయి. కప్పల చప్పుడు, వాన చప్పుడూ కలిసి కల్లోలంగా వున్నది. వాకిల్లు నిండి, బజార్లు నిండి వరద హోరెత్తుతున్నదని అనుభవమున్న వాళ్లకు అర్థమైపోయింది. 'ఈ దెబ్బతో ఏడేండ్ల శని కొట్టుకపోయినట్టే' అన్నాడు నిద్రపోని ముసలాయన.

మబ్బులు పల్చబడి తెల్లారేముందట తెలికపడింది ఆకాశం. ఊరు స్నానం చేసి తుడుచుకుంటున్నట్టుంది వాతావరణం. చెట్లమీది దుమ్ము, గట్లమీది దుమ్ము కడిగి ఆరబెడుతున్నట్లు తెల్లారుతున్నది. జోరసంచి కొప్పెర పెట్టుకొని నీరటిమల్లయ్య చెరువు దగ్గరికి చేరుకున్నాడు. మత్తడి దుంకి రాతిగుండ్ల నడుమ నుంచి బొళబొళమని చప్పుడు వినిపించింది. చెరువు అలుగుపారుతున్నట్టు అర్థమైపోయింది. ఊపిరి పీల్చుకున్నాడు. సరాయించాడు. అటు పక్కకు ఇటు పక్కకు తిరిగి చూశాడు. మసక మసక వేకువలో సైతం నీటి నురుగు తెల్లగా సుడులు తిరుగుతూ కనిపిస్తున్నది. అనుమాండ్ల పానాది నుంచి పెద్ద వరద చప్పుడు చేసుకుంటూ వచ్చి ఊరి చెరువులో కలుస్తున్నది. అటువక్క నుండి సరాయించుకుంటూ మస్కూరి చంద్రయ్య వచ్చాడు. నోట్లో చుట్ట వెలుగుతున్నది. ఇద్దరూ పలకరించుకుంటుంటే సాయిరెడ్డి చేరుకున్నాడు. అట్లా అట్లా చూస్తుండగానే 'చెరువు అలుగుపోతున్న' దని ఊరంతా తెలిసిపోయింది. నడుము వొంగిన ముసలమ్మ కట్టె చప్పుడు చేసుకుంటూ వస్తుంటే 'ముసల్దానికేం తొందరో చూసెతందుకు' అన్నాడు సాయిరెడ్డి. కొందరు పిల్లలు వణుక్కుంటూ అక్కడికి చేరుకున్నారు. ఒకరు... ఒకరు... తెల్లారేసరికి నీళ్లు అలుగెల్లినట్టే జనం అలుగెల్లి చెరువు బాట పట్టారు.

నీళ్ళను ఎంతసేపు చూసినా చూడాలనిపిస్తుంది. చెరువును చూసి ఊరు మురిసిపోతుంది. అలుగు పారక ఎన్ని ఏండ్లయిందో గుర్తు చేసుకుంటున్నారు కొందరు పెద్దలు. **'ఏం వాన... ఏం వాన... ఇంత వాన నా జన్మల చూడలేదంటే, నా చిన్నప్పుడు జూసిన్నంటె మల్ల గిప్పుడే జూసిన....' 'నీళ్ల కతనే వేరు. లేకపోయినా కష్టమే, ఎక్కువైనా కష్టమే. నాల్గురోజుల దాకా అలుగు దాటనియ్యది. కట్టవతలి బాయిల కాడికి పోనియ్యది. ఏ పని జేసుకోకుంట.... పోకుంట... రాకుంట....', 'చెరువు చూడు, నిండు కుండ లెక్క ఉన్నది'. 'కాదు, కాదు కడుపుతోనున్న ఆడదానిలెక్కున్నది'. 'పంటగుండు మీద జానెడెత్తు నీల్లు పోతున్నయి' 'గంతేనా గుండు మీద నిలువెత్తు నీళ్లు పోతున్నయి'**. ఎవరికి తోచిన మాటలు వాళ్లు మాట్లాడుతున్నారు. 'మూడుపంటలకు దోకా లేదు' అన్నాడు సాయిరెడ్డి. పిల్లలు నీళ్ల దగ్గరికి పోబోతుంటే వారిస్తున్నారు కొందరు. వినకుండా ఇద్దరు పిల్లలు నీటిపక్కకు చేరి నురుగుతో కాళ్లు తడుపుకున్నారు.

మస్కూరి నర్సయ్య వచ్చి వాళ్లను లాగేశాడు. కొందరు యువకులు ఒకరికొకరు రెచ్చగొట్టుకుంటున్నారు. అలుగు పారుతున్నా ఇవతలికెల్లి అవతలి పక్కకు దాటే ధైర్యమున్నదా? అనుకుంటున్నారు. పల్చగ పారే చోటు నుంచి వెళ్లొచ్చంటే కాదు తొవ్వ ఎట్లున్నదో అట్ల ఆ నీళ్లల్ల పోవాలె' అని మరొకరు. వాళ్ల మొఖాల్లో హుషారంతా మాటల్లో పారుతున్నది. వచ్చినవాళ్లు కొందరు చూసి వెళ్లిపోతుంటే వెళ్లినవారు చెప్పితే వచ్చి చూసేవాళ్లు కొందరు. పిల్లలైతే విడువకుండా ఆడుతున్నారు. ముఖాలు కడుగకుండా లేవగానే వచ్చినా పొద్దు బారెడెక్కినా, అంబటీల్ల దాటుతున్నా అక్కన్నుంచి కదులకుండా చెరువు దిక్కు అలుగు దిక్కు చూసుకుంటూ ఆనందిస్తూ వెళ్లలేకపోతున్నారు మరికొందరు. అలుగు పారటమొక ఆశ్చర్యమైతే నీళ్లను చూడటమొక వినోదంగా మారింది.

ఈ వూరి చిన్నపటేల్ అల్లుడు సుధాకర్ రెడ్డి అలుగు దగ్గరికి చేరుకోగానే దుంబాల మల్లయ్య పలకరించాడు. **"సుధాకర్ రెడ్డి దొర ఎప్పుడో వచ్చిండు"** అని. **"నిన్న పొద్దింజాముల వచ్చిన. ఇంట్ల ఇచన్న దావతు ఉండె. రాత్రి వానపట్టుకునె గద. పోనియ్యలే. ఈన్నె ఉన్నా. ఉన్నందుకు మీ ఊరి చెరువు నిండె. మా చెరువు కంటె మీ చెరువు పెద్దది గద. అలుగెల్లిందంటె పెద్దవాన అన్నట్టె".**

**"అవు. పెద్ద వానే. ఏం దంచింది ఏందంచింది దెబ్బకు చెరువు గల్లెదానంటె గదివాన"** మల్లయ్య మారు పలికాడు.

**"ఇంక జరసేపు గొడితే చెరువు తెగిపోవు. తట్టుకోకపోవు"** అన్నాడు ముసలాయన.

గుండ్ల నడుమ నుంచి ఒరుసుకుని పారుతుంది అలుగు. యువకులు ముగ్గురు ధైర్యం చేసి ఒకరి చేతులొకరు పట్టుకొని చెరువు తొవ్వ వెంబడి అలుగు దాటాలని వరదలోకి దిగారు. ఒకతను ఒక్కడే తొలి పొలంలోని రాళ్ల మీద నుంచి కట్టవైపు వెళ్ళబోయి నీటిగుండు మీద ఆగిపోయి ఆలోచిస్తున్నాడు. వెనకకు రాలేదు. ముందుకు పోలేకపోతున్నాడు. పిల్లలు అరుస్తూ చప్పట్లు కొడుతున్నారు.

**"సుధాకర్ దొర, నువ్వు అలుగు దాటుతవా"**. సుధాకర్ రెడ్డి ఆ వూరి అల్లుడయినా అందరికీ పాతమనిషే. పక్క ఊరే కావటం, పదే పదే బందారం రావటం, కలుపుగోలుగా ఉండటం వల్ల అందరితోనూ చనువుంది. దుంబాల మల్లయ్య చిన్న పటేలు ఇంటిమనిషిలాగా నడుచుకోవటం వల్ల సుధాకర్ రెడ్డితో చనువు మరింత ఎక్కువ. అప్పుడప్పుడు పరాచికాల దాకా పోతుంది. చిన్న పటేలు వాళ్లు ఆస్తిపరులే. వందల ఎకరాల భూమి. అటు సుధాకర్‌రెడ్డి వాళ్లు దుద్దెడలో దొరలు. గడీ అధికారమూ, ఆస్తి ఉండేవి. అయినా అందరితో కలిసిపొయ్యే తత్వం అతనిది. ఎక్కువ మాట్లాడినా సుధాకర్ రెడ్డి గుణమే అంత అనుకొని సర్దుకుంటారు. అలుగు దాటుతావా అని మల్లయ్య అడిగేసరికి ఆయనకు కొంచెం రేషం వొచ్చింది.

**"అలుగేం కర్మ – ఈ చెరువే దాటుత"**

**"చెరువెట్ల దాటుతవు"**

**"ఈత తోటి"**

**"ఈ ఒడ్డు నుంచి చెరువు అవతలి ఒడ్డుకు ఈదుతవా"**

**"బరాబరి ఈదుత మల్లయ్య. ఈత గొట్టుకుంటె అవతలికెల్త"**

**"గంతదూరం ఏందనుకుంటున్నవు. మైలుంటది"**

**"మైలుండని, రొండు మైల్లు ఉండని. ఈ పక్కనుంచి ఆ పక్క ఈత్త"**

**"సుధాకర్ దొర – మాటలు గాదు. యెనుకకు పోవద్దు. నరికినట్టు గాదు మరి"**

**"నరుకుడు గాదు – నాయినా మల్లేశా – నిజంగానే ఈత గొట్టుకుంట అవతలికెల్త. ఏం షర్తు చెప్పు – నేనెల్తె దేనికి ఒప్పు కుంటవు చెప్పు"** అన్నాడు సుధాకర్ రెడ్డి. మల్లయ్యకు ఆశ్చర్యమని పించింది. సుధాకర్ దొర కోతల దొర అని అందరికి ఎరుకే. ఇన్ని నీళ్లల్ల ఈతంటె మాటలా.... పందెం గెలువలేడు. జోష్ వేరు. నిజం వేరు... మల్లయ్య పరి పరివిధాల ఆలోచిస్తున్నాడు.

**"మల్లేశా – యెనుకకు పోయినట్టేనా...."**

**"నేనెందుకు యెనుకకు పోత. రొండు వందల రూపాయలు షర్తు. నువ్వు ఈత గొట్టుకుంట అవతలికి పోతె రొండు వందలు నేనిస్త. నడుతుల ఆగి యెనుకకొస్తే నువ్వు నాకియ్యాలె అదే రొండు వందలు"** అన్నాడు మల్లయ్య.

**"దావత్ కన్న కావొద్దా. రెండు గొర్లు, రెండు ఫుల్ బాటిళ్లన్న ఈవొద్దా? ఇంత పెద్ద చెరువంటవు. ఇంత చిన్న పందెమా? ఇదేం షర్తు. ఇజ్జత్ తీసే షర్తు...."** రెచ్చగొట్టాడు సుధాకర్ రెడ్డి.

**"సరే అట్లంటవా... అయిదువందలు షర్తు. నీకేమన్నయితె నా జిమ్మెదారి లేదు. నా మీదికి రావొద్దు. నింద నీళ్లున్నయి. సుధాకర్ దొర. ఆలోచించుకో"**

**"ఇగ ఆలోచన లేదు. గీలోచన లేదు. అయిదువందలు. షర్తు సై".**

చెరువు ఇటు వొడ్డు నుంచి మొదలై అటు వొడ్డుకు ఈతతోని చేరుకోవాలి. అయిదువందల రూపాయలు పందెం. **"దొరతోనేమయి తది? ఎచ్చులకు పోతె పానం పోతది. పజీతయితది"** ఎదురుగానే మాట్లాడ్తున్నారు కొందరు. **"తీట సిగ్గెరుగది. చెరువు నిండుడేంది! వీళ్లకు తీట పుట్టుడేంది? పొయ్యేకాలం"** పెదవి విరుస్తున్నారు కొందరు. **"కోడలుకు బుద్ధి చెప్పి అత్త తెద్దు నాకిందట. పోరగాండ్లు అలుగులకు పోతేనే వొద్దనుకుంట పెద్దోల్లు చెర్ల చెర్తులేంది? ఊకోండ్రి వొద్దు బిడ్డా. నీళ్లతోని పరాశికాలొద్దు"** వారించింది ముసలమ్మ.

ఎవరేమి మాట్లాడుతున్నా ఇద్దరూ పట్టించుకోదల్చుకోలేదు. అటు కొందరు ఇటు కొందరు చేరి రెండు వైపులా పురెక్కిస్తున్నారు. మల్లయ్య తాహతుకు అయిదు వందలు ఎక్కువ. సుధాకర్ తాహతుకు పందానికి దిగటమే ఎక్కువ. ఇద్దరిలో రేషం పొంగింది. జిద్దు మొదలైంది.

సుధాకర్ రెడ్డి అత్తగారింట్లోకి వెళ్ళి అడిగి కొబ్బరి నూనె తీసుకున్నాడు. రెండు చెవుల్లో సరిపోను చుక్కలు వేసుకున్నాడు. నూనెలో దూది తడిపి పెట్టుకున్నాడు. విషయం ఏమిటో తెలుసుకోవాలని భార్య అడుగుతున్నా వినిపించుకోకుండా వొచ్చేశాడు. ఏం జరుగుతుందో అందరిలో కుతూహలం మొదలైంది. జట్లు జట్లుగా గుమి గూడుతున్నారు. ఒకరికొకరు గట్టిగా చేతులు పట్టుకొని నలుగురైదుగురు జట్టుగా అలుగు వరద దాటుతున్నారు బాగా కనబడుతుతుందని చెరువుకట్టమీదికి చేరుతున్నారు. పందెం విషయం పది నిమిషాల్లో ఊరంతా పాగిపోయింది. దగ్గరివాడల నుండి ఆడ వాళ్ళు, మొగవాళ్ళు, వాళ్లను పట్టుకొని కొందరు పిల్లలు పనులు విడిచిపెట్టి వచ్చి అలుగు దాటి కట్టపొడుగునా చేరుకుంటున్నారు. అప్పటికే బావుల దగ్గరికి వెళ్ళిన వాళ్లు కూడా కొందరు కట్టదగ్గర చేరారు. ఊరికి ఏదొచ్చినా తట్టుకోలేరు. ఊరికి వస్తున్నారు. క్షణాల్లో మంది కూడుతారు.

బయటకు వచ్చి సుధాకర్ రెడ్డి భార్య విషయం తెలుసుకున్నది. కళ్లల్లో నీళ్లు పెట్టుకున్నది. వద్దంటే వినే మనిషి కాదు. అయినా చెప్పి చూచింది. సుధాకర్‌రెడ్డి బనీను విడిచి అక్కడ పడేశాడు. ప్యాంటు విడిచి పడేశాడు. కుట్టించిన నెక్కరు లాంటి డ్రాయరుతో మత్తడి దగ్గరికొచ్చాడు. ఆయన వెంట ఆయన అభిమానులూ ఉన్నారు. మల్లయ్య కూడా మత్తడి దగ్గరికొచ్చాడు. మల్లయ్య స్నేహితులూ మల్లయ్యతో ఉన్నారు. ప్రేక్షకులు రెండు పక్షాలుగా మారిపోయారు. వాళ్లలో వాళ్లు మాటలు విసురుకుంటు చోద్యం చూస్తున్నారు. ఏ పక్షాన చేరకుండా ఒత్తి పడుతూ ఊపిరి ఎగబీల్చుకుంటూ వినోదిస్తున్నారు మరికొందరు.

చుట్టూ చూశాడు సుధాకర్ రెడ్డి. కట్ట పొడుగునా మనుషులు కూడుతున్నారు. వెనుకవైపు గుంపులు. అటుపక్క మరికొన్ని గుంపులు. పిల్లలు నిక్కి నిక్కి చూస్తున్నారు. ఒకరిద్దరు పిల్లలు మత్తడి పక్కడ ఉన్న చింతచెట్టు ఎక్కి హుషారుగా అరుస్తున్నారు. కొందరైనా తమవైపు చూడాలని చేస్తున్న పిల్లల ప్రయత్నం నెరవేరటం అందరి కళ్లు మత్తడి వైపే చూస్తున్నాయి. సుధాకర్ మీదే ఉన్నాయి. సుధాకర్ రెడ్డి చెరువులోకి చూశాడు. నిండా నీళ్లు. మింగటానికన్నట్టే ఉన్నాయి. తడలు చెరువంతా ఊపుతున్నట్టు తడలు. కిందికి మీదికి ఆడుతూ ఎత్తేసుకొస్తున్న తడలు. సూర్యుని కిరణాలు పడి తళతళమంటున్న తడలు. చూపు సారించినంత దూరం నీళ్లే ఉన్నాయి. మామూలు రోజుల్లో అయితే అక్కడక్కడా దిబ్బలు కనిపిస్తాయి. ఇపుడో అక్కటి కూడా అగుపించలేదు. మనసు కొంచెం చెదిరింది సుధాకర్ రెడ్డికి. 'ఇజ్జత్ కా సవాల్' ధైర్యం చెప్పుమన్నాడు. ఇంటిపేరు, ఊరి పేరు. వంశం పేరు.. అన్నీ నీళ్లల్లో కలుస్తాయి. నీళ్లల్లో కలువొద్దంటే నీళ్లతోని గెలువాలె. 'గెలుస్తాడు'.

చెరువు నీళ్లలోకి పొరాడు. కాళ్లు టపటప కొట్టుకుంటూ సాగుతున్నాడు. చేతుల్తో తడల్ని కదుపు కిందికి తోదుకుంటున్నాడు. పిల్లలు ఎవరో చప్పట్లు కొట్టారు. యువకుడెవరో నోట్లో వేళ్లు అడ్డంగా పెట్టి ఈల వేశాడు. గాలి బలంగా వీస్తున్న చప్పుడు. మనిషి నీళ్లమీద ఈదుతున్న చప్పుడు. చూస్తున్న మనుషులు మాట్లాడుకుంటున్న ఏవేవో మాటల చప్పుడు.

ఈత నెమ్మదిగా మారింది. అల బలంగా వచ్చింది. అతను మునిగేడు.

**"చెప్పితే వినకపాయె. కష్టం నీళ్లతోని చెడుగుడు".**

**"గా పటేలుతోనేమయితది. అండ్ల దొరలు. నీడకు కూకునె టోళ్లు కుండెడు పొయ్యిమంటె పోస్తరు. ఏడయితది. తేలుతనే లేదు."**

**"పాపం, పందెమెమోగన, ఆ పిలగాని ఉసురు పోసుకునేటట్టె ఉన్నది".**

**"చెరువుల కొత్త నీళ్లు. కట్ట మైసమ్మ హారం తీసుకుంటది. తమాషనా?"** తడమీద కూచోని కొంగ తేలుతూ మునుగుతూ తేలుతూ కనిపించింది. అతను కనిపించలేదు. తనమీదికి ఎక్కడొస్తదో అని మల్లయ్య భయపడుతున్నాడు. అనవసరంగా పందెం కాశానేమో నని ఆందోళన మొలిచింది.

నడిమధ్య చెరువులో చిన్నరూపం కనిపించింది. సుధాకర్ రెడ్డి తలెత్తి అటు ఇటు జడితించాడు. కాళ్లు ఆడుతున్న దృశ్యం చిన్నగా కన్పిస్తుంది.

**"అగో... అక్కడ తేలిండు. ఆయనే.... ఆయెనే"**

కొంతదూరం చెట్టుకొమ్మ కొసనీళ్ల మధ్య తేలుతూ కనిపించింది. సుధాకర్‌రెడ్డి దమ్మొస్తుంది. చేతులు ఆడించినా కాళ్లు ఆడించినా ముందుకు కదలటం కష్టమయితున్నది. గట్టిగా ఊపిరి పీల్చుకున్నాడు. ఎవ్వరినో గుర్తు చేసుకున్నాడు. కాళ్లకు చెట్టుకొమ్మ తగిలింది. ఒక్కక్షణం కొమ్మ ఆసరాతో నిలబడ్డాడు. అలసట నెమ్మదించింది. కొత్తశక్తి కూడగట్టుకున్నాడు. **'ఇజ్జత్ కా సవాల్' 'ఈత నేర్చినోనికి జలగండమేమి'. 'లింగులిటుకు ఓడి ఉండేదేంది? తెగిన బొక్కెన నూతిల దాకా - ఇంతదూరం వొచ్చి యిశారం ఏంటిది?'** ఇజ్జత్ సుధాకర్‌రెడ్డి కండ్లలో మెరుస్తున్నది. మళ్లీ నీళ్లమీద సాగాడు. ఫర్లాంగు తర్వాత మునిగాడు.

చెరువు అవతలి ఒడ్డుకు రెండు జట్లు నిలబడ్డాయి. ఎవరి అంచనాలు వాళ్లకున్నాయి. క్షణక్షణం ఊపిరి బిగబట్టి చూస్తున్నారు. ఈ పక్కవాళ్లకు ఏమీ కనబడటం లేదు.

నీళ్లమీద మళ్లీ తలెత్తి జడితించాడు. నీటి బిందువులు చెదిరి పడ్డాయి. కొంత ముందుకెళ్లి కాళ్లు ఆనించబోయాడు. కాళ్లు ఆనలేదు. కాళ్లలో శక్తి అంతరించింది. కొంచెం సాగి కాళ్లు నిలిపితే భూమి తగిలింది. ప్రాణం లేచి వచ్చింది. నడుచుకుంటూ నడుచుకుంటూ ఒడ్డుకు చేరాడు. చేతులు చాస్తూ కేరింతలు వేశారు. చేతులు చాచి వాళ్ల మీద సుధాకర్‌రెడ్డి వాలిపోయాడు. అతని కళ్లలో ధీమా. తృప్తి. గెలుపు ఇచ్చే ఆనందం.

దుంబాల మల్లయ్య ఐదువందలు ఒప్పుకున్నాడు. ఊరు గెలుపును కొనియాడింది. ఊరు చెరువు నిండింది. నిండినందుకు పండుగ. ఊరందరికి దావతు మల్లేశా అన్నాడు. సాయంత్రానికి రెండు యాటలు తెగినాయి. రెండు బాటిల్లొచ్చినాయి. ఆరు కుండలు దిగినయి. ఊరికి ఏదొచ్చినా శిగమొస్తది. ఆవేశంతో షరతు, ఆనందంతో దావతు.

నీళ్లొచ్చినా, కన్నీళ్లొచ్చినా, దోషమొచ్చినా, ఆఖరుకు రేషమొచ్చినా ఊరును పట్టతరం గాదు.

## క్లాస్ రూం...

క్లాస్ రూం
సకల రాగాల స్వరవీణ
పలు సంఘటనల ఖజానా
పిల్లలే కాదు
ఉపాధ్యాయుడూ నేర్చుకునే
ఉభయ తారక విజ్ఞాన ప్రక్రియ
ఒక అందమైన జీవన లయ

బండి కొంచెం మెల్లగా నడుపు
ఇక్కడ స్కూలుంది
గాలిలో తేడా తెలియటం లేదా!
తరగతి దృశ్యం కల్లోల మనోహరం,
అల్లరి ఇక్కడి అంతర్గత వల్లరి
సమూహం ఒక తరంగిత ఝరి

పక్కవాడి జుట్టు పీకి
వీడు అటు చూస్తున్నాడు
వీడి పెన్సిల్‌ను
ఎవడో దొంగిలించాడు
అయినా వారి వేళ్ళు
అక్షరాల వెంట పరుగులు
తీస్తూనే వుంటాయి

పైకి బోర్డు మీద రాసే అక్షరాలే
కాని వారి లేత మెదళ్ళపై
ముద్రితమౌతున్నాయి

సార్ చెప్పే మాటలు
వారి జిజ్ఞాసకు మేలుకొలుపులు
కాస్త ఏకాగ్రతకే
నుదుట చెమట ముత్యాలు

ఒకడు కిటికీ బయట
లోకాన్ని జల్లెడ పడుతున్నాడు
సౌకర్యాలు అంతంత మాత్రమే కావచ్చు
గవర్నమెంటు నిర్లక్ష్యాన్ని ధిక్కరిస్తూ
జ్ఞాన ప్రసారం జరుగుతున్నది

కొన్ని కళ్ళు టీచర్‌ను
ఆరాధనగా చూస్తున్నాయి
చేతిలోంచి డస్టర్ రాలి పడితే
వీడు పరుగెత్తి చేతికందిస్తున్నాడు

ఇవాళ క్లాస్ రూం
ఒక నారుమడి
స్నేహ సంబంధాలు
అల్లుకపోతున్న కలివిడి.

క్లాస్ రూంను మించిన
కార్యశాల మరొకటి ఉంటుందా!
నన్ను బాలుడిగా మార్చి
మరోసారి
స్కూలుకు పంపించండి ప్లీజ్!

డా॥ ఎన్. గోపి
ఫోన్ : 939 102 8496







ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 12  UGC Care List Approved Journal
హైదరాబాద్ అక్టోబర్ : 2022

# తెలంగాణ నవల – భాష

డా. మల్లేశ్ మంత్రి, ఫోన్ : 98494 27042

**పరిచయం**

మానవ దైనందిన జీవితంలో వ్యవహారాలు నడపడానికి, భావ వ్యక్తీకరణకు భాష అవసరం. ఎవరి మాతృభాష వారికిష్టంగా, సులభంగా, సహజంగా వ్యవహరించడానికి ఉపయుక్తంగా ఉంటుంది. మనం ఎక్కువ నివసించే ప్రాంతంలోని భాషలోనే అలవోకగా సంభాషణలు జరుపుతాం. కానీ అనివార్యతలోంచి మనం తెలుగు భాషగా పిలవబడుతున్న ఆంధ్రభాషలో మనం వ్యవహారాలు చక్కబెట్టుకుంటున్నాం. వివిధ రంగాలలో మనం నష్టపోవడం, వివక్షను ఎదుర్కోవడం కారణంగా ప్రత్యేక రాష్ట్రోద్యమం చేసి, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నాం. అదేవిధంగా భాష విషయంలో మనదైన మన తెలంగాణ భాష అస్తిత్వంకోసం వెతుకులాడుతున్నాం. అందులో భాగంగానే తెలంగాణ మాండలికం అని పిలవబడుతున్న మన 'తెలంగాణ భాష'ను నిలబెట్టుకునే దిశగా పయనిద్దాం. అందుకోసం ఈ వ్యాసం ఉపకరిస్తుందని నమ్ముతున్నాను.

**"పదజాలంలోగాని, ఉచ్చారణలోగాని కొంత వైలక్షణ్యంగల ఒక భాషా మండలానికి చెందిన భాషనుగాని, ఒక భాషాశాఖనుగాని లేక మూల భాషకు చెందిన పరిమిత భాషను మాండలిక భాష అనవచ్చును."** (పురుషోత్తం. బొడ్డుపల్లి. 1982: 195).

ఆధునిక తెలుగు సాహిత్యంలో మిగతా ప్రక్రియలలాగే నవల కూడా ప్రముఖ స్థానాన్ని ఆక్రమించింది. మొత్తం నవలా సాహిత్యంలో తెలంగాణ నవల కాస్త భిన్నంగా కన్పిస్తుంది. తెలంగాణ ప్రాంత జీవనచిత్రణను తెలిపే నవలలు స్థానిక మాండలికంలో విరివిగా వచ్చాయి. నవలను మాండలికంలో రాయడమనేది తెలుగులో విప్లవసాహిత్యంతో ఎక్కువగా ప్రారంభమైంది. ముఖ్యంగా అల్లం రాజయ్యగారు రాసిన **'కొలిమంటుకున్నది'** నవల మాండలికంపై పెద్ద చర్చకు దారి తీసింది. అటువంటి నవలల్లోని మాండలిక సంభాషణలను మనం ఈ వ్యాసంలో గమనించవచ్చు.

అస్తిత్వ ఉద్యమాల్లో కవులు, రచయితలు తమ తమ అస్తిత్వాల్లోంచి సాహిత్యాన్ని సృష్టించారు. అదేవిధంగా వారి రచనల్లోని భాషలో కూడా తమ అస్తిత్వాన్ని కాపాడుకోవాలనే స్పృహలోంచి, వస్తువుకు సహజత్వాన్ని అద్దడంకోసం మొదలైన కారణాల చేత స్థానిక మాండలికాల్లో రచనలు రాయడం మొదలు పెట్టారు. అస్తిత్వ ఉద్యమాల్లో ఎలాగైతే వారి సామాజికత కాని వర్గం వారు కూడా ఇతర వర్గాల అభ్యున్నతికోసం పరితపించి రచనలు చేశారు. అలాగే భాషలో కూడా అతి తక్కువమంది తెలంగాణేతరులు కూడా తెలంగాణ మాండలికంలో రచనలు చేశారు. నవల విషయానికొస్తే తెలంగాణేతరులు కూడా తెలంగాణ మాండలిక నవలలను రాశారు. అందుకు ఉదాహరణగా పోరంకి దక్షిణామూర్తిగారు రాసిన **'ముత్యాల పందిరి'**(1969), ఇది పూర్తి మాండలిక నవల.

తెలంగాణ మాండలికంలో వచ్చిన నవలలను 'సంభాషణాత్మక నవలలు', 'పూర్తి మాండలిక నవలలు' అని విభజన చేసుకోవచ్చు.

తెలంగాణలో మాండలికంలో రాసిన వట్టికోట ఆళ్వారు స్వామిగారు రాసిన **'ప్రజల మనిషి'** (1955). ఇది 'తొలి తెలంగాణ నవల'. (చూ.ఆళ్వార్‌స్వామి, వట్టికోట. 2004: iii) దీనిలో సంభాషణాత్మక మాండలికం ఉంది. 1955లోనే **'జెగ్గని యిద్దె'** నవల వచ్చింది. ఈ రెండు నవలల్లో ఏది ముందు వచ్చిందో చెప్పడం కష్టమే. జెగ్గని యిద్దె వెలుగులోకి రాకపోవడం వల్ల అది మరుగున పడిపోయింది. ఈ నవల కూడా పూర్తి మాండలిక నవల.

తర్వాత క్రమంగా చాలా నవలలు సంభాషణాత్మక మాండలికంలోనూ, తక్కువ సంఖ్యలో పూర్తి మాండలిక నవలలు వచ్చాయి. అవి– లోకమలహరి **'జెగ్గని యిద్దె'** (1955), పోరంకి దక్షిణామూర్తి **'ముత్యాల పందిరి'** (1969), దాశరథి రంగాచార్య **'మోదుగుపూలు'** (1971),అల్లం రాజయ్య **'కొలిమంటుకున్నది'**, **'ఊరు'**, **'అగ్నికణం'** (1978–82), బి.ఎస్. రాములు **'బతుకు పోరు'** (1982), సాహు, అల్లం రాజయ్యల **'కొమరం భీం'** (1983), దాశరథి రంగాచార్య **'చిల్లర దేవుళ్ళు'** (1987), సాకేతపురి కస్తూరి **'బతుకమ్మ మునిగింది'** (1996), వసంతరావ్ దేశ్‌పాండే **'అడవి'** (1996), ఐతా చంద్రయ్య **'ఆడపిల్ల'** (1996), వేముల ఎల్లయ్య **'కక్క'** (2000), భూతం ముత్యాలు **'సూర'** (2004), వేముల ఎల్లయ్య **'సిద్ధి'** (2005), కాలువ మల్లయ్య **'గువ్వల చెన్నా'** (2005), పరవస్తు లోకేశ్వర్ **'సలాం హైద్రాబాద్'** (2005), భూతం ముత్యాలు **'పురుడు'** (2007), పెద్దింటి అశోక్ కుమార్ **'దాడి'** (2008), కదిరె కృష్ణ **'పొద'** (2010), మలయశ్రీ **'నిర్ణయం'** (2010), భూతం ముత్యాలు **'ఇగురం'** (2012), జాజుల గౌరి **'వొయినం'** (2012) మొదలైనవి. కానీ ఇక్కడ పత్ర పరిమితి దృష్ట్యా కొన్నింటిని మాత్రమే విశ్లేషించాను.

**పూర్తి మాండలిక నవలలు**

**1. జెగ్గని యిద్దె (1955) – వస్తువు :**

ఈ నవల లోకమలహరిగారు మాండలికంలో నిజామాబాద్ జిల్లా నుంచి ప్రచురించారు. ఈ నవలలోని వస్తువు విద్య ప్రయోజనాన్ని తెలియజెప్పడం. ప్రధానంగా పటేండ్లు, భూస్వాముల కబంధ హస్తాల్లో నలుగుతున్న దళితులకు విద్య ఆవశ్యకతను తెలుపుతుంది.

అదేవిధంగా విద్యవల్ల చాలా ప్రయోజనాల్లోకెల్లా కులనిర్మూలన కూడా జరుగుతుందని జెగ్గని కులాంతర వివాహం ద్వారా తెలియజెప్పే ప్రయత్నం చేశారు రచయిత.

**కథాకథనం :**

"జెగ్గా! నెత్తిమీదికి పొద్దచ్చింది. ఇంకా అంటుకందిన లేదు యాడికి బొయినవురా? మీ అవ్వ యొదిరినూత్తుంది యాల్లపొద్దుగాలింత దాగిపోవద్దు? సరుగ్గునబోయి మంద లేపుకొనిపో. కొంచం ఆయలపొంటి గొట్టుకపోయి బక్కల్ను కడుపునిండ మేపుకరా" (జె.యి.:5)

"ఎంత మాట దొరా! నీ గులాపోన్ని యెంత జెప్పినా యినకపోతె అసెంగాక యింట్లకేలెల్లగొడ్తె ముసలోనిదగ్గెరున్నడు. ఆడు మన పనిమీదికి రాంగ నేనొద్దన్ననా? తాతలప్పటినించి మీ శాకిరిమీద బతికినోల్లం. మీగడి సల్లగుంటె మాకింత గంజి దొర్కుతదని దీపంబెట్టి మొక్కుతున్నం మారెమ్మ దైవంసాచ్చి, మరి నేనేమన్న రొండోయిదం జేత్తనా? నా పంతగూడా మీశేనునూ, శెలుక గాత్తది దొరా? నీకు కొత్తగనా? నా గుణం" (జె.యి.: 24)

**2. ముత్యాల పందిరి (1969)**

**వస్తువు :**

ఈ నవలను పోరంకి దక్షిణామూర్తిగారు మహబూబ్‌నగర్ జిల్లా మాండలికంలో రాశారు. ఈయన తెలంగాణా ప్రాంతంలో స్థిరపడిన వారే అయినా తొలి తెలంగాణ మాండలిక నవలను సృజించారు. వృత్తి పదకోశం నిర్మించే క్రమంలో మహబూబ్‌నగర్ జిల్లా పర్యటించి అక్కడి ప్రజలతో మమేకమై స్థానిక మాండలికంలో 'ముత్యాలపందిరి' ని నిర్మించారు.

ఇందులో వస్తువు చిన్న వృత్తి కుటుంబాల్లో బావ మరదళ్ళ మధ్య ప్రేమను చిత్రించడం. ప్రధాన పాత్రధారులు సెంద్రయ్య, అతని మరదలు ముత్తాలు. చేనేత కార్మిక కుటుంబాల్లో జన్మించిన వీరు బాల్యం నుంచి స్నేహంగా ఉంటారు. వీరి తల్లిదండ్రులు వీరు యుక్తవయస్సుకి వచ్చిన తర్వాత వీరిద్దరికి పెళ్ళి చేయాలని నిశ్చయిస్తారు. కాని సెంద్రయ్య ముత్తాలు ఉంగరం పోగొట్టడంతో పారిపోతాడు. అలా వెళ్ళిన సెంద్రయ్య ఎంతో నైపుణ్యంతో చీరలు నేయడం నేర్చుకొని చివరగా ఇంటికి తిరిగి వస్తాడు. అప్పటికే ముత్తాలుకి పెళ్ళి నిశ్చయమవుతుంది. అయినా తన మరదలుకు తాను స్వయంగా నేసిన 'ముత్యాలపందిరి' చీర అందివ్వాలనుకుంటాడు.ముత్తాలుకు పెళ్ళి జరిగి వెళ్ళిపోతున్న సందర్భంలో కలిసి అందజేస్తాడు. అది అందుకున్న ముత్తాలు తన బావను పెళ్ళి చేసుకోనందుకు బాధపడి రైలు కింద పడి చనిపోతుంది.

ఈ నవల్లో ప్రధాన వస్తువు ప్రేమే అయినా చిన్న చిన్న వృత్తి కుటుంబాల్లో ఉండే సంబంధాలు, చేనేత వృత్తిలో ఉండే ఇబ్బందులను, దళారుల మధ్య మోసపోకుండా చేనేత కార్మికులే స్వయంగా సంఘం పెట్టుకోవడం మొదల్కైన వాటిని రచయిత చిత్రించారు.

**కథాకథనం :**

రచయిత రెండు పాత్రలమధ్య సమన్వయాన్ని కుదుర్చుతూ జీవం ఉట్టిపడేటట్టు చిత్రించారు. ఉదాహరణకు రెండు పాత్రల మధ్యసంభాషణను గమనించండి.

"యాడబోతున్నావు కోడలా'

'ఇంటికి'

'ఈడ రారాదు'

'ఏంటికి మామ'

'కూసో బిడ్డా'

ముత్తాలు మామతాన కూసున్నది (రచయిత)

'ఆసుపోసుడు నేర్సినవా?'

'మరాసునా?'

'లే లే! శెయ్యాసుమీద'

'నేర్సిన మామ" (ము. ప.: 66) ఈ విధంగా దీనిలో కథనం సాగుతుంది.

**3. కొలిమంటుకున్నది (1978)**

**వస్తువు :**

ఈ నవలను అల్లం రాజయ్యగారు కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల మాండలికంలో రచించారు. 'కొలిమంటుకున్నది' విప్లవ నవల. జగిత్యాల రైతాంగ పోరాట నేపథ్యాన్ని ఈ నవల అందించింది. అధమ వర్గ పీడితులు, పీడించే దొరలను ఎదిరించి ముందుకు సాగుతూ సంఘాన్ని ఏర్పరచుకొంటారు. కుల, మత, భేదాలు లేకుండా సంఘటితమై దొరలను, భూస్వాములను గడీల్లో నిర్బంధిస్తారు. సాయుధ పోరాట ప్రత్యక్ష చిత్రణ ఈ నవలలోకనిపిస్తుంది.

**కథాకథనం :**

దీన్ని చదివే పాఠకులకు రోమాలు నిలబడేలా కథనం ఆసక్తిగా సాగుతుంది. ఉత్తేజపూరితమైన మాటలు, సాహసాలు చదువుతూ ఉంటే పాఠకునిలో ఉత్కంఠ రేగుతుంది. ఈ నవలలోని కథనం ఇలా నడుస్తుంది.

"ఆళ్ల కాళ్ల దుమ్ము ఆకసంల కంట పొగ తీర్గ లేత్తుంది. . . ఫెఢీ ఫెఢీన కేకలు.

దండు మూడు పానాదుల కాడి కచ్చింది. . .

సెంద్రయ్య మొండిగోడ మీని కెక్కిండు.

"దొరల జులుం. . నశించాలె"

"దున్నె టోనికే. . . భూమి గావాలె"

"పట్టుకున్న రైతుల. . . విడిచి పెట్లాలి. "

"షికాలు, కారస్ కిత్తాలు. . పరంపోగులు. . . పంచాలె. . . "

"రైతు కూలి సంఘం. . . . వర్ధిల్లాలె. . . "

బొత్తయ్య బొంగురు గొంతిక తోటి. . .

"రాయపోశాలు. . . " అరచిందు. . . " (అ.రా.సా.-1:178)

**4. కక్క (2000)**

**వస్తువు :**

'కక్క' నవలను వేముల ఎల్లయ్యగారు నల్గొండ జిల్లా మాండలికం లోనే రాసారు. ఈ నవలలోదళితుల జీవితం, అందులో ప్రత్యేకంగా మాదిగ జీవితం చిత్రించబడింది. ఈ నవల సంపూర్ణంగా మాండలికంలో రాయబడింది. పాత్రల సంభాషణలేకాక రచయిత కథనం కూడా మాండలికంలో రాయబడింది.

**కథాకథనం :**

కథనం పూర్తిగా మాండలికంలో సాగుతుంది. రచయిత తన జీవితంలోని అనుభవాలను, అవమానాలను క్రోడీకరిస్తూ దళిత జీవితాన్ని సజీవంగా, వాస్తవికతతో 'కక్క'నవలను చిత్రించారు. ఇందులోని కథనం పాఠకుడు గుక్క తిప్పుకోకుండా చదవవల్సి ఉంటుంది. అటువంటి కథనాన్ని మనం కింద చూడవచ్చు.

"సెప్తా ఇన్రా కక్క! ఆసాములిండ్లల్ల పెండదొక్కి పిడ్కెలు జెయ్యాలే! పొయ్యిలకు కట్టెలుతేవాలె! ఎంత మందుంటె అందర్కి సెప్పులు గుట్టియ్యాలె! పాత కొత్త సెప్పులకు గల్పి పదేను మాన్కలు (ముప్పై సేర్లు) ఇగ ఇను కక్కా! ముత్తూం ఎన్మిది కుండలు గింత సేవజేస్తే వొచ్చేది గాల్ల సేనేరబోతె నీలకుండనింద కంకులు నింపిత్తరు! ఎన్కముందు వొడి మాదిగోని వొంచె నింపుకోవచ్చు! నాగలిత్తనాన్కి రెండు పూటలుబోతె తవ్వెడు గింజలు కల్లం అల్కుపూతకు కలమద్గ ఇత్తులు ఊకి ఎత్తుకోవాలె..." (కక్క:34).

"అమ్మటాలకు సలిబువ్వదిని వొచ్చిన సుట్టాలు లస్మక్కని మంచ్గ జూస్కొ అని పకీరు తాతని బిల్సి పొల్ల గురించి జెప్పి లస్మక్క నువ్వుగూడ పైలంగుండాలే పెద్దమడిశైన దానివి నువ్వు అటిటు దిర్గొద్దు తాత జెప్పినట్టిను ఇంగ మేం బోతున్నమని నపరి పొల్ల నేవులు లస్మక్క సేత్ల బెట్టింద్రు." (కక్క:42).

**5. ప్రజల మనిషి**

**వస్తువు :**

ఈ నవలను వట్టికోట ఆళ్వారుస్వామిగారు నిజామాబాదు జైళ్లో ఉన్నప్పుడు జరిగిన సంఘటనల ఆధారంగా రచించారు.ఇది తెలంగాణ తొలి నవలగా పేరొందింది. నిజాం కాలంలో భూస్వాముల ఆగడాలు, దౌర్జన్యాలు, సాధారణ ప్రజలపై దోపిడీ, కథానాయకుడు గ్రామ ప్రజల్ని చైతన్యం చేయడం ఈ నవల్లో కన్పిస్తుంది.దొరలు ప్రజల భూములు అక్రమంగా ఆక్రమించుకోవడం కథానాయకుడైన కంఠీరవం ప్రజలకోసం జైలుకు వెళ్ళివచ్చి వారిని చైతన్యం చేసి దొరలపై తిరుగుబాటు చేయిస్తారు.

**కథాకథనం :**

"అయితే మేము పని చేయక బ్రతికినా ఫర్వాలేదంటావా?"

'మీకెట్లైనా రోజులు గడుస్తయి"

"బిచ్చమెత్తుకొని వెళ్ళతీసినను మంచిదంటావా?"

"అది బిచ్చమెందుకైతది?"

"అది నేను బిచ్చమంటా. గౌరవ మర్యాదలేని బ్రతుకంటా సోమరితనమంటా" (ప్ర.మ.:26)

**సంభాషణాత్మక మాండలిక నవలలు:**

ఈ విభాగంలోని నవలల్లో రచయిత కథనం సాధారణ లిఖిత భాషలో కనిపిస్తుంది. పాత్రల సంభాషణ మాత్రం మాండలికంలో కన్పిస్తుంది.

**1. ప్రజల మనిషి (1955)**

**కథాకథనం :**

ఈ నవలలో ఉన్న మాండలికం పూర్తిగా నిజామాబాదు జిల్లాదేనని చెప్పలేం. రచయిత నిజామాబాదు జైల్లోని సంఘటనలను దీనిలో చిత్రించారు. కింది సంభాషణ ద్వారా దీనిలోని కథనాన్ని గమనించవచ్చు.

"అయితే మేము పని చేయక బ్రతికినా ఫర్వాలేదంటావా?"

'మీకెట్లైనా రోజులు గడుస్తయి"

"బిచ్చమెత్తుకొని వెళ్ళతీసినను మంచిదంటావా?"

"అది బిచ్చమెందుకైతది?"

"అది నేను బిచ్చమంటా. గౌరవ మర్యాదలేని బ్రతుకంటా సోమరితనమంటా" (ప్ర.మ.:26)

**2. ఆడపిల్ల**

**వస్తువు :**

ఈ నవలను ఐతా చంద్రయ్యగారు మెదక్ జిల్లా సంభాషణాత్మక మాండలికంలో రాసారు. దీనిలో సమాజంలో ఆడపిల్లలు ఎదుర్కునే సమస్యలను వస్తువుగా తీసుకున్నారు రచయిత. ఆడపిల్లలకు ప్రధానంగా ఎదురయ్యే సమస్య వరకట్నం. ఈ నవలలో అనుపమ ప్రధాన పాత్రగా అత్తగారు వరకట్నం గురించి పెట్టే బాధలను తట్టుకోలేక విడాకులు తీసుకొని అమ్మగారింట్లో ఉంటూ చదువుకొని టీచర్ ఉద్యోగం సంపాదిస్తుంది. ఆ తర్వాత తన అన్నగారి స్నేహితుడైన సారయ్యను వివాహం చేసుకుంటుంది. నేటి ఆడపిల్లలు చదువుకుంటే ఎన్నో సమస్యలను అధిగమించవచ్చని అనుపమ పాత్ర ద్వారా రచయిత తెలియజేసారు.

**కథాకథనం :**

మాండలికం సంభాషణాత్మకంగా ఉంటుంది.

"బరువెక్కువున్నట్టుంది. ఆ పెట్టె పట్టుకోవాల్నా బిడ్డా!"

"వద్దు తాత పెద్ద బరువేం లేదు. ఐనా వయసులున్న మేము మొయ్యని బరువును వయసుడిగిన నువ్వు మోయగలవా?"

"ఆ తప్పకుండా మోస్తా. నీకంటె డబుల్ బరువు మోస్తా బిడ్డా!"

"ఈ కాలపు వైసు పిల్లలు పేరుకే. తల్లెడు తినలేరు, తట్టెడు మోయలేరు. ఇరవై కిలోల బరువు మొయ్యమంటె మూడామెడ ఎగవడ్తరు. కాని నేనిప్పుడు గూడా యాభైకిలోలు మోస్తానమ్మా" (ఆ.పి.:8)

### 3. బతుకుపోరు (1982)

**వస్తువు :**

ఈ నవలను బి.ఎస్. రాములుగారు కరీంనగర్ నుంచి మాండలికంలో రచించారు. ఇది స్త్రీవాద దృక్పథంతో రాయబడింది. 1980 నాటి బీడి కార్మికురాళ్ళ సామాజిక జీవన నేపథ్యం, సంస్కృతి, అలోచనా విధానం, స్త్రీల అభివ్యక్తి, ఆరాటాలు లాంటి వాస్తవికాంశాలను ప్రతిబింబించే నవల. నిత్యం గృహంలో ఉండే స్త్రీలు బీడిలు చేసి జీవనం సాగించే స్త్రీల సాధక, బాధకాలను ఈ నవల మన ముందుంచుతుంది. విడివిడిగా ఎవరి ఇంట్లో వారు పని చేయడంవల్ల బీడీ ఫ్యాక్టరీల్లో ఉండే సమస్యలను తెల్సుకోలేకపోతారు.చివరగా సమస్యలను గుర్తించిన మహిళలు సమ్మె చేస్తారు. మొత్తంగా స్త్రీల చైతన్యం ఈ నవలలో ప్రధాన వస్తువు.

**కథాకథనం :**

"రాత్రనక, పగలనక పదిహేనుమంది జేసేపని పదిమందిమే జెయ్యపడితిమి?"

"గదా బాహర్ చల్కే బాత్‌కరో (బయటికి వెళ్ళి మాట్లాడు గాడిదా)" లేచాడు.

"నేను తలుసుకుంటినంటే లేబరాఫీసరును తోల్కచ్చి నీ దొంగ లెక్కలు, ఓవర్‌ట్మెం ముంగటేపిత్త. గప్పుడు తెలుస్తది నువ్వురోజు పన్నెండు గంటలు పనిజేపిచ్చేది" (బ.పో.:28).

**ముగింపు**

తెలంగాణ రాష్ట్రం సిద్ధించాక ఒక్కొక్క రంగంలో మనం నష్టపోయిన వాటిని వెతుక్కుంటూ వస్తున్నాం. అదేవిధంగా సాహిత్యంలోనూ మన అస్తిత్వాన్ని, మనదైన సహజ వ్యక్తీకరణను స్వేచ్ఛగా ప్రకటిస్తున్నాం. 'తెలంగాణ భాష'గా మనం పిలుచు కుంటున్న భాష ప్రత్యేక కాకపోవచ్చు. కానీ ప్రత్యేక పదజాలం, వ్యక్తీకరణ, సౌందర్యం మన భాషగా చెప్తున్న మాండలికంలో ఉంది. ఇలాంటి మాండలికాన్ని విరివిగా వాడుతూ రచనల ద్వారా, ప్రసంగాల ద్వారా వెలుగులోకి తీసుకురావాలి. తద్వారా భాషగా చెప్పుకోదగ్గ పదజాలం వచ్చే అవకాశం ఉంది. కనుక మరుగున పడిన మన భాషాపదజాలాన్ని వెలికితీసి మెరుగు పెట్టుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ బాధ్యత కవులు, రచయితలు, పరిశోధకులు, మొత్తంగా తెలంగాణ సమాజమంతటిపైనా ఉంది.

**ఉపయుక్త గ్రంథాలు**

1. ఆళ్వారుస్వామి, వట్టికోట. 2004. ప్రజల మనిషి. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్. ఐదవ ముద్రణ.
2. ఎల్లయ్య, వేముల. 2000. కక్క. నల్గొండ: నీలి సాహితి.
3. చంద్రయ్య, ఐతా. 1996. ఆడపిల్ల. సిద్ధిపేట: జాతీయ సాహిత్య పరిషత్తు.
4. దక్షిణామూర్తి, పోరంకి. 1969. ముత్యాల పందిరి. మద్రాసు: ఎం. శేషాచలం & కం.
5. పురుషోత్తం, బొడ్డుపల్లి. 1982. భాషాశాస్త్ర పరిచయం. నరసారావుపేట: నాగలక్ష్మి గ్రంథమాల.
6. రాములు, బి. ఎస్. 1991. బతుకుపోరు. కరీంనగర్: కరీంనగర్ బుక్ ట్రస్ట్.
7. లోక మలహరి. 1955. జెగ్గని యిద్దె. నిజామాబాదు: శ్రీ జగదీశ్వర భజన మండలి, వన్నెల.
8. వరవరరావు (సంపా). అల్లం రాజయ్య సాహిత్యం-1. 2008. హైదరాబాదు: పర్‌స్పెక్టివ్స్.





# శ్రీమాతా వందనం

కోమల భావముల్ కూరిమి ప్రకటించి
ప్రజల పాలింతువు 'బాల' గాను
వైదిక ధర్మము వరల జేసి యిల జీ
వాత్మ గాతువట 'గాయత్రి' గాను
కరువు కాటకముల కర్కశ ఘట్టముల్
పోద్రోలు దీ 'వన్నపూర్ణ' గాను
ప్రకృతి బీభత్సముల్ ప్రబలినంత ప్రజలన్
లాలింతు వీవమ్మా 'లలిత' గాను
విద్యా ప్రదానము ప్రేమగ చేయుచు
రక్షింతువు 'మహా సరస్వతి' గను
ఐశ్వర్యముల గూర్చి హాయి నిడుదు వీవె
ఈ క్ష్మా తలంబున 'లక్ష్మి' గాను
ధూర్తుల నెల్లర దునుమాడి యనిశము
మము గాతువు 'మహిషమర్దని' గను
సర్వరూపివై, శక్తివై, సర్వభూష
శోభనంబుల వెల్గెడి శుద్ధమూర్తి
రాజరాజేశ్వరీ భావ రమ్యశీల
అష్టవిధ దండముల నీకు నాచరింతు

**మందాక్రాంతము**

హాకారార్థా! లలిత పదవాచ్యా! విశేషోజ్జ్వలాంబా!
లాకిన్యంబా! సకలకరుణాలంకృతాక్షీ! లలామా!
నీకై యత్యంత విమల మతిన్ నేనతుల్యానురక్తిన్
నీ కైవారంబులు సలుపుదున్ నిత్యనిష్ఠుండ నౌదున్.

శాకినీ డాకినీ రూప! సత్వమిమ్మ,
కాకినీ లాకినీ రూప! కరుణ గనుమ,
రాకినీ హాకినీ రూప! రక్ష నిమ్మ,
యాకినీ రూప! వందనమమ్మ నీకు!

**అన్నమరాజు ప్రభాకర రావు**
ఫోన్ : 94402 58292

# నైవేద్యం

నా కవిత్వం నాకు సర్వబోధిని
ప్రపంచ జనావళికి ఆనంద ప్రదాయిని

నేను దర్శిస్తే స్థలకాలాలు నాతో పాటు
మునుగుతాయి
నేనేమో మీలో తేలే యత్నంలో
ఉద్దుగుడుచుకోవచ్చు
అయినా మీకోసం
నా లోతుల్నించి రత్నాలు తెస్తానెండి

నాకు అణువణువూ
భావనా సుందర దృశ్యమే
నాకు పదపదమూ
ఆనందపు ముందడుగే – నుడుగే

ఇది నా కవితారూప
దేవీ దర్శన ఫలమే – వరమే
ఇది ఆత్మావిష్కార
అక్షర పదవీ యోగమే!

నా కవిత్వం –
నాకు వేద్యం మీకు నైవేద్యం



**గురిజాల రామశేషయ్య**
ఫోన్ : 7032 679 471

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 12 (20) హైదరాబాద్ అక్టోబర్ : 2022

# పద్యమనోహరం - 35

**గన్నమరాజు గిరిజామనోహర్ బాబు**
వరంగల్, ఫోన్ : 994 901 3448

**'ఋగ్వేద ప్రథమోక్త సూక్త మహితున్ పృథ్వీ జగద్బాంధవున్**
**దిగ్వాసోనిటలస్థ వైభవు హృదాదిత్య ప్రభారాశి ది**
**శ్వ గ్వాయూజ్జ్వల మూర్తితస్సకల జీవక్షేత్ర చిచ్ఛక్తి ఋ**
**త్వి గ్వర్యార్చితు సన్నుతింతు నెడదన్ త్రేతాగ్ని రూపాన్వితున్'**

అగ్ని ప్రాణికోటికి జీవశక్తి, మానవ నాగరికతకు మొదటి మెట్టు, సర్వ ప్రకృతిలో చైతన్యస్ఫూర్తి నింపే మహాశక్తి. దాన్ని దృష్టిలో ఉంచుకొనే సుప్రసిద్ధ శాస్త్రవేత్త, నిత్య సాహిత్య సంసేవనాసక్తులు ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ గారు ఇటీవల వెలువరించిన "పావక వృత్త తారావళి" లో తొట్ట తొలి పద్యం ఇది. ఈ రచనా భూమికను, దీనిలోని తత్త్వ దృక్పథాన్ని తెలియజేసే పద్యం.

"తొట్ట తొలివాక్కైన ఋగ్వేదంలోని మొదటి మంత్రంలో కీర్తింప బడిన వాడు, యావత్ భూమండలానికి అసలైన బంధువు, ఆ




ముక్కంటి ఫాలనేత్రంలో వైభవంగా ప్రకాశించేవాడు, హృదయంలో వెలిగే సూర్య ప్రభారాశి వంటివాడు, అన్ని దిక్కుల్లోని వాయువులో కూడా నిక్షిప్తమై ఉన్నవాడు, సకల జీవరాశికి చైతన్యాన్ని ప్రసాదించే మూల శక్తియైన వాడు, సకల యజ్ఞాలలో ఋత్విక్కుల చేత అర్చింపబడే వాడు, త్రేతాగ్ని స్వరూపుడైన ఆ అగ్నిదేవుని నా హృదయంలో భక్తి భావనతో సన్నుతిస్తాను" అంటూ చెప్పిన ఈ పద్య భావ విస్తృతియే ఈ పావక వృత్త తారావళి.

ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ గారు లోతైన సాహిత్య అవగాహన కలిగినవారు. గత 29 సంవత్సరాలుగా యితర మిత్రులతో కలిసి అజోవిభో కందాళం ఫౌండేషన్ నెలకొల్పి అపురూపమైన సాహిత్య కార్యక్రమాలు, వందలాది గ్రంథ ప్రచురణలు కొనసాగిస్తూ ఆ వాగ్దేవిని సేవించుకోవడమే కాక వారు స్వయంగా దివాకర వృత్త తారావళి, మహాదేవి మత్తేభ తారావళి వంటి పద్య కృతులు వెలయించిన మహనీయులు. అమెరికాలో దాదాపు అయిదు దశాబ్దాలుగా ఆధునిక శాస్త్రవిజ్ఞాన రంగంలో కృషి చేస్తూ మాతృభాషపై మమకారంతో, పద్యంపై వల్లమాలిన అభిమానంతో రచనలు చేస్తున్నారు.

ఈ పావక వృత్త తారావళిలోని 27 పద్యాలు అగ్నిదేవుని తత్త్వాన్ని వ్యక్తీకరించేవే. మనిషిని, మనిషి కనిపెట్టిన యంత్రాలను నడిపేది అగ్ని మాత్రమే. వైశ్వానరుడు అనే పేరే అగ్నిదేవుడు. యావద్విశ్వానికి చెందిన శక్తి అని అర్థమవుతున్నది. అందుకే వేద ఋషులు తొట్ట తొలి మంత్రంలో అగ్నిదేవుని పురోహితునిగా సంభావించి గౌరవించారు. జీవుడు బ్రతకడానికి కారణం అగ్నియే. నీటిలో అగ్ని, భూమిలో అగ్ని, అడవిలో అగ్ని – అసలు అగ్ని లేని చోటే విశ్వంలో కనిపించదు. దేవతలకు హవిస్సును మోసుకెళ్ళేవాడు అగ్నిదేవుడే. అందుకే "అగ్నిముఖోవై దేవాః" అన్నారు. ఈ అగ్నిని గార్హపత్యము, దక్షిణాగ్ని, ఆహవనీయము అని ఆర్షవిజ్ఞానం వింగడించింది. యజ్ఞశాలలో వృత్తాకారంగా పడమటి దిశలో కుండం చేసి వ్రేల్చే అగ్ని గార్హపత్యమైతే, అర్ధవృత్తాకార కుండంలో దక్షిణం దిశగా ఏర్పాటు చేసి వ్రేల్చే అగ్ని ఆహవనీయంగా ప్రాచీనులు వివరించారు. ఇటువంటి పవిత్రమైన త్రేతాగ్ని స్వరూపునిగా అప్పాజోస్యుల వారు అగ్నిదేవుని సన్నుతిస్తూ చెప్పిన మొదటి పద్యమే మొత్తం గ్రంథ అంతస్తత్వానికి సూచికగా నిలుస్తున్నది. ఆర్షవిజ్ఞానాన్ని శాస్త్ర విజ్ఞాన దృష్టితో అన్వయించి రచించే ప్రతిభామూర్తి రచన అగ్నిదేవునిలోని అనంతతత్వాన్ని అందరికీ అందిస్తున్నది ఈ పావక వృత్త తారావళి.

# భారతీయీకరణ – 5

## ఆంగ్ల మూలం : బలరాజ్ మధోక్, అనువాదం : కోవెల సంపత్కుమార

బలరాజ్ మధోక్ దేశశాంతి సమైక్యతలను పరిరక్షించడానికి భారతీయ ప్రజల ఆలోచనలను భారతీయీకరించవలసిన అవసరాన్ని చెబుతూ ఇంగ్లీష్ లో వ్రాసిన Indianness కు అనువాదం ఈ భారతీయీకరణ. భారతీయీకరణ అంటే అన్ని రకాల దీపాసనా మార్గాలను స్థలాలను సమానంగా గౌరవించడం. ఒక వ్యక్తి తాను ఏ కుల, మత, భాషావర్గాలకు చెందినవాడైన వాటి ప్రయోజనాలన్నిటి కన్నా దేశ ప్రయోజనానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం ప్రధానమన్న అభిప్రాయాలు బలరాజ్ మధోక్ ఆలోచనల్లో కనిపిస్తాయి.

రాజకీయ వ్యవస్థలో జాతీయ భావన స్వరూపాన్ని, భారతీయీకరణ విషయంలో జరుగుతున్న చర్చలు, వ్రాసిన వ్యాసాలు, లేఖలు వాదోపవాదాలు ఈ గ్రంథ రచనకు బలరాజ్ మధోక్‌ను ప్రేరేపించాయి. భారతీయీకరణను గురించి ఒక జాతీయ భావన గల మేధావి ఆలోచనల ప్రతిబింబం భారతీయీకరణ. 1970లో వచ్చిన ఈ రచనను సంపత్కుమార తర్వాత కాలంలో సుమారు 80లకు ముందే అనువదించిందంటారు.

భారతదేశం భౌగోళిక స్వరూపం, జాతీయత – భారతీయత మధ్య గల తేడా, భారతీయీకరణ అంటే ఏమిటి? ఎందుకు? దానివల్ల ప్రయోజనమేమిటి? అది జరగవలసిన తీరు ఏమిటి? అన్న విషయాలను యథామూలంగా సంపత్కుమార అందించారు. అనువాదకుడిగానూ జాతీయభావనా చైతన్యం, దేశీయ ఆలోచనా విధానం వ్యక్తమయ్యే రచనను ఎన్నుకోవడం ఆయన దేశీయ నిబద్ధతను చెబుతుంది.





భాషాతత్వం, ప్రాంతీయతత్వం కల్లోలాలను రెచ్చగొడుతున్న సమయంలో గాఢమయిన జాతీయతా భావం ఉండినట్లయితే, విస్తృతమయిన ప్రజలు మాట్లాడుకొనే భాష మాత్రమే ఉపయోగపడింది. ఆంగ్లేయులు తమ భాషను– ఆంగ్లాన్ని– బలవంతంగా ప్రజలపై రుద్దడం కూడా, ప్రజల్లో భారతీయ భాషలపై అభిమానం, వాటి గూర్చి గర్వభావన కలిగించడానికీ, ప్రబోధం పొందడానికీ కొంత దోహదం కలిగించింది. స్వదేశీ ఉద్యమంలో భారతీయ భాషల పునరుద్ధరణ, వాటిని ఉపయోగించడం కూడా ఒక భాగం. రాజకీయ ప్రబోధానికి, కార్యక్రమానికి వాహికలుగా భారతీయ భాషల ప్రాధాన్యం దేశంలో క్రమంగా పెరగడానికి, భారత జాతీయ కాంగ్రెసు తన ప్రాంతీయ శాఖల ఏర్పాటుకు భాషలను ప్రాతిపదికగా స్వీకరించడం కేవలం కారణమే కాదు, పెరుగుదలకు ఫలితం గూడ.

స్వాతంత్రోద్యమం తీవ్రస్థాయికి చేరుకున్నప్పుడు, రాష్ట్రస్థాయిలో రాజకీయాధికారాల మార్పిడి కొంచెం కొంచెంగా జరుగుతున్న సందర్భంలో జాతీయ భావన భాషాతత్త్వ భావనతో మిశ్రమం కావడం ప్రారంభమయింది. ఆంగ్లేయులు భారతదేశాన్ని విభజించడానికీ, ఆ తరువాత దేశాన్ని వదిలిపోవడానికీ నిర్ణయించుకున్నప్పుడు దేశంలో ఉన్న స్థితి ఇది.

అప్పటికే రాజకీయ సంస్థగా రూపొందిన కాంగ్రెసుకు ఆంగ్లేయులు అధికారాన్ని సంక్రమింపజేయగానే, ఇదివరకు తాను చేసిన వాగ్దానాలను తప్పనిసరిగా అమలులోకి తీసుకు రావాలసిన పరిస్థితి ఏర్పడింది. భాషా ప్రాతిపదిక మీద రాష్ట్రాలను వ్యవస్థీకరించడం కాంగ్రెసు ప్రకటించిన విధానంలోని ఒక భాగం. అయితే తత్కాలీన పరిస్థితుల వల్ల బయటపడ్డ కఠోర సత్యాలు, దేశ విభజనవల్ల, తద్వారా దేశం తూర్పు పడమర భాగాలలో సర్వం సహాధిపత్యం గల రాజ్యం ఒకటి కొత్తగా ఏర్పడటం మూలంగా మరింత స్పష్టరూపం పొందినయి. అందువల్ల ఐక్యశక్తులను బలపరచడం, వాటిని శిథిలపరిచే ధోరణులను అణిచివేయడం తక్షణ కర్తవ్యమయింది. భాషా ప్రాతిపదిక మీద రాష్ట్రాలను పునర్ వ్యవస్థీకరించడం వల్ల కలిగే ప్రమాదాలను సర్దార్ వల్లభాయ్ పటేల్ వాస్తవికతావాది కావటం మూలంగా గుర్తించినారు. అయితే, ఆయన రాజ సంస్థానాలను ఆ జాతీయతా భావనను నిలబెట్టుకొనడానికి తగిన తరుణంలో సరయిన విధానాలు అవలంబించి ఉన్నట్లయితే, భాషాతత్త్వోత్సాహపు మొదటి పొంగు తగ్గి పోగానే పరిస్థితులు ఎంతో మెరుగయి ఉండేవి. కాని దురదృష్టవశాత్తు అట్లాంటిదేమీ జరగలేదు. పైగా ఉమ్మడి జాతీయభాష, ఉమ్మడి పౌరసత్వం వంటి విషయాలలో రాజ్యాంగం కల్పించిన రక్షణలు గూడా కొందరు ప్రాంతీయ

నాయకులను తృప్తి పరచడం కోసం నిర్లక్ష్యం చేయబడినయి. విచ్ఛిన్నం చేయబడినయి.

దేశపు మొత్తం ఏకత్వాన్ని పరిరక్షించేందుకు రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ సంఘం సూచించిన రక్షణలను భాషారాష్ట్రాల పునర్ వ్యవస్థీకరణతో బాటుగానే అమలు చేయవలసి ఉండగా, వాటిని తెరమరుగుకు త్రోసి వేయడం జరిగింది. అప్పుడు అట్లా జరగడంతో, కాలం గడిచిన కొద్దీ రాష్ట్రాల వ్యతిరేక మూలంగా వాటి అమలు దిన దినానికీ కష్టతరమయి పోతున్నది.

అన్ని రాష్ట్రాలలోనూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెసు పక్షంలోని భాషా రాష్ట్రవాదులు తమకు లభించిన ప్రథమ విజయాన్ని పురస్కరించు కొని, బుద్ధిపూర్వకంగా, ప్రాంతీయ తత్వాన్ని, భాషా దురభిమానాన్ని ప్రోత్సహించినారు. భారతీయ వైభవ భావన, ఆయా భాషా రాష్ట్ర వైభవ భావనకు లోనుగావింపబడింది. ప్రజాహృదయాలలో భారత మాతృ స్థానాన్ని ఈ భాషా రాష్ట్రాభిమానం ఆక్రమించింది. ఛత్రపతి శివాజీ, మహారాణా ప్రతాపుడు, గురు గోవింద సింహుడు, లోకమాన్య తిలక్, లాలాలజపతిరాయ్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ మొదలైన దేశీయ నాయకులందరూ ఆయా రాష్ట్రాల పరిధిలోకి కుదించబడి నారు. శివాజీ, తిలక్ జయంతులు కేవలం మహారాష్ట్ర ప్రభుత్వపు అధికారికోత్సవాలుగా మారిపోయినయి. లాలాలజపతిరాయ్ శతవార్షిక జయంతి నిర్వహణ కేవలం పంజాబ్ ప్రభుత్వం బాధ్యతగా, దేశంలోని ఇతర ప్రాంతాలలో నివసించే పంజాబీల బాధ్యతగా మాత్రమే తయారయింది. పాఠశాలలోనూ, కళాశాలలోనూ దేశం మొత్తాన్ని ప్రదర్శించే దేశపటాల కన్నా, దేశంలోని ఇతర ప్రాంతాల న్నింటినీ తొలగించి ఆయా రాష్ట్రాలను మాత్రమే ప్రదర్శించే పటాలు ప్రధానంగా ప్రదర్శింపబడుతున్నాయి. కొద్దిలో చెప్పవలసివస్తే, సమగ్ర దేశీయభావన కన్నా ప్రాంతీయ తత్త్వం ఉత్తమమయినదిగా భావించ బడుతున్నది.

దేశం ఇంకా ముక్కలు చెక్కలు కావలెననుకొనే వారికి ఈ పరిస్థితి ఒక సదవకాశాన్ని ప్రసాదించింది. ముస్లిం లీగ్ మళ్ళీ తన వికృత రూపంతో కేరళలో తలెత్తింది. బహు జాతి సిద్ధాంతాన్ని అనుసరించే కమ్యూనిస్టులు భాషా, ప్రాంతీయ తత్వాలను మరింత తీవ్రతరం చేస్తున్నారు. ఎందుకంటే, భారత జాతీయ సంస్కృతి కన్న భిన్నంగా ప్రతి రాష్ట్రానికీ ఒక ప్రత్యేక సంస్కృతి, వారసత్వం ఉన్నాయని వీరంటారు. దేశాన్ని ఇంకా స్వతంత్ర రాష్ట్రాలుగా విడగొట్టే వీరి దుష్పథకంలో ఇదంతా ఒక భాగం మాత్రమే.

కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ ఏకపక్ష ప్రభుత్వం ఉన్నంతకాలం ప్రాంతీయ భాషకూ, ప్రాంతీయ ప్రయోజనాలకూ, అవసరాన్ని మించి అధిక ప్రాధాన్యం ఇవ్వడం వల్ల ఏర్పడ్డ సంఘర్షణలూ, కలిగిన ప్రమాదాలూ ప్రజానీకానికి స్పష్టంగా తెలిసే అవకాశం లేకపోయింది. కాని 1967లో జరిగిన సార్వత్రిక ఎన్నికల తరువాత దేశపు రాజకీయ చిత్రపటంలో చాలా మార్పు వచ్చింది. వేరువేరు రాష్ట్రాల్లో వేరు వేరు పక్షాల లేదా సంయుక్త విధాయక దళాల ప్రభుత్వాలు ఏర్పాటయినయి. భాషా రాష్ట్ర, ప్రాంతీయ తత్త్వాల, భాషా దురభిమానాల విషయంలో కమ్యూనిస్టుల దృక్పథంతో దాదాపు ఏకీభవించే పక్షాల, వర్గాలపై శ్రీమతి ఇందిరాగాంధీ ప్రభుత్వం కేంద్రంలో ఆధారపడటం ప్రమాదకర స్థాయిని చేరుకుంటున్నది. దీనివల్ల దేశంలో ప్రాంతీయతత్త్వం, భాషా దురభిమానం ప్రమాద సూచిక రేఖను చేరుకుంటున్నయి. కొన్ని కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు వీలయినప్పుడల్లా రాజ్యాంగాన్ని దురుపయోగం చేయడం మాత్రమే కాక, దాన్ని భగ్నం చేస్తామని కూడా కమ్యూనిస్టు పరిభాషలో ప్రకటిస్తూనే ఉన్నాయి. ఇదిట్లా ఉండగా, విభిన్న రాష్ట్రాలతో వ్యవహరించేప్పుడు కేంద్రం విభిన్న ప్రమాణాలను అవలంభించడం, తనకిష్టం కానట్టి రాష్ట్ర ప్రభుత్వాలను పడకొట్టడానికి ప్రధానమంత్రి ప్రయత్నించడం మొదలయిన అంశాలు కేంద్ర –రాష్ట్ర ప్రయోజనాల సమన్వయానికి అవసరమయిన ఏకతా భావాన్నీ, ఉమ్మడి ప్రయోజన దృష్టినీ నశింపజేసినయి.

ఈ మొత్తం పరిస్థితుల ఫలితంగా ఈనాడు చాలా మంది భారతీయులు మొట్టమొదట పంజాబీలు, మలయాళీలు అవుతున్నారు. ఆ తరువాతనే వారు భారతీయులవుతే అవుతారు, లేకపోతే అసలే కారు.

మొదట దేశం, తరువాతనే మిగిలినవన్నీ అనే భావన జాతీయతకు ప్రధానం. ఇది నేడు మరుగున పడిపోతున్నది. దేశీయ ప్రయోజనా లను బలి చేసయినా సరే, ప్రాంతీయ సమస్యలకూ, ప్రయోజనాలకూ అత్యధిక ప్రాధాన్యమివ్వడం దీని ఫలితం.

అస్సాంలోని దేశ వ్యతిరేక శక్తులు తమ స్థితిని బలపరచుకొనే ఉద్దేశ్యంతో, వీలునుబట్టి పాకిస్తాన్, చైనాలో ఆ ప్రాంతాన్ని కబళించేందుకు మార్గాన్ని సుగమం చేయడం కోసం అస్సామీయేతర హిందువులను అస్సాం నుంచి తరిమివేయడానికి ఈ ప్రాంతీయ ధోరణులను ఉపయోగించుకుంటున్నాయి. ఈ పరిస్థితి చేసే హెచ్చరికను జాతీయభావం గల భారతీయ ప్రజ నిర్లక్ష్యం చేసేట్లయితే వినాశనం తప్పదు. భారతీయతను పునర్ జాగృతం చేసి, దానిని పటిష్టం చేసేందుకు, దేశీయ ప్రయోజనాలకు ప్రాంతీయ ప్రయోజనాలను అనుబంధించేందుకు సరియైన తరుణంలో అవసరమయిన, తగిన చర్యలు తీసుకోకపోతే ఇతర ప్రాంతాలలో గూడా ఈ విధమయిన పరిస్థితులే ఏర్పడవచ్చు. అందుకని, ఇంకా పరిస్థితులు చేయిజారి పోకముందే, సదుద్దేశంతో మన ప్రజల భారతీయాకరణ తప్పనిసరి కావడానికి ఇది ఒక కారణం.

ప్రాచీనమైన, వైవిధ్యపూర్ణ చరిత్ర గల భారతీయులు అనేక విధాలుగా అద్వితీయమయిన ఒక సాంఘిక వ్యవస్థను రూపొందించు కున్నారు. ఈ ప్రాచీన దేశంలో అనేకాంశాలతో బాటు వర్ణవ్యవస్థ నెమ్మదిగా, ఒక క్రమపద్ధతిలో రూపొందింది. మొదట ఇది కర్మ విభాగాన్ని అనుసరించి ప్రారంభమయింది. సృష్టి కర్త అయిన పరమేశ్వరుని ముఖం నుంచి బ్రాహ్మణుడు, బాహువుల నుంచి క్షత్రియుడు, ఊరువుల నుండి వైశ్యుడు, పాదాల నుండి శూద్రుడు ఉదయించినట్లుగా ఋగ్వేదం చెప్పిన దానిని బట్టి చూస్తే, వర్ణవ్యవస్థ మోక్ష మూల రూపం స్పష్టమవుతుంది. దేహంలోని అవయవం ఎక్కువ ప్రధానమయిందో ఎవరూ చెప్పడానికి వీలు లేనట్లే, పై వారిలో ఎవరు ఎక్కువ, ఎవరు తక్కువ అన్న ప్రశ్నే లేదు. శరీరం మొత్తం ఆరోగ్యవంతంగా ఉండడానికి, దాని అవయవాలన్నీ ఆరోగ్యవంతంగా ఉండటం అవసరం. ప్రతి అవయవమూ అది చేసే పనినిబట్టి, మిగిలిన పనులు చేసే మిగతా అవయవాల మాదిరిగానే శరీరం ఆరోగ్యవంతంగా ఉండడానికి ప్రధానమయింది. అదేవిధంగా సామాజికమయిన ఈ విభజన కూడా సమప్రాధాన్యం కలదిగానే భావించబడింది.

బ్రాహ్మణుని ప్రాధాన్యం అతని బుద్ధి వైభవాన్ని బట్టి, స్వచ్ఛందంగా వరించిన పేదరికాన్ని బట్టి ఏర్పడింది. బ్రాహ్మణ ప్రధాన లక్షణంగా అతని భౌద్ధికమయిన ఔన్నత్యమే తప్ప, భౌతిక సంపద గుర్తించ బడలేదు. కొందరు ధర్మ నిర్ణేతలు బ్రాహ్మణుడు ఏ విధమయిన భౌతిక సంపద గూడా కలిగి ఉండరాదని స్పష్టంగా నిర్ణయించినారు.

ఈ వర్ణవ్యవస్థలో రెండవస్థానం క్షత్రియునిది. సమాజం కోసం పోరాడడానికి, అవసరమయితే, సమాజ సంక్షేమం కోసం ప్రాణాల యినా సరే, అర్పించడానికి సిద్ధంగా ఉండటం క్షత్రియుని ప్రధాన లక్షణం. భౌతిక సంపద అతని లక్ష్యంగా ఎప్పుడూ ఉండకూడదు.

ఈ వరుసలో మూడవ స్థానం వైశ్యునిది. భౌతిక సంపద సమకూర్చడం అతని ప్రధాన లక్షణం. అయితే, సమాజం కోసం కాకుండా స్వార్థానికి మాత్రమే ఐశ్వర్యాన్ని ఉపయోగించే వైశ్యుడు చండాలునికన్నా నీచుడినీ, అతని చేతి ఆహారాన్ని ముట్టనయినా ముట్టవద్దనీ శుక్రుడు మొదలయిన ధర్మవేత్తలు స్పష్టంగా చెప్పినారు.

శూద్రుడు సామాన్యంగా శ్రామికవర్గానికి చెందినవాడు. ఏ దేశంలోనయినా ఈ వర్గమే ఎప్పుడు కూడా అధిక సంఖ్యాకమయినది.

ఈ వర్ణ వ్యవస్థ ఒక వ్యక్తి యొక్క పుట్టుక మీద ఆధారపడింది కాదు. వ్యక్తి యొక్క గుణ కర్మ స్వభావాలే దీనికాధారం. వ్యక్తుల వర్ణాల మార్పిడికి సంబంధించి వైదిక సాహిత్యంలో ఎన్నో ఉదాహరణ లున్నాయి. వాల్మీకి మొదలయిన కొందరు భారతీయ మహారుషులూ, పండితులూ బ్రాహ్మణేతరులకు జన్మించినవారు.

కాలం గడిచిన కొద్దీ, స్వప్రయోజనాల దృష్టి పెరగడం మూలంగా, ఒక వ్యక్తి యొక్క వర్ణ నిర్ణయంలో, పుట్టుక ప్రధాన పాత్ర వహించడం మొదలయినవి. ఆర్య సంఘంలో కొత్తవారు అనేకంగా ప్రవేశిస్తున్న విధానాన్ని అనుసరించి క్రొత్త క్రొత్త వర్ణాలు గూడా క్రమంగా ఏర్పడడం జరిగింది. ఇతరులను తనలో విలీనం చేసుకోవడానికీ, వారిని భారతీయీకరించడానికీ, వారి వారి పూర్వపు సమాజాలలో వారి ప్రవృత్తినీ స్థాయినీ అనుసరించి ఈ సమాజంలో వారికి తగిన వర్ణాన్ని ఏర్పరచడంలో ఈ విధానం భారతీయ సమాజానికి ఎంతగానో ఉపకరించింది. హూణ క్షత్రియులు, ఘూర్జర బ్రాహ్మణులు మొదలయినవారి ఉనికి ఈ అంశాన్ని అర్థం చేసుకొనడానికి తోడ్పడుతుంది. భారతీయ సమాజంలో ఈ క్రొత్త వారి ప్రవేశాన్ని క్షత్రియులకూ, రాజపుత్రులకూ ఉన్న తేడా ఇంకా స్పష్టం చేస్తున్నది. ఈ విధంగా చాలాకాలం వరకు భారతీయ సమాజం ఇతరులను తనలో విలీనం చేసుకోవడంలో, వారి భారతీయీకరణ లోనూ ఈ వర్ణ వ్యవస్థా విధానం ఎంతో ప్రయోజనవంతమయిన పాత్రను నిర్వహించింది.

కాని, అనేక శతాబ్దాల విదేశీయ పాలనలో భారతీయ సమాజం స్తబ్దమయిపోయింది. వర్ణ వ్యవస్థ విషయంలోనూ ఇంతే జరిగింది. క్రమక్రమంగా, ఇంతగా, మరింతగా వర్ణ వ్యవస్థ బిగుసుకుపోయింది. ఒక వ్యక్తి వర్ణ నిర్ణయంలో, అతని పుట్టుక అన్నింటికన్నా ప్రధాన లక్షణమయిపోయింది. అస్పృశ్యతలూ, నిషేధాలూ వివిధ రూపాలలో వ్యాపించినాయి. అస్పృశ్యతను శూద్రులకు వ్యతిరేకంగా కేవలం అగ్ర వర్ణాల వారు మాత్రమే పాటించినారనడం నిజంకాదు. శూద్రులలోని అనేక ఉపవర్ణాలవారు పరస్పరం మరింత కఠినంగా ఈ అస్పృశ్యతను పాటించేవారు. ఈనాడు కూడా కొంతవరకు ఇది అమలులో కనిపిస్తుంది. ఈ వర్ణ విభేదాలను, విరోధాలను ఆక్రమణదారులుగా వచ్చి ఈ దేశానికి పాలకులయిన తురుష్కులు, అరబ్బులు, మొగలులు మొదలయినవారు తమ రాజకీయ ప్రయోజనాల కోసం బాగా ఉపయోగించుకొన్నారు. ఈ ఉపయోగించుకోవడాన్ని ఆంగ్లేయులు ఒక క్రమ పద్ధతిలో నిర్వహించినారు. ప్రధానంగా, 1857 తరువాత ఆంగ్ల ప్రభుత్వం తన భారతీయ సైన్యం మొత్తాన్ని కులపద్ధతి మీద వ్యవస్థీకరించింది. పంజాబ్‌లో క్షత్రియులకు, వైశ్యులకు వ్యతిరేకంగా జాతులను, దక్షిణ భారతంలో బ్రాహ్మణులకు వ్యతిరేకంగా బ్రాహ్మణే తరులను రెచ్చగొట్టి వైషమ్యం పెంచింది. ఇదే ధోరణిలో, ఏ పరిస్థితుల వల్లనైతేనేమి, కారణాలవల్ల నైతేనేమి, రాజకీయంగా అధికారం గల బ్రాహ్మణులున్న ఆయా రాష్ట్రాల్లో, ప్రాంతాలలో బ్రాహ్మణ వ్యతిరేక భావన మరింతగా పటిష్టమయిపోయింది.

ఆధునికంగా భారతీయతా పునర్ జాగృతి కోసం పాటుపడిన మహర్షి దయానందుడు, రాజా రామ మోహన రాయలు మొదలయిన

మహానాయకులందరికీ ఈ విషయం తెలుసు. భారతీయ యోధులు అసందిగ్ధమైన ధైర్యమూ, అసదృశ్యమయిన సాహసమూ కలవారే. అయినా, విదేశాల నుంచి దండెత్తి వచ్చిన అల్లరిమూకల ముందు విఫలులయి పోయినారు. దండెత్తి వచ్చిన వారితో పోల్చి చూస్తే, మనిషి మనిషికీ మధ్య వర్ణం ఆధారంగా భారతీయ సమాజంలో ఏర్పడ్డ వైరుధ్యాలూ, సంఘర్షణలూ ఆ వైఫల్యానికి ఒక ప్రధాన కారణంగా ఆ మహానాయకులు గుర్తించినారు. అందుకని వర్ణ వ్యవస్థకు వ్యతిరేకంగా వారు ఉద్యమాలను సాగించినారు. శూద్రులను పైకి తీసుకురావడం, వర్ణ వ్యవస్థ మూలంగా వారిలో ఉత్పన్నమయిన ఆ సామర్థ్యాల కారణంగా వారు పొందిన బాధలను నిర్మూలించడం వంటి విషయాలలో ప్రధానంగా దృష్టి కేంద్రీకరింపబడింది. గడిచిన వంద సంవత్సరాలుగా ఈ దేశంలో సాగిన ప్రతి సంస్కరణోద్యమానికీ, రాజకీయోద్యమానికి అస్పృశ్యతానివారణ ఒక ప్రధాన ధ్యేయమయింది. గాంధీ మహాత్ముడు హరిజనోద్ధరణను, కులాల హద్దుల్ని రూపు మాపడాన్ని తన జీవితాశయం చేసుకున్నాడు. అస్పృశ్యతా నిర్మూలన నూ, కుల వర్గ రహిత సమాజ నిర్మాణాన్నీ భారత రాజ్యాంగం స్పష్టంగా పేర్కొనడం గమనిస్తే, మన స్వాతంత్ర్య విధాతలూ, రాజ్యాంగ నిర్మాతలూ ఈ మహాకార్యానికి ఎంతటి ప్రాధాన్యాన్నిచ్చినారో స్పష్టమవుతుంది.

కాని బాధాకరమయిన విషయం ఏమిటంటే, స్వాతంత్రం వచ్చిన తరువాత ఈ ఇరవై రెండేళ్లలోనూ, కులతత్వం బలహీనం కావడానికి బదులు మరింత విస్తరించింది. దీనికి చాలా కారణాలున్నాయి.

వీటిలో అత్యంత ప్రధానమయిన కారణం, రాజకీయ ప్రయోజనాల కోసం రాజకీయ నాయకులూ, పక్షాలూ కులతత్వాన్ని దుర్వినియోగపరచడం. వివిధ కులాల, ఉపకులాల, వర్గాల ఓట్లను ఎన్నికల్లో సంపాదించుకొనటం కోసం రాజకీయ పక్షాలూ, ఏ కొందరు గౌరవనీయులో తప్ప, అనేకులయిన అభ్యర్థులు భారతీయ సమాజాన్ని విధ్వంసం చేసే విధంగా ప్రవర్తిస్తున్నారు. సర్వసాధారణంగా రాజకీయ పక్షాలన్నీ, ఎన్నికలకు అభ్యర్థులను నిర్ణయించడంలో, ప్రచారకులను ఎంపిక చేయడంలో, మంత్రులను నియమించడంలో కులానికి ఎంతటి ప్రాధాన్యం ఇస్తున్నాయో గమనిస్తే, అవి ఎంతగా కులతత్వంలో మునిగిపోయినాయో తెలుస్తుంది. ఇంత, అంత అనడానికి వీలులేనంతగా మునిగిపోయినయి. ఆ కారణంగా ఈనాటి భారత రాజకీయ వ్యవస్థలో కులానికి అత్యంత ప్రాధాన్యం కలిగింది. ఇందులోనూ అతి హీనమయిన అంశం ఏమిటంటే, సామ్యవాదాన్నీ, వర్గ రహిత సమాజాన్నీ గూర్చి పెద్ద పెద్ద మాటలు మాట్లాడేవారే ఈ కులతత్వానికి సమర్థకులు కావడం. శ్రీమతి ఇందిరాగాంధీ తన పార్టీ అభ్యర్థియే ఓడిపోయేట్లు చేసిన 1969 లోని రాష్ట్రపతి ఎన్నికలను ఈ దృష్టితో నిశితంగా పరిశీలిస్తే, ఈ అంశం స్పష్టమవుతుంది. కేంద్ర ప్రభుత్వంతో పాటు పలు రాష్ట్ర ప్రభుత్వాలు గూడా కుల ప్రాతిపదికపై ఆధారపడినాయి. అంతేకాదు, శాసనసభ్యులలో కుల విధేయతను అతిగా పెంపొందించినాయి.

దీని ఫలితంగా, ప్రాంతీయతత్వం మాదిరిగానే- అంతకన్నా అధికంగానే, కులతత్వం కూడా భారతీయైక్యతకు అతి ప్రమాదకరంగా రూపొందుతున్నది. ఈనాటి భారతీయులు మొట్టమొదట జాటులు, లేదా బ్రాహ్మణులు,లేదా రాజపుత్రులు,లేదా హరిజనులు ఆ తరువాతనే, అయితే భారతీయులు.

షెడ్యూల్డ్ కులాలకు, తెగలకు రాజ్యాంగం కల్పించిన ప్రత్యేకత, రిజర్వేషన్‌ల వల్ల కలిగిన స్వార్థపరత్వం ఈ కులతత్వాన్ని సుస్థిరం చేస్తున్నది. ఈ ప్రత్యేకతలు కలుగడానికి పూర్వం ఈ కులాలలో అజ్ఞాతంగానే మార్పులు వస్తూ ఉండేవి. తమ ఆర్థిక, విద్యాస్థాయిని పెంచుకుని క్రింది కులాలవారు పై స్థాయికి రావడానికి ప్రయత్నించే వారు. దీని ఫలితంగానే, చవార్, జాతవ మొదలయిన కులాలవారు క్షత్రియుల ఉప నామమయిన “వర్మ” పదాన్ని తమకు ఉపయోగించు కునేవారు. జాట్, గోండ్ వంటి జాతులకు, తెగలకు చెందినవారు గతంలో శత్రువులుగానే ఒప్పుకోబడినారు.

ఇప్పుడీ పద్ధతి తలక్రిందులయింది. అనేకమంది అగ్రవర్గాలవారు ఉద్యోగాల సంపాదన కోసమో, ప్రత్యేకతలలో తాము కూడా భాగం సంపాదించుకోండం కోసమో, తాము కూడా క్రింది తరగతులకు చెందినవారుగా తప్పుడు “యోగ్యతాపత్రాల”ను సంపాదించడం కోసం పాటుపడుతున్నారు.

ఈ రోగం ఎంత లోతుగా వ్యాపించిందంటే, కుల రహితాలుగా చెప్పుకోబడే క్రైస్తవ, ఇస్లాం మతాలలోకి మారిన వారిని గూడా ఇది వదిలిపెట్టలేదు. అనేకమంది క్రయిస్తవులూ, ముస్లింలూ మతం మార్చుకొన్న భారతీయులే. వారిలోనూ వర్ణ విభాగం తీవ్రంగా వ్యాపించింది. ఎన్నికల సందర్భాలలో మతోద్రేకాలను శిఖర స్థాయికి పెంచి ఈ వర్ణ విభాగాన్ని అతిక్రమించవలెనని వారెంత ప్రయత్నించినా గూడా, అది సాధ్యం కావడం లేదు.

జాతీయ వ్యతిరేకశక్తులు, సంఘ వ్యతిరేకశక్తులు భారతీయైక్యతను బలహీనపరచడానికి, ఈ కుల సంబంధమయిన విరోధాలను, వైషమ్యాలను ఉపయోగించుకుంటున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో పాక్ అనుకూల శక్తులు “రిపబ్లికన్” పార్టీలో చొచ్చుకొనిపోయినయి. తమ దేశ వ్యతిరేక కార్యకలాపాలకోసం హరిజనుల సహాయాన్ని సురక్షితం చేసుకోనడానికి అవి ఈ పక్షంలో

(మిగతా వచ్చే సంచికలో...)

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 12  హైదరాబాద్ అక్టోబర్ : 2022

గ్రంథాంతరంగం 17

# గ్రంథాలయ జ్యోతి

శ్రీ ఘట్టమరాజు, బెంగుళూరు, ఫోన్ : 9964082076

**"అక్షరాలు వచ్చిన వారికి, రానివారికి కూడా పుస్తకాలు చదవడం వల్లా, చదివి, వినిపించుకొనడం వల్లా, విజ్ఞానం, తెలివితేటలు అబ్బుతాయి. డబ్బు ఉన్నవారైనా సరే లేనివారైనా సరే భాగ్యవంతులకు, బీదవారలకు కూడా సమానంగా చదవడానికి అభిలాష కలిగినప్పుడెల్ల, తగిన పుస్తకాలు గ్రంథాలయంలో అమరుతాయి. పది మందీ అక్కడ చేరి తమ తమ అనుభవాలకు కొత్త మెరుగులు పెట్టుకొనడానికి అవకాశం వుంటుంది. ఆయా విషయాలను గూర్చి విజ్ఞానులు, వేత్తలు వ్రాసిన పుస్తకాలను చదవడం వల్ల మన నిత్యజీవితంలో జరిగే సంగతులు, సందర్భాలు ఎదుర్కొనే సమస్యలు అన్నింటినీ ఇది మంచి, ఇది చెడ్డ అని తెల్పుకొనే విచక్షణ జ్ఞానం కలుగుతుంది."** (గ్రంథాలయజ్యోతి, పేజి: 193)



పై మాటలు గ్రంథాలయ పితామహ, గ్రంథాలయోద్ధారక, గ్రంథాలయ శాస్త్ర విశారద బిరుదాంకితులైన అయ్యంకి వేంకట రమణయ్యగారు **'చదువు అనే ఆట ఎట్లా ఆడుకోవాలి?'** (1963) అనే వ్యాసంలోనివి. చదువు పరమార్థం, ప్రధాన ఆశయం గురించి విద్యా వయోవృద్ధులైన అయ్యంకి వేంకట రమణయ్య గారు (1890) రాసిన అక్షర సత్యాలు అక్షర లక్షలు కూడా. చదువువల్ల మనకు ఒనకూడే ప్రయోజనాల గురించి ఆ మహానుభావుడు ఇలా సెలవిచ్చాడు- **"సద్గ్రంథ తతి యున్నచో కాలము లేదు దూరము లేదు. మనకు కరతలామలకము గాని విజ్ఞానము లేదు. స్నేహితులలోని కెల్ల అత్యుత్తములగు స్నేహితులు గ్రంథములు. అవి అడిగినప్పుడు కావలసిన దానినెల్ల ఇచ్చు చుండుటయే కాని మన యొద్దనుండి ఆవంతయైన ప్రతిఫలము నపేక్షించవు."** (గ్రంథాలయ జ్యోతి పేజి : 150) చదువులలోని సారం మాత్రమే కాదు, జీవితానుభవంలోని సారాన్నెల్లా పిండి పాఠకులకు పంచిపెట్టిన పుణ్యాత్ములు అయ్యంకి వేంకట రమణయ్యగారు.

అయ్యంకి వారు ఆంధ్రోద్యమం, జాతీయోద్యమం, పత్రికా రంగం బాల భటోద్యమం, దివ్య జ్ఞానోద్యమం, ప్రకృతి చికిత్స ప్రచారం, గ్రంథాలయోద్యమం ఇత్యాది ఉద్యమాల్లో పాల్గొన్నా, ఆయన్ను తెలుగు సాంస్కృతిక క్షేత్రంలో అగ్రేసరులుగా నిరూపించింది గ్రంథాలయ స్థాపన, ప్రచార సేవే. అయ్యంకి వారు గ్రంథాలయ పితామహులుగా చిరంజీవులైనారు.

వేంకటరమణయ్యగారు ఆంధ్రదేశంలోనే కాక భారతదేశంలోని ఎన్నో రాష్ట్రాల్లో గ్రంథాలయాల స్థాపనకు ప్రేరక శక్తిగా నిలిచారు. ఆ మహానుభావుడు సుమారు అరవై ఏళ్లపాటు ఆబాలగోపాలానికీ గ్రంథాలయ ప్రాముఖ్యాన్ని వివరిస్తూ ఊరువాడల్లో పుస్తకాలయాలు నిర్మింపచేస్తూ యావద్భారత దేశంలో గ్రంథాలయ జ్యోతిని వెలిగించారు. ఈ సందర్భంగా ఆయన గ్రంథాలయాల ఆవశ్యకతను, పుస్తకాల ఎన్నిక, సేకరణ, వర్గీకరణ, పాఠకుల అభిరుచులు, పల్లెల్లో పట్టణాల్లో స్థాపించవలసిన గ్రంథాలయాల స్వరూప స్వభావాల గురించి చేసిన ఉపన్యాసాలు, రాసిన వ్యాసాల్ని వెలగా వెంకటప్పయ్య గారు ఎంతో శ్రమించి, చక్కగా కూర్చి **'గ్రంథాలయ జ్యోతి'** అనే గ్రంథాన్ని సిద్ధపరచారు. ఈ ఉద్గ్రంథం 398 పేజీలతో 1967లో సరస్వతీ సామ్రాజ్య ప్రచురణ ట్రస్టు, బిసెంటు రోడ్డు, విజయవాడ-3. చిరునామా ద్వారా వెలువడింది. ఈ పుస్తకంలో అయ్యంకి వేంకటరమణయ్య గారు 1910-1966 దాకా ఆంధ్రభారతి, గ్రంథాలయ సర్వస్వము పత్రికల్లో రాసిన సంపాదకీయాలు, వ్యాసాలు సంకలింపబడ్డాయి.

**'గ్రంథాలయ జ్యోతి'** సుప్రసిద్ధ గ్రంథ భండాగారి వెలగా వెంకటప్పయ్య సంపాదకత్వంలో వెలువడ్డ విశిష్ట గ్రంథం. ఈ సుకృతిలో మూడు విభాగాలున్నాయి. మొదటి విభాగంలో రాయప్రోలు సుబ్బారావు లాంటి కవిశ్రేష్ఠులు, గొట్టిపాటి బ్రహ్మయ్య వంటి రైతుపెద్ద, రాజకీయవేత్త, వేంకట రంగయ్య లాంటి విద్యావేత్త, దేవులపల్లి రామానుజరావు, కోదాటి నారాయణరావు లాంటి సాహిత్య సంస్థ నిర్వాహకులు, సమాజ సేవకుల అభినందనా వాక్యాలున్నాయి. మహాకవి రాయప్రోలు సుబ్బారావు అయ్యంకి వేంకట రమణయ్యగారు ఆధునికాంధ్ర సాహిత్యానికి అవిరామంవైన సేవ చేసిన 'ఆంధ్రభారతి' మాసపత్రిక సంస్థాపక సంపాదకత్వ గరిమను ఇలా ప్రశంసించారు-"తరువాత(1910) బందరు వెళ్ళాము; 'ఆంధ్రభారతి' మాసపత్రిక అవతరించింది. ఎలా! సర్వాంగ సుందరంగా -

ఆకారంలో క్రొత్త – వ్యాస రచనలో క్రొత్త – జీర్ణవస్త్రములు వదలి వేసింది. క్రొత్త చీరలు ధరించింది ఆంధ్రభారతి; కంఠస్వరంలో కమ్మని తెనుగు; కల్పనా తంత్రములో కఱకైన దీప్తి –

నావంటి నవకవులందరికీ శ్రీ వేంకటరమణయ్య గారి 'ఆంధ్ర భారతి' మొదటి గరడీ అంటే ఆశ్చర్యం లేదు. మాకేకాదు 'ఆంధ్రభారతి' లేకపోతే 'గురజాడ' వారి రచనలు ప్రచురించే పత్రిక వేరొకటి ఉండేది కాదేమో అనాడు.' (గ్రంథాలయ జ్యోతి. పేజి : 18–19) మన రైతు పెద్ద గొట్టిపాటి బ్రహ్మయ్యగారు అయ్యంకి వేంకటరమణయ్య గారి అద్వితీయమైన గ్రంథాలయ సేవను ఇలా ఉగ్గడించారు– **"1913లో ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘాన్ని స్థాపించి, తద్వారా వేంకట రమణయ్య గారు ఆంధ్రదేశములోనే గ్రంథాలయోద్యమానికి మూల పురుషులయ్యారు. గ్రంథాలయ ఉద్యమ వ్యాప్తికి వీరు స్థాపించిన ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘమును, 'గ్రంథాలయ సర్వస్వము' అను పత్రికయును శ్లాఘనీయమైన కృషి జేసినాయి. తాను స్థాపించిన ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘము ఇటీవలనే వైభవంతో జేసికొన్న స్వర్ణోత్సవము నందు గూడ పాల్గొను భాగ్యము శ్రీ వేంకటరమణయ్య కబ్బినది."** (పేజి:24) ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘ అధ్యక్షులైన కర్మయోగి కోదాటి నారాయణరావు ప్రాణ ప్రదమైన గ్రంథాలయ సేవను ఇలా ప్రస్తుతించారు. **"అయితే వేంకటరమణయ్య గారి జీవితం ధన్యమని నేను చెప్పటానికి కారణ మేమిటంటా రేమో! అర్ధ శతాబ్దానికి పూర్వం, ఆయనా మరికొందరు సహచరులూ కలిసి నెలకొల్పిన ఒక చిన్న ఉద్యమము గ్రంథాలయోద్యమం– ఆనాటికీ ఈనాటికీ పటాటోపం, ఆడంబరం లేకుండా సాగిపోతూనే ఉన్నది. ఈ అర్ధశతాబ్దంలో దేశంలో వచ్చిన ప్రబలమైన పరివర్తన ధాటి దీని మీద ఏమీ దెబ్బతీయ లేదు సరిగదా, దాని వల్ల పుష్టి చెంది, అడపా తడపా దానికి కొంత ఊపు గూడా ఇచ్చి కృతజ్ఞత చూపినాయి."** (పేజి : 34)

రెండవ విభాగంలో శ్రీ వెలగా వెంకటప్పయ్య 'సంపాదకీయము' గమనించాల్సిన విషయం. వెలగా వారు అయ్యంకి వేంకట రమణయ్య గారి జీవితాశయాన్ని ఇలా వివరించారు.**"గ్రంథాలయోద్యమం ద్వారా ప్రజలలో విజ్ఞానాన్ని వ్యాప్తం చేసి, సమాజంలో వారి బాధ్యతలను– ప్రభుత్వం నిర్వహించడంలో వారికి గల హక్కులను– తెలియ జెప్పి, తద్వారా విదేశీలయుల పాలనను తుదముట్టించడానికి సావకాశం కలుగుతుందనీ, నవశకం ప్రారంభం అవుతుందని వీరి ఆశయం."** (పేజి : 30) 'గ్రంథాలయజ్యోతి'లో అయ్యంకి వారి వ్యాసాలు, ప్రసంగాలు, సంపాదకీయాలు సుమారు 50 దాకా సంకలింప బడ్డాయనీ, గ్రంథాలమోద్యమానికీ, స్థాపన, స్వరూప, నిర్వహణ, వ్యాప్తులకూ సంబంధించినవి 15 శీర్షికల కింద గుది గుచ్చబడ్డాయని సెలవిచ్చారు వెలగావారు.

ఈ రెండవ విభాగంలో మనం ముఖ్యంగా గమనించాల్సిన సంగతి ఒకటుంది. అయ్యంకి వారు బందరు నుంచి 1910 జూన్ నెలలో వెలువరించిన, 'ఆంధ్రభారతి' మాసపత్రిక సంపాదకీయం 'శిరోమణి' తిలకంతో ప్రచురింపబడింది. 'ఆంధ్రభారతి' తిలకంతో ప్రచురించే ఉదాత్త ఆశయాన్ని వేంకటరమణయ్య గారు ఇలా వ్యక్తం చేశారు. "రక్తప్రసారము లేని శరీరమెట్లు మరణావస్థ నొందునో యట్లే భావసంచారము లేని సంఘమును నిర్జీవము నొందును. భావ ప్రకటనమునకు సర్వావకాశములను గల్పించుట సంఘ నిర్మాణకుల యవశ్య కర్తవ్యము. ఏకాశానవన్నైనను ఏనీతియైనను భావోదయమును నిరోధించరాదు. ఆ సంఘము సర్వ పీడలకు ఆకరమై యధోముఖ మార్గగామి యగును.

**"జాతీయ జీవనముకు దోహదము నొసంగి వాఙ్మయ ప్రపంచము నకు నూతన తేజంబు నొసంగల పత్రిక లవశ్య ప్రతిష్టనీయంబులు."** (పేజి:42) రామానంద ఛటర్జీ సంపాదకత్వంలో కలకత్తా నుంచి 1907 నుంచి వెలువడుతున్న ఆంగ్ల భాషామాసత్రిక 'మాడర్న్ రివ్యూ' ఆదర్శాల్ని పుణికి పుచ్చుకొని వెలువడింది ఈ 'ఆంధ్రభారతి'. ఇందులో అచ్చయిన రచనలు తెలుగు సాహిత్యంలోని కవిత్వం, కథ, వ్యాసం మొదలైన ప్రక్రియల్లో భావం, వస్తువు, రచనల్లో కొత్తదనాన్ని సంతరించి పెట్టాయి.

అయ్యంకి వేంకట రమణయ్య గారి సంపాదకత్వంలో విజయవాడ నుంచి 1915లో 'గ్రంథాలయ సర్వస్వము' అనే త్రైమాస పత్రిక వెలువడింది. సంపాదకులు ప్రథమ సంచికలో 'ఉపోద్ఘాతము' అనే శీర్షికతో ప్రచురించిన సంపాదకీయంలో ఇలా వ్రాశారు–"ఈ నాటి గ్రంథాలయములు ప్రత్యేక గ్రంథములే గాక, మనుజుని యొక్క సమస్త జ్ఞానేంద్రియముల మూలకముగను మనుజుని మనుష్యత్వము ను వ్యక్తీకరింపజేయు సాధనముల సమకూర్చునవై యుండుటచే, చిత్రకళల యభివృద్ధిని గూర్చిన వ్యాసములు కూడ నిందు ప్రకటింప బడును.

ఆంధ్రదేశాభిమానులు, ఆంధ్ర భాషాభిమానులును ఇందు ప్రచురించుటకు వ్యాసములను బంపియు ఈ గ్రంథమాల యభివృద్ధి నొందుటకు ప్రోత్సాహ పరిచియు నీ యుద్యమమును జయప్రదముగ జేయుటకు బ్రార్థితులు.(పేజి: 54) గ్రంథాలయ సర్వస్వములో కవులు, పండితులు మౌలిక కవిత్వం రచించడంతో పాటు విమర్శనాత్మక వ్యాసాలు రాసేవారు. మహా విద్వాంసులైన పురాణం సూరిశాస్త్రి గారు 'గ్రంథాలయ సర్వస్వం' 1924 అక్టోబరు సంచికలో 'నవీనాంధ్ర సాహిత్య కవులు' 'ఆంధ్ర నాటకోద్యమ సమీక్ష' అనే వ్యాసాల్లో ఆధునికాంధ్ర వాఙ్మయ వికాసానికి తోడ్పడ్డ మహనీయుల రచనల్ని బేరిజు వేశారు. "………నవ్య కవిత్వంతో బాటు నాటకముల, ఇతర వ్యాకరణ శాస్త్రంతో బాటు, వ్యావహారిక భాషా పరిశోధనకునూ సమాన స్థానమును' గల్పించి "క్రొత్త ప్రాతల మేలు

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 12 (27)
UGC Care List Approved Journal
హైదరాబాద్ అక్టోబర్ : 2022

కలియికమై క్రొమ్మెరుంగుల జిమ్మినది గ్రంథాలయ సర్వస్వం" (పేజి: 58) అయ్యంకి వారి గ్రంథాలయ సేవను ఉగ్గడిస్తూ డా. సి. ఆర్. రెడ్డిగారు రాసిన ఈ మాటలు ఎంతో విలువైనవి – **"పూర్వము ఎంత యుత్కృష్ట గ్రంథమైనను ఒక వంద ప్రతులు అమ్ముడు బోవుట కష్టముగ నుండెడిది. కాని గ్రంథాలయోద్యమ ప్రచారము ప్రబలిన కొలదిని ప్రజలలో ఉత్సాహ మినుమడించి విద్యాసముపార్జ నాభిలాషయు వృద్ధియైనది..... అనగా గ్రంథాలయోద్యమ ప్రచారము వలన గ్రంథముల విక్రయము, తద్వారా గ్రంథపఠనాభిలాష విద్యాసముపార్జ నాభిలాష ఇనుమడించినవని నొక్కి జెప్పవచ్చును. దీని కంతకును కారణము వేంకట రమణయ్య గారే."** (పేజి: 68)

అయ్యంకి వేంకటరమణయ్య సంకల్పించి నారు నీరు పోసిన గ్రంథాలయోద్యమం నానాశాఖలుగా ఆంధ్రదేశమంతటా విస్తరించ డానికి ఆయన వ్యక్తిత్వంలోని ఓ విశేషగుణాన్ని శిష్యులొకరు ఇలా ప్రస్తావించారు. **"నావలెనే ఎంత మందియో విద్యార్థులను అయ్యంకి వారు గ్రంథాలయోద్యమమున గద్దెనెక్కించి, యుద్యమాభిమానులుగా తయారు చేసినారు. ముందుకొచ్చి, నాకీ పదవి కావాలని ఎన్నడూ ప్రాకులాడు గోరిక లేదు. ఎక్కడ చూచినా తన పని మందహాసంతో చేసికొని పోవడమే గాని, అధికార పదవుల కోసము దేవులాడుట లేదు. పనికి ముందు, పదవులకు వెనుక– వీరి జీవితములో నా యనుభవము."** ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులుగారు అయ్యంకి వారిని 'కర్మయోగి' గా అభివర్ణించారు. " (పేజి: 88)

మూడవ విభాగంలో ఎంతో అర్థవంతమైన, ఆవశ్యకమైన వ్యాసాలున్నాయి. ధర్మ గ్రంథాలయములు– నిర్వహణ, సార్వజనిక పుస్తకాల నియమములు, ఆంధ్ర గ్రంథాలయోద్యమము– సింహావలోకనము, చైతన్యదాయకాలు. గ్రామ గ్రంథాలయాలకు, వయోజన విద్యకు, బాలల గ్రంథాలయాలకు, గ్రంథాలయోద్యోగుల సమస్యలు మొదలైన ఎన్నో వ్యాసాలు ఈ విభాగంలో సంకలింప బడ్డాయి.

అయ్యంకి వేంకట రమణయ్య తమ జ్ఞానాన్ని, అనుభవాన్ని, ఆశయాల్ని ఆబాల వృద్ధులకూ, పండిత పామరులకూ అరటిపండు వొలిచి నోట్లో పెట్టినంత సులభంగా, కుతూహలం కలిగేలా తెలియచేస్తారు. సార్వజనిక పుస్తకాలయాల స్వరూపం గురించి ఇలా వివరిస్తారు. **"......ఏ మందిరమున బాలురును, యువకులును, వృద్ధులును, నేకరీతి విద్యా పరిశ్రమ జేయుట కనకాశము కలదో అదియే సార్వజనిక పుస్తకాలయము, అదియే బాలురకు విహార స్థలము విహార స్థలము, చింతా క్రాంత చిత్తుల కూరడింపు నింపుతావు, గర్వోద్రిక్తులకు మహాంకుశము, అదియే విద్వాంసులు సమావేశమగు భవనము. అచ్చట విద్యాగంధము వెదజల్లబడి యున్నది. ఆ సుగంధము నొకసారి ఆఘ్రాణించిన వారు సమ్మోహితులగుచున్నారు"** (పేజి: 43)





వేంకట రమణీయవాణి : ౧

గ్రంథాలయ జ్యోతి

గ్రంథాలయ పితామహ
గ్రంథాలయోద్ధారక
గ్రంథాలయశాస్త్ర విశారద
అయ్యంకి వేంకట రమణయ్య
వ్యాస సంపుటి 1910-1966

సంపాదకులు
వెలగా వెంకటప్పయ్య
ప్రిన్సిపాల్, స్కూల్ ఆఫ్ లైబ్రరీ సైన్సు, విజయవాడ-6

1967
సరస్వతీ సామ్రాజ్య ప్రచురణ ట్రస్టు
బిసెంటు రోడ్డు – విజయవాడ-2

అయ్యంకి వేంకట రమణయ్యగారి జీవితాన్ని సంక్షిప్తంగానూ, పత్రికా సంస్థాపకత్వం, సంపాదకత్వ ప్రావీణ్యాన్నీ, గ్రంథాలయోద్యమ చరిత్రనూ, గ్రంథాలయ జ్ఞాన సర్వస్వాన్ని చాటే వ్యాసాలనూ నింపుకొన్న జ్ఞాన గంగోత్రి ఈ 'గ్రంథాలయ జ్యోతి' గ్రంథాలయ పితామహులుగా పేరు మోసిన అయ్యంకి వేంకటరమణయ్య ఉదాత్త సంకల్ప శక్తి, నిస్వార్థ సేవాసక్తి, నవయువతా ప్రేరణాయుక్తి త్రయం ఆంధ్రదేశంలోనే కాదు, సమస్త భారతదేశంలో కూడా గ్రంథాలయోద్యమాన్ని ప్రగతిపథంలో నడిపి చరిత్ర కెక్కింది. ఈ గ్రంథాలయ జ్యోతి' కాంతులు నేటికీ జ్ఞాన పిపాసువుల్నీ, సరస్వతీ ఆరాధకుల్నీ మునుముందుకు నడిచేలా ప్రేరేపిస్తున్నాయి.


# ఆలోకనం

**(తెలంగాణ 31 జిల్లాల**
**చరిత్ర సాహిత్య సాంస్కృతిక సమాచారం)**

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మూసీ మాసపత్రిక ప్రత్యేకంగా సంకలనం చేసిన గ్రంథం ఆలోకనం.

తెలంగాణ 31 జిల్లాలకు సంబంధించిన విలువైన సమాచార సూచిక ఇది.

330 పేజీల ఈ గ్రంథం విలువైన రంగు చిత్రాలతో కూడుకుని ఉన్న విశేష గ్రంథం.

అన్ని రకాల కాంపిటీషన్ పరీక్షలకు కూడా వినియోగపడే సమగ్ర సమాచార దర్పణం.

**మూసీ కార్యాలయంలో దీనిని పొందదలచిన వారికి కేవలం 300/- (అసలు 500/-) కు మాత్రమే అందిస్తున్నాం. సంప్రదించండి.**

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 12  హైదరాబాద్ అక్టోబర్ : 2022

# తెలంగాణ నవలలు – కులవృత్తుల ప్రస్తావన

**సుధామల్ల స్రవంతి**, వరంగల్, ఫోన్ : 9493244440

వృతులతో నిండుకొని ఉన్న సమాజం మనది. వృత్తుల ఆధారం గానే కులాలు ఏర్పడ్డాయని చరిత్ర తెలుపుతుంది. భారతదేశంలో మాత్రమే వృత్తి అనేది కులంగా మారిందని చెప్పవచ్చు. మన సాహిత్యంలో మొట్టమొదటగా పాల్కురికి సోమన కులవృత్తులను గురించి ప్రస్తావించారు. ఆ తర్వాత తెలుగు సాహిత్యాన్ని స్వర్ణయుగంగా తీర్చి దిద్దిన శ్రీకృష్ణదేవరాయలు, పాలవేకరి కదిరీపతి, శ్రీనాథుడు వంటి కవులు కులవృత్తుల్ని తెలుగు సాహిత్యంలో ప్రస్తావించారు. సమాజానికి అవసరమైన సమస్త సంపదను సృష్టించిన ఉత్పత్తి వర్గాల్నే వృత్తిదారులుగా చెప్పాలి. శ్రీశ్రీ మహాప్రస్థానంలోని ప్రతిజ్ఞ ఖండికలో సహస్రవృత్తులు సమస్త చిహ్నాలుగా శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేనేలేదని ఎలుగెత్తి చాటారు. ఆధునిక కవులు, రచయితలు వృత్తిదారుల కష్టాలు, నష్టాలు, వారి జీవన ఛిద్రదృశ్యాలను అక్షరీకరించారు. ఈ ప్రయత్నం వృత్తిదారుల్ని చైతన్యవంతుల్ని చేస్తున్నది. మండలికాల్లో రచనలు చేయడం వల్ల సాహిత్యం కూడా కొత్తదనాన్ని రూపుదిద్దుకుంటోంది.

తెలుగు సాహిత్యంలో కులవృత్తులను గురించి ఎక్కువగా రచనలు చేసి సాహిత్యాన్ని సుసంపన్నం చేసినవారు డా. కాలువ మల్లయ్య. ఇప్పటివరకు వీరు పద్నాలుగు నవలలు వెలువరించారు. భూమి పుత్రుడు, సాంబయ్య చదువు, బతుకు పుస్తకం, గువ్వలచెన్నా, (డబ్బు)–తృప్తి దుఃఖం, తెలంగాణ దేవదాసు, చీకట్లో చిరు దీపం, మెతుకు పుస్తకం, నీ బాంచెన్ కాల్మొక్త (నీల్ బనో గులాంగిరి చోడో), మంచియన్నది మాల అయితే, మాదిగ విజయం, అస్పృశ్య కోయిల మొదలగు నవలలు సామాజిక వాస్తవిక దృక్పథంతో రాయబడటం వల్ల సమకాలీన చరిత్రకు సాక్షాలుగా నిలువగలవు. 'భూమి పుత్రుడు' నవలలో కాపు కులవృత్తి జీవన పరిణామాలను చిత్రించారు. తెలంగాణలో కాకతీయులకు పూర్వమే వ్యవసాయం జీవనాధారంగా చేసుకున్నట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. కాపు దాపు అన్న నానుడి విదితమే. కాపులు పంటను సంరక్షిస్తూ జనాలకు పట్టెడన్నం పంచుతూ వచ్చారు. అట్లాంటి కాపు రైతులు 1980 దశకంలో సంక్షోభాన్ని ఎదుర్కోవడం, అప్పుల క్రింద తల్లి వంటి భూమిని అమ్ముకొని కూలీలుగా మారి జీవనోపాధికి వలస వెళ్లాల్సి రావడాన్ని ఈ నవల సూచిస్తుంది.

'సాంబయ్య చదువు' నవల ప్రధానంగా వెనుకబడిన కులానికి చెందిన గొల్లల జీవన పరిణామాలను చిత్రించింది. గొల్లకులంలో పుట్టిన కాలువ మల్లయ్య చదువుకొని ఎదిగి జీవితాన్ని గెలుచుకొని రామగుండం ఎరువుల ఫ్యాక్టరీలో ఉద్యోగిగా స్థిరపడటం జరిగింది. ఈ ఇతివృత్తమే నవలలో కనిపిస్తుంది. 1952 నుండి 1986 మధ్య కాలంలో నవల ప్రవర్తిస్తుంది. ఒక విధంగా ఇది కాలువ మల్లయ్య గారి ఆత్మకథలో భాగమని భావించవచ్చు. ఈ నవలలో చిలుకయ్య ఆరేళ్లు నిండిన కొడుకును బడిలో చేర్పించడానికి దొర అనుమతి కోసం వెళ్తాడు. వెనుకబడిన బడుగు, బలహీన కులాల వారు చదువుకొని ఎదగడం సహించలేని దొర **'చాకలోడు, మంగలోడు అందరు చదివితే దానికేం విలువుంటది? నా మాట విని నా కాడ ఎడ్ల కాయడానికుంచు మూడు కుంచాల మక్కలిత్త'** అని మభ్య పెడ్తాడు. దొర సలహా నచ్చని చిలుకయ్య సాంబయ్యను చదివిస్తాడు. ఎన్నో అవాంతరాలు, ఉద్యమాలు అడ్డంకిగా మారిన సాంబయ్య శ్రద్ధగా చదువుకొని ప్రయోజకుడై ఉద్యోగంలో స్థిరపడ్తాడు. గొల్లలతో హేళనగా మాట్లాడడం, తక్కువచేసి అవమానించడం, అయినా గొల్లలు చదువుకొని, ఎదిగి జీవితాలను గెలుచుకోవడం ఈ నవలలో కనిపిస్తుంది. తెలంగాణ పల్లెల్లో దొరల అధికార దర్పం, దళిత, బహుజన కులాలను ఎదగకుండా అణచివేసిన కుటిలత్వం చూడవచ్చు. నక్సలైట్ విప్లవోద్యమాల అనంతరం దొరల అధికారానికి బీటలు పారడం, దళిత, బహుజన కులాలవాళ్లు ఊపిరి పీల్చుకోవడం గమనించగలం.

**'బతుకు పుస్తకం'** నవల గ్రామీణ నేపథ్యంగా ఆయా కులాలను తెలుపుతూ వెలువడిన నవల. కాలువ మల్లయ్యగారి దృష్టిలో బాటుకు నిచ్చేది రూ. 1. అందుకే ఊరికి బతుకు పుస్తకమని నామకరణం చేసుకున్నారు, ఈ నవల గత యాబైఏళ్ల గ్రామీణ జీవిత పరిణామా లను చిత్రించింది. గ్రామాల్లోని అగ్ర వెనుకబడిన, దళిత కులాల జీవన ప్రమాణం కాలంతో పాటు పరిణామం చెందడాన్ని సూచించింది. ఊరిలో చదువు అందుబాటులోకి వచ్చాక చదువుకున్న వారిలో కాపు లసుమయ్య కొడుకు రాజయ్య డిగ్రీ చదివి ఉద్యోగిగా స్థిరపడితే, మాలాల కులానికి చెందిన దొంత సాంబయ్య కొడుకు భూమయ్య పి.జి పూర్తిచేసి కాలేజీలో లెక్చరర్ అవుతాడు. కొండ్రావు దొర కొడుకు డిగ్రీ అయ్యాక కరీంనగర్‌లో స్వంత వ్యాపారం చేస్తాడు. చదువుల వల్ల అన్నీ కులాల వారి జీవన ప్రమాణాలు పెరిగినప్పటికి ప్రపంచీకరణ వల్ల గ్రామాల్లో వ్యాపార సంస్కృతి పెరగడం, సరళీకృత ఆర్థిక విధానాలవల్ల పారిశ్రామీకరణ, యాంత్రీకరణ మూలనా కుటీర పరిశ్రమలు దెబ్బతిని కులవృత్తులు ఉనికిని కోల్పోవడం, విప్లవోద్యమాల వల్ల దొరల అధికారం సన్నగిల్లి, దొరల గడీలు శిథిలమై ఆనవాళ్ళుగా మిగలడం మొత్తం మీద గత యాబై ఏళ్లలో పల్లెల స్వరూపం పూర్తిగా మారినట్లు రచయిత స్పష్టం చేయడం జరిగింది.

**'గువ్వలచెన్నా'** నవలలో మూడు తరాల పద్మశాలి కుల జీవన పరిణామాలను, వృత్తికి దూరమైన తప్పని వలసలను కాలువ మల్లయ్య గారు చిత్రించారు. ఈ నవలలో కాపు కొండయ్య కొడుకు రఘురాం వేణుగోపాల్ రెడ్డి దొర కూతురు రాజ్యలక్ష్మి హైస్కూల్ చదువుతున్నపుడే ఒకరంటే ఒకరు ఇష్టపడుతారు. ఇంజనీరింగ్ చదివిన రఘురాం ను తప్ప వేరొకరిని పెళ్లి చేసుకోనని అంటుంది, దొర పరువు కోసం రఘురాంను హత్య చేయడానికి పూనుకుంటాడు. రఘురాం బతికిఉంటే చాలని విధిలేక తండ్రి తెచ్చిన సంబంధానికి తలొగ్గి తాళి కట్టించుకుంటుంది. రఘురాం కొన్నాళ్ళ వరకు స్తబ్ధతతో ఉండి పోతాడు. ఆ తర్వాత ఇంజనీర్గా స్థిరపడి ప్రజాసేవలో నిమగ్నుడవుతాడు. రాజ్యలక్ష్మిని కలిసాక వాస్తవం తెలుసుకొని ఆమె సూచన మేరకు పెళ్లి చేసుకొని జీవితంలో స్థిరపడుతాడు.

కాలువ మల్లయ్య ఎంచుకున్న ఇతివృత్తాలు వారి అనుభవ పరిధి లోనివి కాబట్టే వాస్తవికతతో శోభిల్లుతూ తెలంగాణ సామాజిక చరిత్రకు అద్దం పట్టేవిగా ఉంటాయి. వీరి పాత్రలన్నీ మనకు బాగా తెలిసిన వ్యక్తులుగా కనిపిస్తారు. ముఖ్యంగా వీరి ఆశు శిల్ప ధోరణి కట్టి పడేస్తుంది. ఒక ఆర్తితో ప్రాంతీయముద్రతో, తెలంగాణ మాండలికానికి వన్నె తెచ్చిన ఘనత కూడా వీరిదే.

**కాలువ మల్లయ్య** రాసిన కులవృత్తి నవల **భూమి పుత్రుడు.** ఈ నవలలో చిత్రితమైన వృత్తులు, కులాలు, ఆ కులాల మధ్య సంబంధాలు, గ్రామీణుల పనులు, ఆటపాటలు, అలవాట్లు, ఆచార వ్యవహారాలు, విశ్వాసాలు, పండుగలు మొదలగు వాటిని దృష్టిలో పెట్టుకొని గ్రామీణ జీవనాన్ని పరిశీలించడం జరిగింది.

గ్రామీణ జీవనంలో కుల వ్యవస్థ అత్యంత ప్రాధాన్యత వహిస్తుంది. కులవ్యవస్థ పునాదుల పైననే గ్రామీణ సామాజిక జీవనం నిలబడుతూ వచ్చింది. ముఖ్యంగా ఈ నవలలో కులవృత్తికి సంబంధించిన పాత్రలు చిత్రించబడ్డాయి. అలాంటి పాత్రలలో షావుకారు రాజేశం పాత్ర ఒకటి. షావుకారు గ్రామాల్లో ఎలా బలపడ్డారో ఈ పాత్ర నిరూపిస్తుంది. షావుకారు రాజేశం కట్టుబట్టలతో ఆ ఊరికి వచ్చి, రైతులను మోసగిస్తూ క్రమంగా మోతుబరులు, రైతులకు అవసరానికి అప్పిచ్చే స్థితికి ఎదిగాడు **"ధరలు యెంత పెరిగినప్పటికి, రైతులు మంచికి, చెడుకు, పెండ్లికి, చావుకు మొత్తం పైన అన్ని మత లేక సామాజిక ఆచారములకు సంబంధించిన కార్యములు వ్యయమునకై తగు సాహుకారి సహాయము యాచించు తప్పలేదు"** అని అన్నారు ముందుముల నరసింగరావుగారు. కేవలం అప్పులు ఇవ్వడమే కాకుండా నిత్యావసర వస్తువులను తెచ్చి విక్రయించడం కూడా షావుకారు వృత్తి కాబట్టి గ్రామీణ జీవనంలో కోమట్లు భాగమయ్యారు. కొండ మల్లయ్య షావుకారు రాజేశం వద్ద అప్పు చేసి దోపిడికి గురయ్యాడు.

**"పద్మశాలీలు తాతముత్తాల నాటి నుండి ఊరిలో మగ్గం నేస్తున్న బట్టకు పొట్టకు కష్టంగానే ఉండేది. ఆదిలాబాద్ వంటి మారుమూల ప్రాంతాలలో బట్టలు అమ్మడం మూలాన కొంత డబ్బు గడించారు. కొంత భూమిని కూడా సంపాదించుకున్నారు. అట్లా బాగుపడిన వారిలో పద్మశాలి కిష్టయ్య కన్పిస్తాడు. పద్మశాలీలకు కులపరిధిలో పట్టింపులు ఎక్కువ. చిన్న తప్పుకు కూడా పంచాయితీలు పెట్టుకోవడం కన్పిస్తుంది"** (పుట: 46) ఇలా పద్మశాలీల జీవన విధానాన్ని స్పష్టంగా తెలియజేశారు.

స్వాతంత్ర్యం వచ్చాక 35సంవత్సరాలకి సరిగ్గా యిటువంటి రాజకీయ నేపథ్యంలోనే బీడీ కార్మికుల బతుకు వెతల్ని సజీవంగా చిత్రిస్తూ **బి.ఎస్.రాములు** రచించిన **'బతుకు పోరు'** నవల వెలువడింది. బి.ఎస్.రాములు బతుకుపోరు రాసేనాటికి (1982) వుత్తర తెలంగాణలో యుద్ధవాతావరణం నెలకొని వుంది. శ్రీకాకుళం కొండల్లో చెలరేగిన గిరిజన రైతాంగ వుద్యమం ఆదిలాబాద్ అడవుల్లో కరీంనగర్ మైదానాల్లో జగిత్యాల పల్లెల్లో సింగరేణి బొగ్గు గుట్టల్లో గోదావరి అలల్లో వొళ్ళు విరుచుకొని కళ్ళు తెరచింది ('తెలంగాణ అన్వేషణ' సృజన సంపాదకీయాలు, పర్ స్పెక్టీవ్స్ : హైదరాబాద్, పే.220). రైతాంగ వుద్యమాన్ని అణచివేయడానికి ప్రభుత్వం వలస పాలన కాలం నాటి కల్లోల చట్టాన్ని అమల్లోకి తెచ్చింది (1978). అయితే ప్రజా వుద్యమం వెనుకంజ వేయలేదు. రైతాంగంలో రగిలిన చిచ్చు బొగ్గు గని కార్మికవాడల్లోకీ గిరిజన గూడెంలలోకి వ్యాపించింది. 1981 ఏప్రిల్‌లోనే యింద్రవెల్లి గిరిజనులపై మూకుమ్మడి హత్యా కాండా, మస్టర్ కోతకి వ్యతిరేకంగా సింగరేణి గని కార్మికుల 56 రోజుల సమ్మె జరిగాయి. వీటి ప్రభావం బీడీ పరిశ్రమలాంటి అసంఘటిత కార్మికులపై కూడా పడింది. 'బతుకుపోరు' నవల తెలుగు ఉద్యమ నవలకు ఒక మంచి నమూనా. 1980 దశకంలో గల తెలంగాణలోని వాస్తవిక పరిస్థితిని సృజనాత్మకంగా వ్యక్తీకరించింది. ఇందులో రచయిత అభిప్రాయాలకు, విశ్వాసాలకు ఎక్కడా తావు లేదు. అప్పటి పరిస్థితిని చిత్రిక కట్టి పాఠకుల ముందుంచుతుంది. ఆ రకంగా ఇది ఎల్లకాలం సాహిత్యంలో నిలిచిపోయే రచన. వివిధ వృత్తులతో జీవించే ప్రజల జీవితాన్ని ప్రదర్శించే నవలలు తెలుగులో తక్కువగా వచ్చాయి. ఆకులతో బీడీలు చుట్టి కట్టలు కట్టి ఫ్యాక్టరీలు బ్రోకర్లిచ్చే కొద్దిపాటి కూలితో బతికే కార్మికుల స్థితిని 'బతుకుపోరు' నవల వర్ణిస్తున్నది.

రాజయ్య కూతురు సుగుణ బడి మానేసింది యింకా పెళ్ళికాలేదు. తల్లికి తోడుగా తాను కూడా బీడిలు చుడుతున్నది. సుగుణకు పదిహేను రోజుల పనికి ఎనబై రూపాయలు వస్తాయి. పదిహేను రూపాయలు తన ఖర్చులకు వుంచుకొని మిగిలిన డబ్బు తల్లికి ఇస్తున్నది. తను తీసుకున్న పదిహేను రూపాయల్తో రెండు సినిమాలు చూస్తుంది. చిరుతిళ్లు కొనక్కుతింటుంది. బీడీల కంపెనీ హెడ్డాఫీసులో జీవితాలిచ్చే సమయంలో నారాయణ దాదాకు ఎదురుతిరిగాడు.

జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించాడు. కష్టాలు భరించలేక బీడి కార్మికులు సమ్మెకు పూనుకున్నారు. దాదా చిక్కుల్లో పడ్డాడు. సేటు ఫోన్ చేసి చివాట్లేశాడు. "నాలుగు రోజులు సమ్మె చేస్తే ఏమిలే" అనుకోవటానికి వీలు లేకుండ బీడీలకు గిరాకీ పెరిగింది. ఇతర బీడీ కంపెనీ పని వాళ్ళు కూడ సమ్మెలో చేరారు. 'బతుకుపోరు' నవల యదార్థ జీవితపు వ్యధార్థ జీవనచిత్రణమే. ఇతర ప్రాంతాలవారికి తెలియని బీడి కార్మికుల జీవితాన్ని రాములు కళాత్మకంగా తీర్చిదిద్దారు.

**సుషుప్తి నవల కమ్మరి వృత్తి చిత్రణ**

కుల వృత్తులు విధ్వంసం కాబోతున్నాయని, గ్రామీణ ప్రజల జీవితాలు చిన్నాభిన్నం అయ్యే విషయాన్ని మాదిరెడ్డి సులోచన 1975కు ముందే పసిగట్టారు. ముఖ్యంగా కుమ్మరి వృత్తికి సంబంధించిన అంశాన్ని వస్తువుగా తీసికొని "సుషుప్తి" అనే నవల రాశారు. ఈ నవలలో ఆర్థిక పరిణామాల పరంపరలో ఛిద్రమౌతున్న కుండతో ముడిపడి వున్న కుమ్మరి జీవితాన్ని చిత్రించారు రచయిత్రి. మాదిరెడ్డి సులోచన.

కుమ్మరి బాలయ్య ఒకప్పటి కాలంలో తన వృత్తి ద్వారా కూజాలు చేయటంలో జిల్లాకే పేరుగాంచిన వ్యక్తి. కూర చట్టీలు, పెరుగు తోడు పెట్టే ముంతలు, పూలకుండీలు, ఇల్లు కప్పుకునే పెంకులు, కల్లుముంతలు, నోములకు కొత్త కుండలు, ఈ విధంగా కుమ్మరి బాలయ్య ఏది చేసినా బాగా చేస్తాడని, గట్టిగా ఉంటాయని చాకలి, హరిజన, బెస్త వాడలకు చెందిన వారందరూ వచ్చేవారు. ఎంతో మెచ్చుకునే వారు. చేతి కింద నల్గురు వ్యక్తులు పనికోసం ఉండేవారు. బాలయ్య భార్య ఎంకమ్మ అనేక బంగారం, వెండి ఆభరణాలతో రచయిత్రి చెప్పినట్టు 'పూసిన తంగేడు"లా ఉండేది.

కుమ్మరి వాము కోసం ఎంకమ్మ, చుక్క కంప కొట్టటం, తీసుకు రావటం, మట్టి త్రవ్వక రావటం స్త్రీపురుషులు కలిసి పనిచేసే సంస్కృతి చక్కగా చిత్రించారు. కొన్ని జాతులలో కట్నాల పిశాచి లేకుండా తాహతును బట్టి ఒక్కపూట విందుభోజనంతో భార్యాభర్తలు కావటమనేది ఈ నవలలో మరొక విశేషం. పుట్టుక, పెళ్ళి, అప్పగింతలు, పాటలు, చావులు, కుల కట్టుబాట్లు మొదలగునవి వర్ణించటం ఈ నవలకున్న మరొక ప్రత్యేకతగా చెప్పవచ్చు. కుమ్మరి వాము పెట్టినపుడు కంపను తొయ్యటం, వాము ముఖద్వారం వద్ద కంప తోసినపుడు ఆ మంటతో పరిసరాలన్నీ ప్రకాశవంత మయ్యాయి. కాస్త కంప తగ్గినపుడు పరిసరాలు చీకటి అవుతున్నాయి.

వాళ్ళ బ్రతుకుల్లాగే అనే ఉపమానం కుమ్మరి బాలయ్య కుటుంబ స్థితిని తెలుపటంలో రచయిత్రి ఔచిత్యం కనిపిస్తుంది. సినిమాల ప్రభావం వ్యక్తుల మీద ఎంతగా ఉంటుందో గోవిందు పాత్ర నిరూపించింది. సినిమాలో జరిగినట్టుగా ఒక గొప్పింటి స్త్రీ తన జీవితంలోకి వస్తుందని పగటికలలు కనటం, దేవకి టీచర్‌ను చూసి గోవిందు ఊహల్లో బ్రతకటం గమనిస్తే చదువుకున్న వారైనా, చదువులేని వారైనా స్త్రీలు కలుపుగోలుగా మాట్లాడితే చాలు రకరకాల ఊహాగానాలు ఏర్పర్చుకుంటారు. స్త్రీని ఒక వస్తువుగా, ఆమెపై వాళ్ళు హక్కుదారులుగా కథలు అల్లుకునే పరిస్థితులు ఇప్పటికీ మారలేదు. కొందరు పురుషులు స్త్రీని అర్థం చేసుకోవటంలో వైఫల్యం కొట్టొచ్చినట్టుగా ఈ నవలలో చిత్రించబడింది.

**బతుకుతాడు – నేరెల్ల శ్రీనివాస్ గౌడ్**

'బతుకుతాడు' నవల కల్లుగీత కార్మికుల బతుకు వెతలను తెలిపిన నవల. నవలా రచన వికాసదశకు చేరుకుంటున్న దశలో రచయితలు చాకలి, మంగలి, సాలి, కమ్మరి, కుమ్మరి, జాలరి, కల్లుగీత మొదలైన వృత్తులవారి జీవితాలు వర్ణించే నవలలు ఆనాడు రాలేదు. 'మాలపల్లి' తరువాత నిమ్నజాతులకు, కులవృత్తులకు సంబంధించిన నవలలు తక్కువగా వచ్చాయి. 1985 ప్రాంతాలలో తెలుగు సాహిత్యంలో దళిత చైతన్యం సమాజంలో కొత్త కోణాలను ఆవిష్కరించింది.

**"కులవృత్తుల గురించి సాధికారికంగా రాయటం ఆ వృత్తి గురించి తెలియని వారికి కష్టతరమౌతుంది. ఆ వృత్తికి చెందిన వారికి రచన చేపకు నీటిలో ఈదినంత సుకరమవుతుంది. శ్రీ నేరెల్ల శ్రీనివాసగౌడ్ కల్లుగీసే గీతకార్మికుడు. వాళ్ళ కుటుంబపు తరతరాల కథ 'బతుకు తాడు'. తాటిచెట్టును తెలంగాణలో ఏకవచనంలో 'తాడు' బహువచనంలో 'తాల్లు' అని అంటారు. తాడిచెట్టు ఎక్కటానికి ఉపయోగించే మోకును తాడు అంటారు. మోకు బలంగా ఉంటే గీత కార్మికుడి ఆయుస్సు బలంగా ఉంటుంది. తాడు కల్లు బాగ పారితే అతని బతుకు సుఖంగా ఉంటుంది. ఈ నవలలోకి నడిచి వచ్చిన పాత్రలు మా అమ్మమ్మ తాలవ్వ. మేనమామలు మల్లయ్య, నాగన్న, పోచన్న, మా మామ గాజుల బక్కన్న. మా అత్త రాయమల్లు, నాతో పాటు కష్ట సుఖాల్లో నాకు తోడై నిలిచిన నా శ్రీమతి సత్తవ్వ. అని రచయిత స్వయంగా చెప్పుకున్నారు."** (బతుకుతాడు, ముందుమాట)

ఈ నవల ప్రధానంగా మూడు కుటుంబాల మధ్య నడుస్తుంది. ఈ మూడు కుటుంబాలు తాటిచెట్టును నమ్ముకొని బతికినవే. ఈ మూడు కుటుంబాల్లో ఒకటి మా పెదనాన్న కుటుంబం. రెండవది మా కుటుంబం. మూడవది మా చిన్నాన్న కుటుంబం. అంటే ఈ నవలలో నేను కూడా ఒక పాత్రనే అని రచయిత చెప్పుకుంటూ ఈ నవలను ఇలా ప్రారంభిస్తాడు.

**'నేనేమి సేతూ.... నేనెట్ల బతుకుడు**
**బతుకుదెరువు కొరకు / బాధలెన్నొ పడిన**
**బాధ తీరలేదు / బతుకు మారలేదు...**
**నేనేమి సేతూ... నేనెట్ల బతుకుడు...**

**ఈతకల్లు పారుతుంది / ఇంకేం పర్వకుంటి**
**ఈదుల్లకు పాయిరీ / నేనేమి సేతూ... నేనెట్ల బతుకుడు**
**పోద్దాడు ఎల్లింది / పొట్ట నింపుద్దనుకుంటి**
**మూడొద్దులే పారింది / మురిపించి పారింది**
**మురిపించి పోయిందీ / నేనేమి సేతూ నేనెట్ల బతుకుడు..."**

సాయంత్రం నారాయణ గౌడ్ తాటిచెట్టు మీద గోల గీస్తున్నాడు. ఎవరిదో పిలుపు విని గొలను గీయడం ఆపి కిందికి చూసినాడు. కింద తన ఆటకందారు ఇట్నేని సివలింగం తనను పిలిచినట్టు గ్రహించి "ఆ వస్తున్నా...! అని ఆ గొలను గీసినాడు" అంటూ ఈ గౌడ జీవితాన్ని తెలుపుతూ ఈ నవల ప్రారంభమవుతుంది.

**కక్క – వేముల ఎల్లయ్య :**

మాదిగ జీవన వృత్తి జీవనం చెప్పులు కుట్టడం, తోలుతో చేసిన కపిలి బానలను కుట్టడం అవకాశం వున్నప్పుడు రైతు పొలంలో కూలికి వెళ్లడం చేసేవారు. వీరికి కూడ రైతుల నుండి మేర, వరి మోపు లబిస్తుంది. రైతులందరూ వీరి వద్దనే చెప్పులు కుట్టించు కునేవారు. కరెంటు మోటార్లు వచ్చాక వీరి వృత్తి మరుగున పడిపోయింది. చెప్పుల షాపులొచ్చాక వీరికి ఆ పని కూడ లేకుండా పోయింది. చెప్పులు తయారు చేయడంలో వీరు సిద్ధహస్తులైనా ఈ కులం వారు రైతులతో తమ మనుగడ లేకుండా పోయిన తర్వాత పెద్ద చెప్పుల షాపు పెట్టుకున్న దాఖలాలు అసలు లేవు. పెద్ద చెప్పుల షాపులను పెట్టుకోవడానికి అధిక మొత్తంలో ధనము కావాలి. అంత స్తోమత ఈ మాదిగ వారికి లేదు. అందుచేత చెప్పుల షాపులన్ని వేరే కులాల వారివే.

తెలంగాణ దళిత జీవితమే కక్క నవల ఇతివృత్తం. కులాభిమానం, వృత్తి గౌరవం నేపథ్యంలో మొలకెత్తినట్టి కాంక్ష మాదిగిర్కం నవలకు ప్రధాన వస్తువు. పాలేరు జీవితంతో తృప్తి చెందని ఓ దళితుడు కులవృత్తి వైపుగా మళ్లడంలోనే కథ మలుపు తిరుగుతుంది. సామాన్యంగా 'మాదిగిర్కం' (వెట్టి) పని కూడా ఆ వూళ్ళో ఉన్న మాదిగ కుటుంబాల సంఖ్యాబలం మీద కేటాయించబడుతుందే తప్ప కావాలనుకుంటే కాళ్ళకాడికి వచ్చిపడే వతన్ కాదు. అందని పండు లాంటిదే ఈ మాదిగిర్కం కాబట్టే కులవృత్తి మీద 'కక్క'డు తరగని కాంక్షని పెంచుకుంటాడు. ఇది తెలంగాణ ప్రాంతంలోని 'మాదిగిర్కం' తీరు తెన్నుల్ని తట్టిలేపే కోర్కె గానీ సృజన మాత్రం గాదు. మోజున్న కులవృత్తినే కేంద్రబిందువుగా చేసుకుని దానిచుట్టే నవల కథంతా అల్లబడుతుంది. కక్కడు తన జీవితంలో కోల్పోయిందేదో తనకు తెల్సు. అభద్రతాభావం చోటు చేసుకున్నప్పుడు తనని కాపాడే ఓ నీడ కావాలి. తన ఉనికిని కాపాడేది ఒక్క మాదిగిర్కమనే గట్టి నమ్మకం కక్కనిది. అంతేగాదు అతి ఉండడం వల్లే కులపోల్లు ఆయన్ని ఆదిరిస్తూ వచ్చారు. సర్పంచి పదవిలో కనబర్చనటువంటి శ్రద్ధ మాదిగిర్కంలో చూపించడం కూడా దీనికి ఊతమిస్తోంది. ఇలా ఈ వస్తువుతో రచయిత ఈ నవలను కొనసాగించి వారి అస్తిత్వాన్ని తెలిపారు.

దళితుడైన కక్కయ్య ఈ నవలకు నాయకుడు. కక్కని అయ్యమ్మ (నానమ్మ) మరణంతో కథ మొదలవుతుంది. కక్కని బాల్యం, వివాహం, సంతానప్రాప్తితో పాటు కులవృత్తి మీద వానికున్న ఆసక్తే ప్రధాన కథగా సాగిపోతుంది. గ్రామంలో అనివార్యంగా సాగే సహజీవనం అతి సహజంగా కథనం చేయబడుతుంది. కుల సంఘర్షణలు, వర్గ సమీకరణలు చూపించడంలో చూపిన మెలకువ కథకి నిండుదనాన్ని ఇస్తుంది. వ్యక్తి జీవితాన్ని చిత్రించే క్రమంలోనే కాబోలు కథని సూటిగా నడిపాడు. అధ్యాయాలుగా సాగకున్నప్పటికీ కథా పరిణామాన్ని బట్టి కాలాన్ని నిర్ణయించుకునే వీలుంది.

మాదిగిర్కం చేపట్టాలంటే చెప్పులు కుట్టడం, డప్పుకొట్టడం, కల్లం ఊడ్చడం లాంటివి నేర్చుకుని ఉండాలి. ఒంటి కుటుంబం కక్కనికి 'మాదిగిర్కం' ఎండమావి లాంటిదేనని తెల్సు. అయినా దానికోసం అన్ని పనులు పట్టుదలతో నేర్చుకోవడంలోనే కథావస్తువు దీప్తి నొందింది. తన కుటుంబం మాదిగిర్కం చేసే కుటుంబాని కంటే సాంస్కృతికంగా భిన్నంగా ఉందని గ్రహించడంలో కథా వస్తువు అమరి ఉంది. ఆ సామికి ఏ వస్తువులు చేసి అందించాలో వాటి గురించి తెల్సుకోవడం కులవృత్తికి కావాల్సిన వస్తు సామాగ్రిని సేకరించాలనుకోవడంలోనే కక్కనికి ఉన్న శ్రద్ధ ఆగిపోలేదు. 'మైసాసురని వ్యధ' భాగవతం నేర్చుకునేంత దాకా మోజు సాగింది. ప్రాసంగిక కథే అయినా ప్రధాన కథకు ప్రాణంలాంటిదై నవలకు వన్నె తెస్తుంది. ఓ సందర్భంలో ఫకీరు తాత మాదిగిర్కం అంటే బానిసత్వానికంటే భిన్నమైందేమీ కాదని చెప్పినా కక్కడు అదరలేదు, బెదరలేదు. వెట్టి చేసే వాళ్లింట్లో తోళ్ళతొట్టి, గోడలకు డప్పులు, ఆరేసిన తోళ్ళు, చెప్పులు కుట్టే పనిముట్లు వగైరాలు చూసి చలించలేదు. మాదిగిర్కం చేస్తే వచ్చే ఆదాయం కూడా తక్కువని తెల్సికూడా దానిమీది ఆశను చంపుకోలేదు.

**'సంకెళ్ళు తెగాయి' – మంగలి వృత్తి జీవిత చిత్రణ**

మనిషి పుట్టుక మొదలు మరణానంతరం వరకు జరిగే కార్యక్ర మాల దాకా మంగలిరికం ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. మంగలి వారినే నాయి బ్రాహ్మణులు అని కూడా పిలుస్తారు. మంగలి వృత్తి కూడా ఆనాటి సమాజంలో చాల ప్రధానమైన వృత్తి. ప్రతి సారి ప్రతిఫలం ఆశించకుండా అందరికి క్షవరంచేసి, జుట్టు కత్తరించే వీరు ఆ పనికి గాను ప్రతి ఫలితానికి, మేర ద్వారా ఐదు బళ్లల వడ్లు, ఒక మోపు వరి తీసుకునేవారు. ఫలితమంటే ఒక పంట కాలము. మంగలులు కేవలం మంగలిరికం కాక శుభాశుభ కార్యక్రమాల లోనూ, దేవాలయాలలోనూ భజంత్రీలుగా సేవలు చేయడం లాంటివి కూడ కులవృత్తుల్లో భాగంగా చేస్తున్నారు.

ఈ నవలలో కథపరంగా కథనాయకుడికి ప్రాధాన్యం ఉంది. మంగలికులంలో పుట్టిన నారాయణ బాగా చదువుకొని ఉన్నత స్థితికి చేరుకోవాలనుకుంటాడు. పట్నంలోని కాలేజీలో చేరతాడు. అనల అతని జూనియర్. అనల తండ్రి లాయర్. తల్లి సామాజిక కార్యకర్త. వీరు కులాలకాతీతంగా ప్రేమించి పెళ్ళి చేసుకుంటారు. అనల తల్లిదండ్రులు ఆమెని స్వతంత్ర వ్యక్తిత్వంతో వ్యవహరించేలా పెంచుతారు. అనల నారాయణ అభివృద్ధికి సహకరిస్తుంది. నారాయణ ఐ.ఎ.ఎస్ సాధిస్తాడు. అనల ఉన్నత స్థితిని సాధించడం కోసం పెద్దగా కష్టపడే అవసరం లేదు. కానీ ఏ వసతులు లేకపోయినా ఒక ఆశయంతో కష్టించే నారాయణకి ఆలంబనగా నిలిచి తన ప్రత్యేకత నిలబెట్టుకుంది.

మంగలి వారు తాము వాడే వస్తువులు 1. కత్తెరలు 2. మంగలి కత్తులు మూడు 3. కాలి గోర్లు తీసే సాధనము 4. చిన్న కత్తెర, 5. సాన రాయి 6. చిప్ప లాంటి గిన్నె 7. బ్రష్ 8. అద్దము, 9. చెవిలో గుమిలి తీయడానికి ఒక సాధనము. వీటిని పెట్టుకోవడానికి నాలుగు పొరలున్న నలుచదరంగా ఉన్న ఒక తోలు సంచి వుంటుంది. దీన్ని అడపము అంటారు, వారి భోజనం ఆరోజుకి వారు పనిచేసిన ఆ వూర్లోనే గడిచి పోతుంది. మంగలివారు ఎదురు పడితే శుభ సూచకంగా భావిస్తారు. పెళ్ళిల్లలో జరిగే అనేక కార్యక్రమాల వివరాలు మంగలికే బాగా తెలుస్తాయి. ఆ సందర్భాలలో వారిదే పైచేయి. పెళ్ళి చేసే పంతులుగారు కూడా కొన్ని సందర్భాలలో తర్వాత చేయవలసిన కార్యక్రమం ఏమిటని మంగలి వారిని అడిగే సందర్భాలు కూడా వుంటాయి. పెళ్ళి కొడుక్కి మంగళ స్నానం చేయించేందుకు మంగలి రావలసిందే. పెళ్ళి కూతురుకైతే మంగలి స్త్రీ రావలసిందే. ఆ సందర్భంగా మంగలి వారికి పరిహారము వేరుగా వుంటుంది. ఈ పరిహారము వారు చేసిన పనిని బట్టిగాక రైతు హోదాను బట్టి వుండేది. అశుభ కార్యక్రమాలకు కూడా మంగలి తప్పనిసరిగా వుండాలి.

**'సంకెళ్ళు తెగాయి'** నవల మొత్తం పదిహేను భాగాలుగా ఉండి ధారాళమైన శైలిలో అందరిని చదివించే గుణం కలిగి ఉంది. మారుమూల గ్రామాలలో మంగలి వృత్తి చేసుకుంటూ జీవితాన్ని గడుపుతున్న కుటుంబ పరిస్థితులను మనముందుంచుతుంది. ఈ నవల పల్లెలోని వివిధ కులవృత్తుల ఆవిష్కరణను, వారిని ఇతరులు దోపిడి చేసే విధానాన్ని తెలుపుతూ విద్య అనేది వారిలో మార్పుకు సంకేతంగా మారుతుందన్న అభిప్రాయాన్ని సుజాతారెడ్డి మనముం దుంచారు. ఇలా ఇంకా తెలంగాణ వృత్తిజీవితాలను గురించి ఆయా నవలలో సందర్భానుసారంగా ప్రస్తావించడం జరిగింది.

**ముగింపు**

తెలంగాణ ప్రాంతం వేలసంవత్సరాల కాలం నుండి వెట్టిచాకిరి విధానం, కులవృత్తి జీవనాన్ని కేంద్రంగా చేసుకొని కొనసాగింది. తెలంగాణ నవలలో కులవృత్తులను ప్రస్తావిస్తూ వారి జీవన విధానాన్ని తెలంగాణ ప్రాంతాన్ని చక్కగా ప్రతిబింబించడం జరిగింది. ఆయా వృత్తుల అస్తిత్వాన్ని తెలుపుతూ వృత్తి గౌరవాన్ని, వారి స్థితిగతులను చక్కగా తెల్పడం జరిగింది. ఈ వృత్తి నవలల ద్వారా కులవృత్తుల ఆవశ్యకతను చక్కగా తెల్పడం జరిగింది. దాంతో పాటు ప్రపంచీకరణ నేపథ్యంగా కులవృత్తుల క్షీణత్వాన్ని కూడా వివరించడం జరిగింది.

**ఆధార గ్రంథాలు :**

1. కాలువ మల్లయ్య, బతుకుపుస్తకం, హైదరాబాద్.
2. కాలువ మల్లయ్య, చెన్నలగువ్వ, హైదరాబాద్.
3. కాలువ మల్లయ్య, సాంబయ్య చదువు, హైదరాబాద్.
4. బి.యస్. రాములు, బతుకుపోరు, విశాలసాహితి, హైదరాబాద్.
5. ముదిగంటి సుజాతారెడ్డి, సంకెళ్ళు తెగాయి, హైదరాబాద్.
6. లంకా వెంకటేశ్వర్లు, ఆధునిక తెలుగు సాహిత్యంలో వృత్తి చైతన్యం, హైదరాబాద్.
7. వేముల ఎల్లయ్య, కక్క, విశాలాంధ్ర ప్రచురణలు, హైదరాబాద్.

**'కదంబం'**

**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**

**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**

**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే ఉత్తమ గ్రంథం **'కదంబం'**.

**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-**

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 12  హైదరాబాద్ అక్టోబర్ : 2022

# ఆచార్య మసన చెన్నప్ప సాహిత్య సేవ

**ఆచార్య సూర్యాధనంజయ్** - తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 9849104187



చెన్నప్పగారి మరో పద్యకవితా సంపుటి 'తెలంగాణోదయం' తెలంగాణ రాష్ట్రం ఏర్పడడానికి ముందు అనగా 2013లో రచింపబడింది. దీనిలో 13 శీర్షికలున్నాయి. 1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడడానికి ముందు 'దాశరథి మహాంధ్రోదయం' అనే కావ్యాన్ని రచించినట్లే చెన్నప్పగారు వారిని ఆదర్శంగా తీసుకొని తెలంగాణ రాష్ట్రావతారణకు ఒక సంవత్సరం ముందుగానే ఈ తెలంగాణోదయం అనే ఒక పద్యకవితా సంపుటిని రాశారు.

చెన్నప్పగారు 2009 నుంచి 2014 వరకు జరిగిన ఉద్యమంలో పాల్గొని అనేక సభల్లో తన ప్రసంగం ద్వారా తెలంగాణ అస్తిత్వాన్ని తెలియజేశారు. వీరు గుండెలనిండ ఉద్యమ స్ఫూర్తిని నింపుకున్నవారే. అందుకే ప్రధాన శీర్షిక తెంగాణోదయంలో **'ఆత్మగౌరవ పోరాటమయ్య మాది'** అని ఎలుగెత్తిచాటారు. **'ముందు మాదొక రాష్ట్రంబు; మోసగించి / యాంధ్రరాష్ట్రంబుతో కల్పియాటలాడి / రింతకాలము నాయకు; లింకనేడు / మేల్కొనె తెలంగాణము తన మేలుగోరి'** (పుట. 2, 6వ పద్యం) అని ఉద్యమకారులకు, విద్యార్థులకు ఉత్తేజాన్ని కల్గించారు. ఆంధ్రుల ఏలుబడిలో తెలంగాణ ఒక విధంగా లూటి అయిందని చెబుతూ ఆవేశంలో చెప్పిన పద్యం **'నీళ్ళుపోయె; రాష్ట్ర నిధులన్ని పోయెను / భూమి పోయె; నోటి బుక్క పోయె / విద్యలెల్ల పోయె; నుద్యోగములు పోయె / నింకను తెలంగాణ కెవరు దిక్కు?** (పుట. 4, పద్యం 15).

కవి ఈ ఖండికలో ఆంధ్రులను సూటిగా చాదరుఘాటు కట్టితిరా? చార్మినారుకు సున్నమేస్తిరా? అని ప్రశ్నిస్తారు. హైదరాబాదులో అన్ని కాలనీలను ఆక్రమించుకున్న ఆంధ్రులనుద్దేశించి చెప్పిన పద్యాలెన్నో ఉన్నాయి. 'తిరుమల గిరిలోన తిష్టవేయుటేగాదు, ఉప్పలు రోడ్డుపై ఉరికి చూడు' అంటారు. ఎంతోమంది విద్యార్థులు ఉద్యమంలో పాల్గొని ప్రాణాలు విడుస్తున్న సందర్భాన్ని దృష్టిలో పెట్టుకొని వారు వేసిన ప్రశ్నకు సమాధానం లేదనే చెప్పాలి. **'ఉద్యమాన పిల్ల లుద్వేగమును బొంది / ప్రాణంబును లెస్సబాయుచుండ / ఆంధ్రుడొక్కడేని అశ్రువుల్ రాల్చడు / తెలుగు వాళ్ళమన్న తెలివి లేదె'** (పుట. 9, పద్యం 34).

కవి క్రాంతదర్శి అని అలంకార గ్రంథాలు పేర్కొంటాయి. కాని చెన్నప్పగారు మాత్రం ఆశాజీవి. ఆయన జీవితంలో ఎన్నో ఒడుదుడుకులను అధిగమించి వచ్చినవాడు. అలాగే ఎన్ని కష్టాలెదురైనా తెలంగాణ తప్పకుండా ఒక రాష్ట్రంగా భాసిస్తుందని రాష్ట్రావతరణకు ముందే తెలియజేసినారు. **'మా తెలంగాణ రాష్ట్రమ్ము మాకు దక్కి / యభ్యుదయమును సాధించునట్టుల జేయు / సిద్ధ సంకల్పుడా చంద్రశేఖరుండు / నవ్యపథమున నడిపించు నాయకుండు'** (పుట. 10, పద్యం 39) అని అంటారు.

ఈ కోవలోనే దేశభక్తి. ఒక్క బుక్క, గుండేరావు హర్కారే, దేవులపల్లి రామానుజరావు, కొండాలక్ష్మణ్ బాపూజి మొదలైన శీర్షికలు తెలంగాణ జీవితాన్ని ఒక చిత్రంగా గీసి చెబుతున్న ఖండికలు. దేశభక్తి ఖండిక మనలో రాష్ట్రీయ భావనను రేకెత్తిస్తున్నది. గుండేరావు హర్కారే నిజాం కాలం పండితుడు. పాతపట్నంలో ఉన్నప్పుడే చెన్నప్పగారు వారికి శిష్యులయ్యారు. వీరి వలననే సంస్కృతం నేర్చుకున్నారు. సనాతన ధర్మం తెలిసిన వేద వేదాంగాలను అధ్యయనం చేసిన హర్కారే బోధనలవల్లనే చెన్నప్ప ఆధ్యాత్మిక రంగం వైపు మళ్ళినారని చెప్పవచ్చు. హర్కారేవల్ల మన తెలంగాణ కీర్తి ప్రతిష్టలు పెరిగాయంటారు చెన్నప్పగారు.

**"ఎక్కడి ముష్టి ఘాతములు? ఎక్కడి శాస్త్ర మహోగ్ర చర్చ లిం / కెక్కడి పాలనా పటిమ? యెక్కడి పాడితి? రాజనీతియున్? / ఎక్కడి యోగశక్తి? మరి యెక్కడి శిష్యుల బ్రోచు రక్తి! నీ / వెక్కడిలోకమో విడిచి నా తెలంగాణలోన బుట్టవే!"** అంటారు.

తెలంగాణ వైతాళికుల్లో ఒకరుగా దేవులపల్లి రామానుజరావు గారు కీర్తింపబడినారు. **'సరస కవికోకిలలకు రసాలమతడు / పేద రచయితలకు కల్ప వృక్షమతడు / వేదములు సేయువారికి వేదికతడు / ఆంధ్ర సారస్వతమ్మున నధికుడతడు' (పుట. 66, పద్యం 1).** 'నీవెక్కడ? మేమెక్కడ? / నీవలె తెలంగాణమునకు నిక్కపు సేవల్

**గావించిన వారేరీ? / దేవులపల్లీ ! నిజముగ ధీమంతుడవే".** అని దేవులపల్లిని కొనియాడారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలంగాణలో ప్రఖ్యాతి చెందిన విద్యాకేంద్రం. ఈ విశ్వవిద్యాలయంలో తెలుగుశాఖలో పని చేసిన ఆచార్యులు సాహిత్య రంగంలో వెలిగే మణిదీపాలు. వారిని గురించి ఆచార్య దేవోభవ అన్న పద్య ఖండిక వివరిస్తుంది.

చెన్నప్ప పద్య రచనల్లో **'ప్రమీలా త్రిశతి'** ఒక స్మృతికావ్యం. విశ్వనాథ సత్యనారాయణ గారి 'వరలక్ష్మి త్రిశతి', దువ్వూరి రామిరెడ్డి గారి 'భగ్న హృదయం', బాలాంత్రపు వెంకటరావుగారి 'విరహ సంగీతం' మొదలైన స్మృతి కావ్యాల సరసన చేరగలిగింది ఈ స్మృతి కావ్యం. ఇందులో 308 పద్యాలుంటే 60కి పైగా సీస పద్యాలే ఉన్నాయి. ఈ కావ్యంలో వారి 40 సంవత్సరాల దాంపత్య జీవితం చిత్రితమైంది. వారి దాంపత్య జీవితానికి ఈ కృతి ఒక దర్పణంగా నిలబడుతుంది. అంతేకాదు. భార్యభర్తల అనుబంధానికి ప్రతీక ఈ స్మృతి కావ్యం.

కృతి ప్రారంభంలోనే వీరు దాంపత్యానికి ఒక అర్థం చెప్తారు. **'అర్ధాంగివను మాట అర్ధసత్యమె గాని / పూర్ణాంగి వనుటయే పొసగు నీకు'** అని ఆమె ఔన్నత్యాన్ని వర్ణించారు. ఆమె ఉండగా నక్షత్ర మాలిక అన్నట్లు 27 గ్రంథాలు మాత్రమే రచించారు. కాని ఇప్పుడు ఆమె కనుమరుగై ఆకాశంలో 28వ తారగా నిలిచిందట. తన చిన్న మనవరాలి ముఖంలో తనను దర్శిస్తూ ఉండమని చెప్పి పోయిందట. చెన్నప్పగారి మనసులోని వేదనను ఇలా తెలియజేశారు.

**'అంత నీయది నాది లేదనుచు పలుకు / పలుకు లెల్లలు నిజమయ్యె పడతి నేడు'** (పుట.5). ఎప్పుడూ భర్తను అది కావాలి ఇది కావాలి, నగలు కావాలని అడగలేదు. తన గురించి ఎన్నడూ ఆలోచించలేదు. భర్త, ఇల్లు, పిల్లలు, కుటుంబానికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చి గౌరవించిన ఉత్తమ ఇల్లాలు ఆమె.

**'పాప తల్లిపై ఆధార పడినయట్లు / పంటవానపై ఆధారపడిన విధము / పలుకు గురువుపై ఆధారపడిన రీతి / పడతి! నీపైన ఆధారపడిన వాణ్ణి'** (పుట.8, పద్యం 30) తనను ఉన్నత శిఖరాల కెక్కించిన ప్రమీలగారి అస్తమయం ఆయనను క్రుంగదీసింది. రెక్కలు విరిగిన పక్షిలా విలపించారు చెన్నప్పగారు. ఈ కావ్యంలోని ప్రధాన రసం శోకమే. అయినా వైరాగ్య భావనతో పాటు తాత్త్వికత అంతటా పరచుకొని ఉంది ఈ కావ్యంలో.

## 2. అనువాద గ్రంథాలు :

పండిత గోపదేవ శాస్త్రిగారి దగ్గర ఉపనిషత్తులను, దర్శనాలను అధ్యయనం చేసిన చెన్నప్ప ఆర్షకవిగా పిలువబడ్డారు. దశోపనిషత్తుల్లో మొదటిది ఈశావాస్యోపనిషత్తు. చివరిది బృహదారణ్యకోపనిషత్తు. ఈ రెండింటితో పాటు ఛాందోగ్యోపనిషత్తును కూడా చెన్నప్పగారు ముత్యాల సరాలలో అనువదించారు. అమృతస్వరాలు, అగ్నిస్వరాలు, ప్రకృతి పురుష వివేకం ఈ మూడు ఉపనిషత్తులు సుమారు 4000ల ముత్యాలసరాలలో రచించడం వీటిపై మాట్లాడడమే కాక హైదరాబాదులో నాలుగు ఉపనిషత్తు సప్తాహాలు నిర్వహించారు. మోక్షం, తెలుగు తేజం, భక్తి మొదలైన పత్రికల్లో ఉపనిషత్తుల మీద పుంఖానుపుంఖాలుగా వ్యాసాలు కూడా ప్రచురించారు.

ఈశావాస్యోపనిషత్తును 2001లో రచించారు. దీనిని ఎంత సరళంగా అనువదించారో అనడానికి ఒక ఉదాహరణ. **"ఈ చరాచర సృష్టియంతయు / నీశ్వరునిచే నిండి యున్నది / త్యాగ మతివై యనుభవించుము / పరుల ధనమును తాకబోకుము"** (పుట.1, పద్యం 1) అని మూలంలో ఉన్న భావం చెడకుండా అనువదించారు. 16 మంత్రములు గల ఈశావాస్యోపనిషత్తును 60 ముత్యాల సరాలలో అందంగా మూలానికి ఎక్కడ భంగం కలగకుండా అనువదించడం చాలా కష్టం. కాని చెన్నప్పగారు ఒక భాషలోని భావం చెడకుండా మరొక భాషలోకి తెచ్చి కృతకృత్యులయ్యారు.

అదేవిధంగా బృహదారణ్యకోపనిషత్తును 'బృహద్గీత' అనే పేరుతో రాశారు. ఈ బృహద్గీత నిండా 1200 గేయాలు ముత్యాల సరాలలో అనువదించారు. ప్రతి గేయం నాలుగు పాదాలలో 3,4 మిశ్రగతి మాత్రాగణాలతో నడుస్తుంది. బృహద్గీత అనువాదం సరళంగా, మూల విధేయంగా ప్రతిభావంతంగా సాగింది.

**"పరులకీయక యెవడు దినునో / వానికెన్నడు తృప్తి తీరదు
తానుదింటూ పరులకొసగీ / బ్రతుకనేర్చిన వాడె ధన్యుడు"**
(పుట.11).

అని లౌకిక సందేశాన్నిచ్చారు చెన్నప్పగారు. బృహద్గీతను ఆరు అధ్యాయాలుగా విభజించారు. ఇందులో పరమ రమణీయమైన కథలున్నాయి. ఉదాహరణకు 'ప్రాణేంద్రియ సంవాదం'ను చదువుతూ ఉంటే ఎవరైనా కంటతడి పెట్టక మానరు. ఏది జ్యేష్ఠం, ఏది శ్రేష్ఠమని ప్రాణంతో పాటు ఇంద్రియాలన్నీ పోటీపడ్డాయి. వాణికన్నా, కనులకన్నా, చెవుల కన్నా, మనసుకన్నా, ప్రాణమే శ్రేష్ఠమని తేలిపోయింది. మన శరీరంలో ఏది పోయినా పనులు జరుగుతూనే ఉంటాయి. కాని ప్రాణం పోతే ఇంద్రియాలన్నీ తల్లడిల్లుతాయి అనే సత్యం ఇందులో గోచరిస్తుంది.

ఇట్లే మూడు 'ద'ల కథను చదివినప్పుడు మనమంతా మానవులమేనన్న భావనకు లోనవుతాము. ప్రజాపతి, దేవ మానవరాక్షసాళికి ఉపదేశం చేస్తాడు. ముగ్గురికీ 'ద' అనే అక్షరాన్నే ఉపదేశిస్తాడు. దేవతలు దమనమనే అర్థాన్ని, మానవులు దానమనే అర్థాన్ని, రాక్షసులు దయ అనే అర్థాన్ని గ్రహిస్తారు. ఆ విధంగా జీవించడంవల్ల వారు ఉత్తములవుతారు.

ఆ తర్వాతి గ్రంథం ఛాందోగ్యోపనిషత్తు 'ఉద్గీథం' అనే పేరుతో అనువదించబడింది. ఇది 2000ల ముత్యాల సరాలలో ఉంది. ఇందులో ప్రణవం అంటే ఓంకారం, 'ఉద్గీథం' అని చెప్పబడింది. 'ఉట్' అంటే ప్రాణం, 'గీః' అంటే వాక్కు 'థమ్' అంటే అన్నం అని అర్థం. ఈ గ్రంథంలో సత్యకాముని కథ. రైక్వుని కథ ఎవరికైనా వేదాన్ని బోధించవచ్చునని బ్రహ్మోపదేశం చేయవచ్చునని నిరూపిస్తాయి. వీటిని అనువదించిన తీరు ప్రశంసనీయం. వీరు రచించిన గ్రంథాలలో ఉద్గీథమే పెద్దది. ఇది 240 పుటల్లో ఉంది. ఇది సరళమైన శైలిలో ఉండి పాఠకులను అలరిస్తున్నది.




**బ్రహ్మవిదులగు సామవేదులు / భక్తిరసమున దేలి, యుచ్చె**
**స్స్వరముతో గానమ్ము చెసెడి / ప్రణవమే ఉద్గీథమనబడు**(పుట.1) అని చెప్తారు చెన్నప్ప. బ్రహ్మోపాసన ఎట్లుండాలి అనేదాని గురించి చెప్తూ...




**సర్వమున వెలుగొందు బ్రహ్మమే / సర్వసృష్టి స్థితి లయములకు**
**మూలమని సాధకుడు బ్రహ్మో / పాసనము గావింపవలయు** (పుట.81) అని వివరిస్తారు. ఇందలి సత్యకాముని కథ, రైక్వుని కథ విజ్ఞులైన వారెల్లరు చదవదగింది. గోత్ర నామము తెలియని సత్యకామునికి ఉ పనయనము, బండికొట్టి బ్రతికే రైక్వుని వలన 'జానసృతి'కి బ్రహోపదేశం లభించడం సామాజిక పరిణామాన్ని సూచిస్తున్నది.

కపిల మహర్షి చేత రచింపబడిందే 'సాంఖ్యదర్శనం' ఇందులో ప్రకృతికి పురుషునికి గల భేద సామ్యాలు చెప్పబడ్డాయి. కనుకనే చెన్నప్ప గారు దీనికి **'ప్రకృతి పురుష వివేకం'** అనే పేరు పెట్టారు. ప్రకృతి జడమని, పరమాత్మ చైతన్యమని ఈ తేడా తెలుసుకున్నప్పుడే జీవునికి మోక్షం వస్తుందని ఈ గ్రంథం నిరూపిస్తుంది.




ఇక చెన్నప్పగారి అనువాద రచనల్లో ఉపనిషత్తుల తర్వాత పేర్కొనదగిన కావ్యం **'సడిలేని అడుగులు'.** ఇది రవీంద్రుని గీతాంజలికి అనువాదం. ఉపనిషత్తులను అధ్యయనం చేసిన చెన్నప్పగారు వీటి ప్రభావం చేత రచింపబడిన గీతాంజలిని అనువదించడం విశేషం. తన అనువాదాన్ని గురించి చెబుతూ ఒక గొప్ప రచన చేయలేని వారు ఒక గొప్పరచనను అనువదించినా గొప్పే అంటారు. అది గొప్ప రచనే గాదు. మహోత్కృష్టమైన ఆధ్యాత్మిక అనుభవం.

భగవంతుడు సర్వవ్యాపకుడని, సర్వశక్తివంతుడని, సర్వజ్ఞుడని వేదాలు వర్ణిస్తాయి. అంతేకాదు అతడు సర్వరక్షకుడనే విషయాన్ని రవీంద్రుడు ప్రతి ఖండికలోను తెలియజేశాడు. ఉదాహరణకు **'నిశీథిలోను / నీపై నాకు విశ్వాసం / అందుకే నన్ను / నిద్రాదేవి కర్పించుకున్నాను'** అని అనడం, రవీంద్రునిది అద్భుతమైన అద్వైతానుభవం. ఉదాహరణకు చెన్నప్పగారి అనువాదం **"నీ ప్రేమతో / నా ప్రేమ / ఇద్దరి ఐక్యతలో / వ్యక్తమయ్యేది నువ్వేకదా"** అన్న పంక్తులు దానికి ఉదాహరణ. ఇదే విధంగా అద్వైతానికి ప్రాణం పోసిన పంక్తుల్ని చెన్నప్పగారు చక్కగా అనువదించారు. **'కవి / నీ సృష్టిసౌందర్యాన్ని / నా కళ్ళతో చూడడం / నీకానందమా'** అనే కవితాత్మకమైనవే కాక ఆధ్యాత్మికంగాను చెప్పుకోదగినవి.




చెన్నప్పగారు అనువాదం చేసిన మరో గ్రంథం గీతాంజలి. ఇందులోని 103 ఖండికలను చెన్నప్పగారు సరళంగా చేశారు. అయితే ఇప్పటి వరకు ఈ గీతాంజలిని 40 మందికి పైగా అనువదిం చారు. కృష్ణశాస్త్రిగారి గురువు ఆదిపూడి సోమనాథరావుగారు మొట్టమొదటగా అనువదించారు. రవీంద్రనాథ్ ఠాగూర్ గీతాంజలిని 1913లో రాశారు. ఇది రవీంద్రునికి 1913లో నోబెల్ బహుమానాన్ని అందించినది. రవీంద్రుడు దీనిని 20వ యేటనే రచించారు. ఇది ప్రపంచ భాషలన్నింటిలో అనువదింపబడినది. నోబెల్ బహుమానం వచ్చిన నూరేళ్ళ సందర్భంగా 2013లో చెన్నప్పగారు దీనిని అనువదించడం ఒక ప్రత్యేకత.




గీతాంజలిలో రెండంశాలు పేర్కొనదగినవి. ఒకటి జీవుని వేదన. రెండవది భగవంతుని ప్రేమ. ఇందులో పరమేశ్వరుడిని ఏ విధంగా భావించుకుంటే ఆ విధంగా మన అనుభవంలోకి వస్తాడు. తండ్రిగా కావచ్చు, తల్లిగా కావచ్చు, చక్రవర్తిగా కావచ్చు, స్నేహితునిగా కావచ్చు, ప్రియునిగా కావచ్చు, ప్రియురాలిగా కావచ్చు.

కాని భగవంతునికి ఇన్ని రూపాలున్నాయా! దీనికి సమాధానం రవీంద్రుడే ఇస్తాడు. **'ఈ నామ రూప జగత్తుకు కర్త భగవంతుడేననీ'.**

భగవంతుడు సర్వకాల సర్వ వ్యవస్థల యందు మనల్ని వెన్నంటి నడుస్తాడు. కాని అతని అడుగుల సవ్వడి వినలేం. అందుకే చెన్నప్పగారు తన అనువాదానికి 'సడిలేని అడుగులు' అని పేరు పెట్టారు. ఈ కృతికి కొలకలూరి ఇనాక్ గారు పీఠిక రాస్తూ **'ఇంత సుకుమారాభివ్యక్తిని తెలుగులో అందించిన సాహితీ సుందరమూర్తిగా అనువాదకుడిని ఆత్మీయాలింగనం చేసుకుంటున్నాను'** అనడం విశేషం. భగవంతునికి నమస్కార పూర్వకంగా సమర్పణ భావంతో, అంకిత భావంతో రచించిన గేయ సమాహారమే **'గీతాంజలి'.**

## 3. విమర్శ – పరిశోధన – వ్యాస రచనలు

చెన్నప్పగారి వేటూరి ప్రభాకర శాస్త్రి వాఙ్మయ సూచిక ఎం.ఫిల్ పరిశోధన వ్యాసం. ఇది 1985లో ప్రచురితమైంది. దీనిని 2012లో తిరుమల తిరుపతి దేవస్థానం వారు తిరిగి ప్రచురించారు. మన విశ్వవిద్యాలయంలో వాఙ్మయ సూచికలకు సంబంధించినంత వరకు ఇదే తొలి పరిశోధన. ఒక అంశం లేదా ఒక కాలం లేదా ఒక రచయిత లేదా ఒక ఉద్యమం వీటికి సంబంధించిన గ్రంథాలను గ్రహించి రచింపబడినవే వాఙ్మయ సూచికలు. వీటి నిర్మాణ పద్ధతి ఆంగ్లం నుంచి వచ్చిందే.

ఒక పరిశోధకుడు సర్వసమగ్రంగా ఒక సిద్ధాంత గ్రంథాన్ని రచించే సందర్భంలో వాఙ్మయ సూచికలు ఎంతగానో తోడ్పడుతాయి. పరిశోధక బ్రహ్మగా పేరుగాంచిన వేటూరి ప్రభాకర శాస్త్రికి సంబంధించిన ముద్రిత, అముద్రిత రచనలను సమగ్రంగా ప్రదర్శిస్తున్న సిద్ధాంత వ్యాసమే 'వేటూరి ప్రభాకర శాస్త్రి వాఙ్మయ సూచిక'. వేటూరి వారు పరిశోధకుడిగా మాత్రమే అందరికి తెలుసు. కానీ వారు 'మూణ్ణాల ముచ్చట', 'దివ్య దర్శనం', 'కడుపు తీపు', 'చిన్ననాటి చేష్టలు' మొదలైన ఖండకృతులు రాసినట్లు, 'భాసుని నాటక చక్రాన్ని' అనువదించినట్లు, అమూల్యమైన 'తెలుగు మెరుగులు', 'మీగడ తరకలు', 'సింహావలోకనం' మొదలైన వ్యాససంపుటులు రాసినట్లు, 'క్రీడాభిరామం', 'బసవపురాణం' మొదలైన కావ్యాలకు అద్భుతమైన పీఠికలు సంతరించినట్లు ఈ వాఙ్మయ సూచికవల్ల తెలుస్తుంది.

వేటూరి వారికి పేరు తెచ్చిన సంకలన గ్రంథం 'చాటు పద్య మణిమంజరి'. బాలభాషను మొదట సేకరించి ప్రచురించిన వారు వేటూరివారే. ఈ వాఙ్మయ సూచికలో వేటూరివారు ఎక్కడెక్కడ ప్రసంగాలు చేశారో వాటి వివరాలు తేదీలతో సహా ఇవ్వబడ్డాయి. ఈ సూచిక నిర్మాణానికి వేటూరివారి కుమారులైన ఆనందమూర్తిగారు పర్యవేక్షకులుగా ఉన్నారు.

**'ప్రాచీన కావ్యాలు – గ్రామీణ జీవన చిత్రణ'** చెన్నప్పగారి పిహెచ్.డి., సిద్ధాంత గ్రంథం. వీరు ప్రాచీన సాహిత్యంలోని ప్రముఖమైన 45 కావ్యాలను సమగ్రంగా అధ్యయనం చేసి వాటిలో ఎక్కడెక్కడ గ్రామజీవనం ప్రస్తావించబడిందో ఈ సిద్ధాంత గ్రంథంలో తెలియజేశారు. ఈ పరిశోధన ఫలితంగా గ్రామజీవన చిత్రణలో ముగ్గురు ప్రముఖస్థానాన్ని వహించినట్లు చూడగలం. ప్రాచీన కాలంలో ఎర్రన, మధ్యకాలంలో రాయలు, అనంతర కాలంలో కదిరీపతి ఈ ముగ్గురు గ్రామ జీవితాన్ని అందరికంటే మిన్నగా రచించినట్లు చెన్నప్పగారు నిరూపించారు. గ్రామానికి వీరికి ఉన్న అనుబంధమే ఒక విధంగా ఈ సిద్ధాంత గ్రంథ రచనకు తోడ్పడింది. ఈ సిద్ధాంత గ్రంథం ఆరు ప్రకరణాలుగా విభజింపబడింది. మొదటి ప్రకరణలో గ్రామ స్వరూపం, రెండవ ప్రకరణంలో గ్రామీణుల సాంస్కృతిక, సాధారణ జీవితాలు, మూడవ ప్రకరణంలో గ్రామీణుల వృత్తులు, నాల్గవ ప్రకరణంలో గ్రామీణుల రూపురేఖలు, వస్త్రధారణ, ఆభరణాలు, గృహ నిర్మాణాలు, ఐదవ ప్రకరణంలో గ్రామీణుల మనస్తత్వం, విశ్వాసాలు, శకునాలు, ఆరవ ప్రకరణంలో కావ్యస్థమైన ఋతువర్ణనల్లో కనిపించే గ్రామీణ జీవనం మొదలైన అంశాలు వివరింపబడ్డాయి.

ఈ పరిశోధన గ్రంథంలో ఎర్రన చేసిన రేపల్లె వర్ణన సహజ సుందరమైంది. పశువుల పేడ, పాల నురుగు, మసి ఈ మూడు యాదవులకు సహజాభరణాలుగా ఉంటాయని ఎర్రన వర్ణించినట్లు చెన్నప్ప తన పరిశోధనలో తెలియజేశారు. క్రీడాభిరామం ఆధారంగా ఆకాలంలో మడి సంతలు, మైల సంతలు ఉన్నట్లు పేర్కొన్నారు. సింహాసన ద్వాత్రింశికను బట్టి పల్లీయులకు చింతపులుసు కలిపిన అన్నమే పరమాన్నంగా చెప్పబడింది. ఇప్పటికి పచ్చిపులుసు లేకపోతే పస్తులుండే గ్రామీణులున్నారు. కొరవి గోపరాజు కాలంలోనూ ఇలాంటి పరిస్థితే ఉంది.

**గరిటి లేని యిల్లు దొరలేని తగవును**
**చింతపండులేని వింత చివియు**
**చనువులేని కొలువు శశిలేని రాత్రియు**
**ముక్కులేని మొగము నొక్కరూపు** (పుట. 147)

ఈ సిద్ధాంత గ్రంథానికి ఆచార్య వి. రామచంద్రచౌదరి (మద్రాసు విశ్వవిద్యాలయం) పీఠికను రాస్తూ... గ్రామీణ ప్రకృతి శోభను చూడని వారికి ఈ గ్రంథం ఆ జీవితాన్ని పరిచయం చేస్తుందని అంటూ ఓ పద్యం చెప్పారు. **'చెప్పెడిది గ్రామ చరితట / చెప్పించినరాంధ్ర కావ్య చిన్మూర్తులంటే / చెప్పెనటే చెన్నప్ప, నే / తప్పకొనిద మీరె చదివి ధన్యులరనడీ!'.** కేవలం ఆచార వ్యవహారాలే కాకుండా మనుషుల మధ్య ఉండే సంబంధ బాంధవ్యాలను వారి మనస్తత్వాన్ని, వారి సమస్యలను, లోతుగా పరిశీలించి వివేచనలో ప్రతిభావంతంగా రచించబడిన సిద్ధాంత గ్రంథమే ఇది.

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 12 (37) హైదరాబాద్ అక్టోబర్ : 2022




సాహిత్యంలో చెన్నప్పగారి మరో పార్శ్వం సాహితీ వ్యాసాలు. మూడు దశాబ్దాలకు పైగా వారు తెలుగులోని వివిధ అంశాలపై విలువైన వ్యాసాలెన్నో రాసి ప్రముఖ పత్రికలలో ప్రచురించారు. అనేక వేదికలపై చదివారు. అంతేకాదు ఈ వ్యాసాలు పరిశోధక విద్యార్థులెందరికో చీకట్లో లాంతరువలె ఉపకరించాయి అనడంలో అతిశయోక్తి లేదు. కవిత్వం రస ప్రధానం. కొన్నిసార్లు అర్థం కన్నా శబ్దం ఆకట్టుకుంటుంది. కానీ వ్యాసం పరిశోధన ప్రధానమైన విమర్శనాస్త్రం. కాబట్టి వ్యాసం రాయాలంటే పద సంపద ఒక్కటే సరిపోదు. ఎంతో పరిశోధన అవసరం. ఈ విషయంలో చెన్నప్పగారు సవ్యసాచి అనే చెప్పాలి. పరిశోధనలోను, పదసంపదలోను దిట్ట. అందుకే వందలకొద్దీ వ్యాసాలు వెలువరించారు. వాటిల్లో సారస్వత లోచనం, ముక్కు తిమ్మన ముద్దు పలుకులు, నానీలు దేశీయత, ఉపనిషత్తుల్లో స్త్రీ చైతన్యం, తెలుగులో చాటుకవిత్వం, జాషువా విశ్వవాణి, తెలుగు ఋతువులు, తెలుగు కవుల వర్షఋతు వర్ణనలు వంటి వ్యాసాలెన్నో ఉత్తమ సాహిత్య వ్యాసాల సరసన చేరాయి.




**సమాలోచనం** 1995లో ప్రచురితమైంది. ఇందులో 12 సాహిత్య వ్యాసాలున్నాయి. వీటికి ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం అభిప్రాయాన్ని తెలియజేస్తూ **'డా. చెన్నప్పగారి సమాలోచనం సహజ సాహిత్య సందర్శనం, సమకాలీన సాహితీ వ్యాస చైతన్య స్పందనం'** అని అభివర్ణించారు. ఆచార్య ఎన్. గోపిగారు **'మసన వ్యాసాల డజన్'** అని ఈ వ్యాస సంపుటిని గూర్చి. ఈ సంపుటిలో గ్రహింపబడిన వ్యాసాలు అంతకు పూర్వమే ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం నుండి ప్రసారమయినాయి. కొన్ని వ్యాసాలు తెలుగుశాఖ వివేచన పత్రికలో ప్రచురితమైనవి. ఆచార్య చెన్నప్పగారు తాత్త్విక దృష్టితో చేసిన విమర్శ ఈ వ్యాసాల్లో అడుగడుగున గోచరిస్తుంది.

**సారస్వత లోచనం** ఇందులోనూ 12 వ్యాసాలున్నాయి. 5 వ్యాసాలు ప్రాచీన సాహిత్యానికి, 7 వ్యాసాలు ఆధునిక సాహిత్యానికి సంబంధించినవి. ఇది 2001లో ప్రచురితమైనది. ఈ వ్యాసాలను విశ్లేషిస్తూ చెన్నప్ప సాహిత్యం మీద పరిశోధన చేసిన డా.జి. ధర్మోజిరావు చెన్నప్పగారు వైవిధ్యంతో కూడిన శీర్షికలను, విశ్లేషణతో కూడిన విషయ అనుశీలనం చేశారని తెలియజేసిన మాటలు యథార్థమనిపిస్తుంది. చెన్నప్పగారికి విశ్వనాథ, కృష్ణశాస్త్రి, జాషువా, దాశరథి మొదలైన ఆధునిక కవులంటే చాలా అభిమానం. వారి కవితాతత్త్వాన్ని ఇందులో సోదాహరణంగా నిరూపించారు. ప్రాచీన కవుల్లో పెద్దనను ఎక్కువగా ఇష్టపడతారు. పెద్దన సంస్కార దృష్టివారిని ఎంతో ఆకర్షించింది.




**చెన్నప్ప పీఠికలు** ఈ సంపుటిలో చెన్నప్ప తాను ఆయాగ్రంథాలకు రచించిన పీఠికలను గ్రహించారు. నిజానికి వారు ఇప్పటి వరకు రచించిన శతాధిక పీఠికల మీద ప్రత్యేకించి ఒక పరిశోధన గ్రంథమే రావలసి ఉంది. ఈ సంపుటిలో వర్ధమాన కవుల, రచయితల గ్రంథాల్లోని మంచి చెడ్డలు చాలా వరకు పరామర్శింపబడినవి. భక్తి, జ్ఞాన ప్రధానమైన పుస్తకాలకు పీఠికలు రాయడమంటే చెన్నప్ప గారికి చాలా ఇష్టమని ఈ గ్రంథం నిరూపిస్తుంది. 20వ శతాబ్ది చివరి దశకంలో చెన్నప్ప మీద ఉపనిషత్తులు ప్రభావాన్ని చూపాయి. ఆ ప్రభావంతో సాగించిన పీఠికా రచనలు పాఠకుల్లో కొత్త ఆలోచనలను రేకెత్తిస్తాయి. ఇందులోని పీఠికల్లో 'వేదోక్త గృహవాస్తు' అనే గ్రంథానికి రాసిన పీఠిక విజ్ఞానాత్మకమైంది.




**అక్షరకేతనం** సంపుటిలో 12 వ్యాసాలే ఉన్నాయి. వ్యాకరణమంటే అభిమానాన్ని ప్రదర్శించే చెన్నప్పగారు చిన్నయ సూరిని 'చిన్మయ సూరి' అని పేర్కొంటారు. ఇదేవిధంగా మనుచరిత్రలో ఉన్నది మన చరిత్ర అని ఎలుగెత్తి చాటుతారు. అందరు ప్రబంధాలలోని రసాన్ని గూర్చి వస్త్వైక్యతను గురించి మాట్లాడితే చెన్నప్ప వాటిలోని పరమార్థాన్ని మనకు తెలియజేస్తారు. ప్రవర వరూధిని ఘట్టం ధర్మార్థ కామమోక్షాలకు పెద్ద పీఠ వేసిందని చెబుతూ ధర్మానికి ప్రవరుడిని, అర్థానికి మాయాప్రవరుడిని, కామానికి వరూధినిని, మోక్షానికి సిద్ధుడిని ప్రతీకలుగా చెబుతారు. అదేవిధంగా త్రిగుణాలలో సత్త్వగుణానికి ప్రవరుడ్ని, రజోగుణానికి వరూధినిని, తమోగుణానికి మాయాప్రవరుడిని ప్రతినిధులుగా చెబుతారు. ఈ విధంగా చెప్పడం సాహిత్య విమర్శలోనే ఒక కొత్త చూపని భావించవచ్చు. వామన పురాణాన్ని విశ్లేషిస్తూ... పౌరాణికుల దృష్టిలో

భగవంతుడు రాక్షసుల్ని సృష్టించవచ్చుగాని, అసలు భూమి మీద ఎవరైనా మనుషులుగానే జన్మిస్తారని వైదిక సంప్రదాయాన్ని ప్రవేశపెడతారు. ఈ వ్యాస పరంపరలో 'ఉపనిషత్తుల్లో స్త్రీ చైతన్యం' అనే వ్యాసం కొత్తరకమైనది. విద్యావంతురాలైన ప్రతి స్త్రీ చదువదగింది.

**సమదర్శనం** ఇదొక ఆధ్యాత్మిక వ్యాస సంపుటి. 2007-2010 మధ్యకాలంలో ఈనాడు దినపత్రికలో అంతర్యామి శీర్షికన అచ్చైన 32 వ్యాసాలు ఇందులో చోటు చేసుకున్నాయి. ఈ సంపుటి 2012లో ప్రచురితమైంది. అప్పటికీ 20 సంవత్సరాలు పూర్తిచేసుకున్నా 'ఆస్ట్రేలియా తెలుగు సంఘం' వారికి ఇది అంకితం చేయబడింది. అంతర్యామి శీర్షికలో తెలంగాణ నుంచి ఆధ్యాత్మిక వ్యాసాలు రాసిన సాహితీవేత్తలలో ఆచార్య చెన్నప్ప గారు అగ్రగణ్యులు. ఇందులో ఉపనిషత్తులలోని, దర్శనగ్రంథాలలోని తాత్త్వికమైన, విజ్ఞానాత్మకమైన విషయాలు, కథాత్మకంగా వివరింపబడ్డాయి. ఇందులోని ఒక్కొక్క వ్యాసం ఒక్కొక్క ఆణిముత్యం. మానవ సంబంధాలను, అనుబంధాలను, కుటుంబ గౌరవాన్ని తెలుపుతూ ఈ వ్యాస సంపుటి పాఠకుల్ని ప్రేమమార్గంలోనూ అంతకు మించి శ్రేయోమార్గాలను నడిపిస్తుంది.

**సాహిత్యంలో తత్త్వదర్శనం** అనే ఆధ్యాత్మిక వ్యాస సంపుటి 2014లో అచ్చైంది. ఇందులో పది వ్యాసాలున్నాయి. చెన్నప్పగారు తాత్త్విక దృష్టితో ఆయా కవులని అనుశీలించిన విధానం అబ్బురం కల్గిస్తుంది. ముఖ్యంగా ఇందలి మొదటి వ్యాసం 'భారతీయ దార్శనిక వివేచన'. ఇందులో ఆరు దర్శనాల్లో ఉన్న విషయాలు ప్రస్తావింపబడ్డాయి. ఇదేవిధంగా 'ఆముక్తమాల్యద'లోని తాత్త్వికాంశాలు స్పృశింపబడ్డాయి. ఆధునిక కవివరేణ్యులైన దాశరథి, కాళోజీ కవిత్వాల్లోను దార్శనికత సోదాహరణంగా నిరూపితమైంది.

**మోక్షసాధనలో దశోపనిషత్తులు** అనే గ్రంథం చెన్నప్పగారు 'మోక్షం' మాస పత్రికలో ధారావాహికంగా ప్రచురించిన ఉపనిషత్ వ్యాసాల్లో ఒక ఐదు ఉపనిషత్తులకు సంబంధించిన వాటిని ఇందులో గ్రహించారు. ఇది 2015లో ప్రచురితమైనది. సరళమైన తెలుగులో ఉపనిషత్‌లో విజ్ఞానాన్ని తెలుగువారికి అందించిన గౌరవం చెన్నప్పగారిదే. ఇందులో ఈశావాస్యోపనిషత్తు, కఠోపనిషత్తు, ప్రశ్నోపనిషత్తు, ముండకోపనిషత్తు అనే ఐదు ఉపనిషత్తులను తీసుకున్నారు. పండిత గోపదేవుల అంతేవాసిత్వంలో ఉపనిషత్తులను అధ్యయనం చేసి వాటిలోని అంశాలను వ్యాసరూపంలో, ప్రసంగాల రూపంలో విశేషించి ఉపనిషత్ సప్తాహాల రూపంలో చెన్నప్పగారు మనకందిస్తున్నారు. ఆధ్యాత్మిక విషయాలు కఠినమైనవి. కాని వీటిని సరళంగా చెప్పినట్లైతే ఎవరికైనా అర్థమవుతుందన్న భావన ఈ సంపుటిని చదివినప్పుడు తేటతెల్లమవుతుంది.

**చింతన** ప్రమీలా శక్తిపీఠం 30వ ప్రచురణ. 'నమస్తే తెలంగాణ' పత్రికలో చింతన శీర్షికన ప్రచురితమైన 30 వ్యాసాలు ఇందులో గ్రహింపబడినాయి. 'అంతర్యామి' వ్యాసాల తర్వాత చింతన వ్యాసాలు చెన్నప్ప గారిని ఒక ఆధ్యాత్మికవేత్తగా తెలుగు పాఠకులకు ఒక ఆధ్యాత్మిక శిఖరంగా భాషిస్తారు. జీవన సాఫల్యమంటే ఆత్మజ్ఞానమని తెలియజేస్తారు. సంక్రాంతి పండుగ మోక్షానికి దారిచూపుతుందని ఒక కొత్త విషయం తెలుపుతారు. గాయత్రి మంత్రాన్ని లోక కల్యాణ ప్రదాయినిగా అభివర్ణిస్తారు. భక్తి అంటే త్రికరణశుద్ధి అని ఘంటాపథంగా తెలియజేస్తారు. వేదమంటే సత్యవిద్యల గ్రంథమని ప్రతిపాదిస్తారు. చతుర్విధ పురుషార్థులకు, చతుర్విధ ఆశ్రమాలకు వేదం నెలవైందని, సృష్టికర్త అసలు సంస్కర్తయని, పరావిద్యతోనే పరమాత్మ సాక్షాత్కారం కలుగుతుందని, బ్రహ్మం అంటే సచ్చిదానంద స్వరూపమని ఎన్నెన్నో విషయాలను కళ్లకు కట్టినట్లు చెప్పడం ఈ గ్రంథం యొక్క ప్రత్యేకత.

## 4. ఇతరములు

ఇందులో బ్రహ్మచర్యం, సుందరకాండ, ఆచార్య చెన్నప్ప అమెరికా ముచ్చట్లు వచన ప్రక్రియకు చెందినవి. వీరసావర్కర్ అనేది నాటిక.

**బ్రహ్మచర్యం** 1999లో మొదటి ముద్రణ, 2004లో ద్వితీయ ముద్రణ పొందింది. నాలుగు ఆశ్రమాలలో బ్రహ్మచర్య ఆశ్రమానికి గల ప్రాశస్త్యాన్ని ఈ చిన్న గ్రంథం నిరూపిస్తుంది. బ్రహ్మచర్యమంటే ఏమిటో తెలియజేస్తూ వేదోపనిషత్తుల ముందు మనుస్మృతియందు, వాల్మీకి రామాయణం నందు బ్రహ్మచర్యానికి సంబంధించిన అంశాలు ఏ విధంగా చోటుచేసుకున్నాయో సూక్ష్మంగా తెలియజేశారు. యువతీ యువకులకు ఈ గ్రంథం ఒక కరదీపికగా ఉపకరిస్తుంది. బ్రహ్మచర్యమంటే పెండ్లి చేసుకోకుండా ఉండడం కాదు బ్రహ్మ అంటే జ్ఞానం నందు చర్య అంటే చరించుట. జ్ఞానం నందు చరించుట అనే తేలికైన అర్థాన్నిచ్చారు. నైతిక శిక్షణకు, ఆదర్శ జీవనానికి బ్రహ్మచర్యాశ్రమం ఏ విధంగా హేతువౌతుందో దృష్టాంత పూర్వకంగా తెలియజేశారు రచయిత.

**సుందరకాండ** ఇది 2012లో ప్రచురితమైంది. జాగృతి, మోక్షం మొదలైన పత్రికల్లో ధారావాహికంగా ప్రచురితమైన వ్యాసాలే ఈ గ్రంథ రూపాన్ని ధరించాయి. రామాయణ సుందరకాండకు వచన రూపంలో స్వేచ్ఛానువాదం ఈ సుందరకాండ. దీని పీఠికలో నేను ఒక వందల సార్లు సుందరకాండను చదివి ఈ గ్రంథం రచించాను అని చెప్పుకోవడం వల్ల సుందరకాండ ప్రతి ఒక్కరు పారాయణం చేయదగిందని అర్థమౌతుంది.

**చెన్నప్ప అమెరికా ముచ్చట్లు** ఇదొక యాత్రాచరిత్ర. ఇది ప్రమీలా శక్తిపీఠం ఆధ్వర్యంలో ప్రచురితమైంది. చెన్నప్పగారి 30 గ్రంథాలలో ఇది చివరిది. 2009లో తానా సభల్లో పాల్గొనడానికి అమెరికా వెళ్ళినప్పుడు అక్కడ ఒక మూడు మాసాలుండి చూసిన దృశ్యాలను అక్షరబద్ధం చేసిన ఫలితంగా వచ్చిన గ్రంథం ఇది. ఇందులో అక్కడక్కడ స్వదేశంతో అమెరికాను పోల్చడం జరిగింది. అమెరికా గొప్పదనం ఏమిటో తెలియజేయడం జరిగింది. ఇందులో చెన్నప్పగారు 'శాంటా

బార్బరా' అనే ప్రదేశాన్ని దర్శించినప్పుడు పొందిన అనుభవాలను సుమారు 12 పుటల్లో కవితాత్మకంగా అక్షరాకృతిని అందించారు. ఈ యాత్రాచరిత్రను చదువుతూ ఉంటే మనం అమెరికాను సందర్శించిన అనుభూతి కలుగుతుంది. అమెరికా యాత్రచరిత్రను ఇంత సుందరంగా మలిచి అందించడం చెన్నప్ప గారికే దక్కింది.




**వీరసావర్కర్** ఒక దృశ్యనాటిక. 2002లో ప్రచురితం. 'వీరసావర్కర్' దేశ భక్తికి ఈ నాటిక ప్రతిబింబంగా నిలుస్తుంది. సావర్కర్ వీరోచితమైన కృత్యాలు ముఖ్యంగా యువకుల్ని ఆకర్షిస్తాయి. ఆంగ్లేయులను ఎదిరించడమే కాదు వారిని ముప్పుతిప్పలు పెట్టిన సావర్కర్ జీవిత చరిత్ర దేశీయుల్లో భారతీయతతో పాటు జాతీయతను పెంపొందిస్తుందని చెప్పడం అతిశయోక్తి కాదు. ఈ చిన్న నాటికను నేతాజి పబ్లిక్ స్కూల్ వారు ప్రచురించారు. ఎన్నోసార్లు పాఠశాల వార్షికోత్సవాల్లో విద్యార్థుల కోసం ప్రదర్శిస్తారు.

**ముగింపు**




ఆచార్య చెన్నప్పగారి సాహితీ ప్రస్థానం బహుముఖాలుగా పరిఢవిల్లింది. వారు ఒకటి రెండు ప్రక్రియలను తప్ప అన్ని ప్రక్రియలలో సాహిత్యాన్ని స్పృశించినారు. అన్నింటిలోను తమదైన ప్రత్యేకతను చూపించినారు. సంప్రదాయాన్ని గౌరవిస్తూ, సంస్కరణ మార్గంలో నడుస్తూ, సాహిత్యం ద్వారా సహృదయ పాఠకలోకంలో దేశభక్తిని, దైవభక్తిని పెంపొందిస్తూ, జాతి పునర్నిర్మాణం కోసం యువకుల్ని సన్నద్ధులను చేయడమే కర్తవ్యంగా పెట్టుకొన్న రచయిత, కవి, ఆధ్యాత్మికవేత్త మసన చెన్నప్పగారు. అందరి గురించి తెలుసుకోవడం, వాటిలోని మంచి విషయాలను గ్రహించడం, వాటి నుండి ప్రేరణ పొందడం ఉత్తములకుండే లక్షణం. మసన చెన్నప్ప గారు ఎందరో మహామహుల గురించి చదివారు. పోతన, పాల్కుర్కి, కృష్ణదేవరాయలు, వేమన, జాషువా, దాశరథి, సినారె వంటి కవులను విపరీతంగా అభిమానించారు. కాని వారి కవిత్వాలకు ముగ్ధులైనారే తప్ప వారి శైలికి బానిస కాలేదు. తన రచనలో తనదైన స్వీయశైలి ఏర్పరచుకున్నారు. అందుకే వారి గ్రంథాలన్నింటికి పాఠకుల ఆదరణ మెండుగా ఉంది.




చెన్నప్పగారు నిత్యవిద్యార్థి. ఎం.ఫిల్, పిహెచ్.డిలు మాత్రమే సంపూర్ణ జ్ఞాన తృష్ణలు తీర్చలేవని భావించి శ్రీ గుండేరావు హర్కారే, శ్రీ గోపదేవశాస్త్రి, మునిమాణిక్యం గార్లను గురువులుగా పొంది, వారి దగ్గర శిష్యరికం చేసి ఎంతో విలువైన జ్ఞానాన్ని సముపార్జించారు. అట్లే నేర్చిన విషయాలని ఎన్నో వేదికల మీద శ్రోతలతో పంచుకొని నలుగురికి పంచినాకొద్ది తరిగేది ధనం, పంచినా కొద్ది పెరిగేది జ్ఞానం అని నిరూపించారు.

ఆచార్య మసన చెన్నప్పగారు పడిలేచిన కెరటం కాదు. పరుగెత్తే కెరటం అని వారి జీవితం, సాహిత్యం గురించి తెలిసిన ఎవరైనా చెప్తుతారు. పాలమూరు జిల్లాలో పయనమై హైదరాబాద్ ఖిల్లాలో వెలుగొందారంటే దాని వెనక వారి కృషి ఎంతోవుంది. వీరు అరవై వసంతాల జీవితంలో దాదాపు నలభై వసంతాలుగా పుస్తక పుష్పాలను వెలువరిస్తూనే ఉన్నారు. సినారె పేరు వినగానే విశ్వంభర, నాగార్జున సాగరం గుర్తొచ్చినట్లు, ఎన్.గోపి పేరు వినగానే తంగేడు పూలు, వేమన గుర్తొచ్చినట్లు, చెన్నప్ప సార్ పేరు వినగానే బృహద్గీత, నయాగరా, ఆ సందుకలు గుర్తురావడమే కాక ఉపనిషత్తు ప్రసంగాలు మనసులో మెదులుతాయి. అంతేకాదు ఎన్నో టీ.వీ కార్యక్రమాల్లో వీరు పాల్గొని ధర్మం గురించి, దేశం గురించి, భక్తిగురించి అనర్గళంగా మాట్లాడుతారు.




మంచికవి, ఉత్తమ ఉపాధ్యాయులు, పండితులు, అనర్గళ ప్రసంగకర్త, విమర్శకులు, వ్యాసకర్త, ప్రాసకారులు వంటి విశేషణాలన్ని ఒక్కరికే ఆపాదించాల్సివస్తే అది ఆచార్య మసన చెన్నప్పగారు అవుతారు. నాలుగు దశాబ్దాల సాహిత్య జీవనం, మూడు దశాబ్దాలకు పైగా ఉద్యోగ జీవితం, ముప్పైకిపైగా గ్రంథాల రచన, వందలాది వ్యాస రచనల ముద్రణ, వేలాది మంది శిష్య సంపద, ఎంతోమంది అభిమానులు, ఆర్జించిన పదవులు, అన్ని కలిసి వారి వెనక కీర్తికిరీటంలా మెరుస్తుంటాయి. ఇంత ప్రజ్ఞ, ఇంత ఓపిక, ఇంత విషయాలీనం, ఇంత వక్తృత్వ ప్రతిభ, ఇంత నిరాడంబరత మీకెక్కడి నుండి వచ్చాయి సార్ అని అడిగితే వారి నుంచి వచ్చే ఒకే ఒక సమాధానం **'నేను నిత్య విద్యార్థిని'**... అని.

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 12  హైదరాబాద్ అక్టోబర్ : 2022

# సాధన పంచకమ్

**వాక్యార్థశ్చ విచార్యతాం శృతిశిర: పక్ష: సమాశ్రీయతాం**
**దుస్తర్కా త్సువిరమ్యతాం శృతిమతస్తర్కోకను సంధీయతామ్।**
**బ్రహ్మైవాస్మి విభావ్యతాం అహరహర్గర్వ: పరిత్యజ్యతాం**
**దేహేఽహమ్మతి రుజ్ఝ్యతాం బుధజనైర్వాద: పరిత్యజ్యతామ్॥**

**తాత్పర్యం :** 1. వేదాంత వాక్యములను చక్కగా విచారణ చేయవలెను. 2. వేదాంతము లేక ఉపనిషత్తులు నిర్ణయించిన సిద్ధాంతమునే ఆశ్రయింపవలెను. 3. చెడు తర్కమును విడనాడ వలెను. 4. వేద సమ్మతమైన తర్కమునే (యుక్తినే) అనుసరిపవలెను. 5. నేను బ్రహ్మమునే ఐ ఉన్నాను అని చక్కగా భావన చేయవలెను. 6. ఎప్పటికప్పుడు గర్వమును త్యజింపవలెను. 7. దేహమే నేను అనెడు భావమును విడిచిపెట్టవలెను. 8. బుధజనులతో వాదించుటను మానివేయవలెను.

**వివరణ**

**7. దేహేఽహమ్మతి రుజ్ఝ్యతామ్ –**

దేహమే నేను అనెడు భావనను విడిచిపెట్టవలెను. నా దేహం అంటాము కాని, నేను దేహం అని అనడం లేదు కదా! దేహంలో అనేక మార్పులు వస్తూ ఉన్నవి కానీ, నాలో ఎటువంటి మార్పు లేదు అనుమాట అందరికీ అనుభవంలో ఉన్నదే కానీ, గుర్తించి యాత్రను కొనసాగించడం కొందరికే పరిమితంగా ఉంటుంది. ఎందుకంటే? నేను కాని దానియందు నేను అనే భావన అజ్ఞానం వల్ల ప్రాప్తించింది. నేను ఎవరో నాకు తెలియనందున లేదా నేను ఆత్మను అనే జ్ఞానం మనిషికి కలుగనందున దేహం నేను అని అనుకుంటున్నాడు. కావున నేను దేహమును కాను. 'సోఽహం' అనగా– ఆ పరమాత్మ స్వరూపాన్ని నేనే అనే సత్యాన్ని సద్గురువును ఆశ్రయించి గ్రహించవలెను.

**8. బుధజనైః ర్వాదః పరిత్యజ్యతామ్ –**

తెలిసిన పెద్ద వారితో, జ్ఞానులతో, సజ్జనులతో, గురువులతో వాగ్వాదమును వదిలిపెట్టవలెను. 'వాదో నావలంబ్యః' వాదాన్ని అవలంబించవద్దని నారద భక్తి సూత్రము వివరించింది. తనకు కావలసిన దానిని పెద్దల ద్వారా వినాలి. సందేహం కలిగితే వినయంతో ప్రశ్నించి తెలిసికోవాలి. కాని వాద వివాదములు చేయకూదని అభిప్రాయం.

# సత్సంగం





**బాధ – మిథ్య**

జ్ఞాని దృష్టి నుంచి చూస్తే లోకమూ, అందులో అణుమాత్రమైన బాధా కలే. కలలో నీకు కూడా ఆకలి తెలుస్తుంది. ఇతరులకీ ఆకలి వేస్తూండటం చూస్తావు. నీవు తిని, ఇతరుల పట్ల జాలిపడి, వారికి తిండి పెడ్తావు. ఇప్పుడు నీవు చూసే బాధా, ప్రపంచమూ ఎంత వాస్తవమో కల ఉన్నంత సేపూ ఆ ఆకలి బాధ వాస్తవమే. నిద్ర మేల్కొనగానే నీకు తెలుస్తుంది కలలోని బాధ వాస్తవం కాదని. కడుపునిండా భోజనం చేసి పడుకుంటావు. కాని కలలో, రోజంతా కష్టపడి పని చేసినట్టు, అలసిపోయినట్టు, ఆకలిగా ఉన్నట్టూ బాగా భోజనం చేయాలన్నట్టూ కనబడుతుంది. అప్పుడు మేల్కొంటావు. నీ కడుపు నిండి ఉన్నదనీ, నీవు పక్కమీద నుంచి కదలనైనా కదలలేదనీ గ్రహిస్తావు. అయినా, కలలో నీకు కనిపించే బాధ నిజం కాదని ప్రవర్తించలేవు కదా. కలలోని ఆకలిని, కలలోని భోజనంతోనే తగ్గించుకోవాలి. కలలో, ఆకలితో ఉన్న తోటి మానవులకు కలలోనే భోజనం పెట్టాలి. కలనీ, మేల్కొని ఉన్న అవస్థనీ కలగాపులగం చేయలేవు. జ్ఞానోదయమై ఈ మాయని గ్రహించనంత వరకూ, ఎక్కడ బాధ కనబడినా దానిని నివారించడానికి సమాజసేవ చేయాలి. అప్పుడైనా, **"నేను చేస్తున్నా"** ననే అహంకారం లేకుండా, చేయాలి. **'నేను ఈశ్వరుని పనిముట్టుని మాత్రమే'** అనుకోవాలి. అట్లాగే స్వాతిశయంతో, **"నాకంటే తక్కువ వానికి సహాయపడుతున్నాను. వానికి నా సహాయం అవసరం ఉంది. వానికి సహాయపడగల స్థితిలో నేనున్నాను. నేను గొప్ప, వాడు తక్కువ"** అనుకోకూడదు. ఆ మనిషిలోని భగవంతుణ్ణి ఆరాధిస్తున్నట్టుగా సహాయపడాలి. ఆ సేవ నీ ఆత్మకొరకే. ఇంకెవరి కొరకో కాదు. నీకు తప్ప నీవెవ్వరికీ సహాయపడటం లేదు.

నీకంటె తక్కువగా సంతుష్టుడైన వాడినో, ఎక్కువగా బాధ పడుతున్న వాడినో చూచి నీవు కరుణతో స్పందించి, నీ చేతనయినంత మేరకు అతనికి ఉపశమనం కలిగించాలి. నీవు అందరినీ ప్రేమించాలి. అందరికీ సహాయపడాలి. అనాసక్తత, నేను చేస్తున్నాననే అహంకార భావం లేకుండా, ఈ పని భగవంతుడు నాతో చేయిస్తున్నాడు. నేను ఆయన పనిముట్టునే అనే భావంతో ఇతరుల కష్టాన్ని తగ్గించడానికి నీవు ప్రయత్నిస్తే నీవు కృతార్థుడవైనా కాకపోయినా, ఆధ్యాత్మికంగా పురోగమిస్తున్నట్లే. ఇతరులకిచ్చేదంతా తమకే ఇచ్చుకుంటున్నామని తెలిసి ఉన్న వారందరూ సచ్చీలురే – అటువంటి వాళ్ళు ఇతరులకు సహాయపడకుండా ఉండగలరా? అందరూ ఆత్మే – ఎవరు ఎవరికి ఏమి చేసినా తమకి చేసుకున్నట్లే.

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 12 (41) హైదరాబాద్ అక్టోబర్ : 2022

# ఆత్మచరితము – విశేషాంశాలు

## (తెలుగులో తొలి మహిళా ఆత్మకథ)

**డాక్టర్ శిరీష ఈడ్పుగంటి,** సహాయాచార్యులు, శ్రీ వేంకటేశ్వర కళాశాల, న్యూఢిల్లీ ఫోన్ : 9958600789

**స్వీయచరిత్ర**

ఆంగ్ల సాహిత్య ప్రభావం వలన తెలుగులోకి వచ్చిన వచన సాహితీ ప్రక్రియల్లో స్వీయచరిత్ర ఒకటి. స్వీయచరిత్ర అంటే స్వీయకథనం. ఆత్మచరిత్ర లేదా ఆత్మకథ అని కూడా పిలుస్తున్నాం. ఒక వ్యక్తి తన జీవితం గూర్చి తానే స్వయంగా రాసుకున్న చరిత్రను ఆత్మకథ లేదా స్వీయచరిత్ర అంటాం. స్వయంగా రాసుకున్న లేదా రాయించుకున్న వారి జీవిత విశేషాలను బాహ్యప్రపంచంతో పంచుకోవడం ఈ ప్రక్రియ యొక్క ఉద్దేశం అవుతుంది. ఎవరైనా సరే వారివారి జీవితాలలో జరిగిన అనుభవాలను, సంఘటనలను తెలుపుతూ, వారి జ్ఞాపకాలను భావితరాలకు అందించడానికి చేసే ప్రయత్నమే స్వీయచరిత్ర. ఆటోబయోగ్రఫీ అనే ఆంగ్లపదానికి సమానపదంగా తెలుగులో స్వీయచరిత్ర అని వాడుతున్నాం.

'స్వీయచరిత్ర స్వరూప స్వభావాలను బట్టి రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. 1.స్వీయ చరిత్రాత్మకం : స్మృతులు, జ్ఞాపకాలు, జీవితఘట్టాలు, యాత్రావృత్తాంతాలు, దినచర్యలు, లేఖలు... ఇవన్నీ స్వీయ చరిత్రాత్మక సాహిత్యం కిందకి వస్తాయి. 2. పూర్తిగా స్వీయచరిత్ర : ఆత్మకథ, స్వీయచరిత్రం పేరుతో జననం, బాల్యం, జీవితంలో వివిధ సన్నివేశాలు, వృత్తి, ఉద్యోగం, వివిధ రంగాలలో చేసిన కృషి మొదలైనవి వర్ణితమవుతూ జీవిత గాథాత్మకంగా సాగితే అది నిర్దిష్టమైన ఆకృతిని ఏర్పరుచుకొని స్వీయచరిత్రగా పరిగణించబడుతుంది.' (రమాపతిరావు, అక్కిరాజు. 1984: 10) ఈ విభజన ప్రకారం చూస్తే ప్రస్తుత రచన స్వీయ చరిత్రాత్మకం విభాగం క్రిందకి వస్తుంది. రచయిత్రి ఈ రచనలో కేవలం ఆమె జీవితంలోని కొన్ని ఘట్టాలను మాత్రమే పేర్కొంటూ ఆత్మ చరితము రాసినట్లు కనిపిస్తుంది. తెలుగులో తొలి మహిళా ఆత్మకథ ఏడిదము సత్యవతిగారి **ఆత్మచరితము** రచనలోని విశేషాంశాలను చర్చించడం ఈ వ్యాస ఉద్దేశ్యం.

**తొలి తెలుగు మహిళా ఆత్మకథ**

భారతీయ భాషలలో స్త్రీలు స్వీయచరిత్రలు రాయడం సుమారుగా పంతొమ్మిదో శతాబ్దపు మధ్యభాగం నుండి మొదలైంది. తెలుగులో స్త్రీల స్వీయచరిత్రలు అరుదుగానే కనిపిస్తాయి. తెలుగులో వచ్చిన స్త్రీల స్వీయచరిత్రలలో మొట్టమొదటిది ఏడిదము సత్యవతిగారి ***ఆత్మచరితము.*** ఇది 1934లో మొదటి ముద్రణ వచ్చింది. ఇదే తొలి తెలుగు మహిళా ఆత్మకథ. అంతేగాకుండా "ఆధునిక స్వీయచరిత్ర తెలుగులో వీరేశలింగం రాసిన రెండు సంపుటాలతో (1911లో మొదటిసంపుటం, 1915లో రెండవది) ప్రారంభమైనట్లుగా




చెప్పుకోవచ్చు. 1915–1946ల మధ్య స్వీయచరిత్రలు రాసి ప్రచురించినవారు ప్రధానంగా అయిదుగురే ఉన్నారు. అందువల్ల సత్యవతిగారి **ఆత్మచరితము** రచనకు తెలుగులో వచ్చిన తొలి స్వీయచరిత్రల్లో కూడా స్థానం వుంది. (సత్యవతి, ఏడిదము. 1934 :7,8)

ఈమె సున్నిత మనస్కురాలు. ఆ రోజుల్లో సమాజంలో జరుగుతున్న సాంఘిక దురాచారాలను చూసి ఎంతగానో బాధపడేవారు. మనసులో ఉన్న ఈ బాధంతా ఆత్మకథ రూపంలో వెలువరించారని ఈ రచనను బట్టి తెలుస్తుంది. ఇదే విషయం సత్యవతిగారు కూడా ఈ రచనలోని 'తొలిపలుకు'లో ప్రస్తావించారు. సంఘంలో స్త్రీలకు జరుగుతున్న దురాచారాలను నిర్మూలించుటకై ఈ రచన చేసినట్లు పేర్కొన్నారు. ఈమె తన జీవిత విశేషాలను ఆత్మకథగా రాయాలని ఈ రచన చేయడం మొదలు పెట్టలేదు. కేవలం ఆనాటి సమాజంలో ఉన్న దురాచారాలను (శిరోముండనాది పరాభవము – భర్త చనిపోయిన ఆడవాళ్ళకు గుండు చేయించడం... మొదలైనవి) నిర్మూలించాలని రచన చేసినట్లుగా తెలుస్తుంది.

అంతేగాకుండా సత్యవతిగారి పుట్టుక, వివాహం మొదలైన సంఘటనల తేదీలుగాని, సమయాలుగాని ఈ రచనలో ఎక్కడా కనిపించవు. ఈమె వీటికి ప్రాధాన్యతను ఇవ్వలేదు. కేవలం ఆమె జీవితంలో జరిగిన కొన్ని సంఘటనలను మాత్రమే ఈ రచనలో పేర్కొన్నారు. ఈ రచనంతా కూడా ఆనాటి సమాజంలో ఉన్న దురాచారాలను రూపుమాపుటయే ప్రధాన కర్తవ్యంగా కనిపిస్తుంది.

**విశేషాంశాలు – వర్ణనలు**

ఈ రచనలోని వర్ణనలు, పాత్రలు, సంభాషణలు మొదలైనవన్నీ నవలను తలపించే విధంగా ఉన్నాయి. ఆమె బాల్యంనందు జరిగిన కొన్ని సంఘటనలను వర్ణించిన తీరు పాఠకులకు ఆసక్తిని కలిగించేవిధంగా ఉంది. దీనికి గల కారణం ఒకటి ఆమెకు చిన్ననాటి నుండి పుస్తక పఠనం అలవాటు ఉంది. మరొకటి బాల్యంలో సీత, సావిత్రి, చంద్రమతి ... వంటి పతివ్రతల కథలను చదువుటలో ఎక్కువ ఉత్సాహం చూపించడం కావచ్చు. ఉదాహరణకు దేవాలయ దర్శనం, శైశవమందు శపథం మొదలైన ఘట్టాల వర్ణన. "యుద్యానవనములో మాలతి, మందారము, పారిజాతము మున్నగు పలురకముల పూలచెట్లు చక్కగా పుష్పించి, తమ పరిమళమును మందమారుతమున కందజేయుచున్నవి. ఆ వనములో నొక పొదరింటిదరిని యువకుడాగి, కూర్చుండి, నన్ను కూడ గూర్చుండ నియమించెను. నేనా వన సౌందర్యమును జూచుచు ఆనందమున మునిగితిని". (సత్యవతి, ఏడిదము. 1934 : 28, 29)

**సంభాషణలు**

సత్యవతిగారి బాల్యంలో జరిగిన కొన్ని సంఘటనలలోని సంభాషణలు చదువుతుంటే ఒకవిధమైన కుతూహలం కలుగుతుంది. సత్యవతిగారికి ఆమె భర్త సీతారామయ్యగారికి మధ్య జరిగిన కొన్ని సంఘటనలను ఈ రచనలో పేర్కొన్నారు. వారిరువురు బాల్యంలో మొట్టమొదటసారి కలిసినపుడు జరిగిన సంభాషణలు ఎంతో ఆసక్తిదాయకంగా ఉన్నాయి.

**"యువ – నీ పేరు?**

**నేను – సత్యవతి**

**యువ – ఏమి చదువుకొనుచున్నావు?**

**నేను – నాల్గవ తరగతి**

**యువ – నీకు సంగీతము వచ్చునా?**

**నేను – రాదు "** (సత్యవతి, ఏడిదము. 1934 : 29)

ఈవిధంగా వారిరువురి మధ్య సంభాషణ జరుగుతుంది. ఈ సంభాషణలు నాటక సంభాషణలను తలపించేవిధంగా ఉంటాయి.

**వివాహం**

ఈ రచనలో (1934కు ముందు) ఒక రకమైన వివాహపద్ధతి కనిపిస్తుంది. రచయిత్రి మాటలలో చెప్పాలంటే "నా జననీ జనకులు నాయొద్ద బంధువుల కుమారులలో కొందరి పేరులు చెప్పి వీరిలో నెవరిని పెండ్లి చేసుకొందువని నన్నడిగినారు. మీ యిష్టమంటిని. తల్లీ! నీ యిష్టమైన వారిని తెలుపుమని బ్రతిమాలిరి. వారడిగిన పేరులలో నా మనోహరుని పేరు గూడ నుండెను. కావున నేనాతని బేర్కొంటిని. చివరకు మా కోరిక ప్రకారమే సంబంధము కుదిరినది." (సత్యవతి, ఏడిదము. 1934 : 32) అని ఈ రచనలో తెలిపారు. ఈ సందర్భంలో ఒక విషయం గుర్తు చేసుకోవచ్చు. ఒకప్పుడు రాజుల కాలంలో స్వయంవరాలుండేవి. సీత, దమయంతి... మొదలైన వారికి స్వయంవరాలు జరిగాయి. వీటన్నింటి గూర్చి రచయిత్రి బాల్యంలోనే ఎన్నో గ్రంథాలలో చదివారు. ఇది ఒకరకమైన వివాహ పద్ధతి. నేటి కాలంలో పెళ్లిచూపులు, అమ్మాయి అబ్బాయి కలిసి మాట్లాడుకోవడం, ఫోటోలు చూసి పెళ్లిళ్ళు కుదుర్చుకోవడం, ఫేస్‌బుక్‌ల ద్వారా, బంధువులు, మ్యారేజ్ బ్యూరోల ద్వారా, బ్రోకర్ల ద్వారా వివిధ పద్ధతుల ద్వారా వివాహాలు జరుగుతున్నాయి. – ఇది నేటి కాలం.

రచయిత్రి కాలంలో అంటే 1934కు ముందు బంధువులలో పెళ్ళికాని కొంతమంది అబ్బాయిల పేర్లు చెప్పి వారిలోంచి ఒక పేరును ఎంచుకోమనడం కనిపిస్తుంది. – ఇది మరొక రకమైన వివాహ పద్ధతి. ఈ రచనలోని పై సంఘటన ద్వారా ఆరోజులలోని వివాహ పద్ధతిని గూర్చి తెలుసుకోవచ్చును.

**నిరుద్యోగ సమస్య**

సత్యవతిగారి భర్త సీతారామయ్యగారికి బి.ఏ. పాసైన చాలాకాలం వరకు ఉద్యోగం దొరకలేదు. ఆ రోజులలోను, ప్రస్తుత రోజులలోను నిరుద్యోగ సమస్య కనిపిస్తూనే ఉంది. కొంతకాలం తర్వాత సీతారామయ్యగారికి పోలీస్‌శాఖలో ఉద్యోగం వస్తుంది. ఆ ఉద్యోగంలో ఆయనకు పై అధికారుల నుండి ఎదురయిన కష్టనష్టాలను గూర్చి సత్యవతిగారు రచనలో పేర్కొన్నారు. పోలీసు వ్యవస్థ ఏవిధంగా ఉన్నదీ, అధికారులు ఏవిధంగా కిందిస్థాయి ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తారో వివరించారు. ఇటువంటి సమస్యలు ఆరోజుల్లోనే కాదు నేటికాలంలో కూడా కనిపిస్తుంటాయి.

**పతివ్రతల ప్రభావం**

సీత, సావిత్రి, దమయంతి వంటి పతివ్రతల ప్రభావం రచయిత్రి పై కనిపిస్తుంది. పతివ్రతల లక్షణాలను రచయిత్రి పాటించాలనుకుంటుంది. దానికి నిదర్శనమే ఈ ఘట్టం. సత్యవతిగారి భర్త సీతారామయ్యగారు బమినిగాం మన్యప్రదేశానికి ఉద్యోగ నిమిత్తం ఒక్కరే వెళతారు. ఆ సమయంలో సత్యవతిగారిని పుట్టింట్లో వదిలి వెళతారు. అప్పుడు ఆమె మనసు భర్త గూర్చి పలువిధాలుగా పరితపిస్తుంది. భర్తకు వంట చేసుకోవడం రాదు. ఒంటరిగా ఏమి కష్టాలు పడుతున్నారో అని మథనపడుతుంది. సీతాదేవి రామునితో వనవాసం వెళ్ళి అక్కడ కష్టాలలో పాలుపంచుకున్నట్లుగా భర్త పడుతున్న

కష్టాలలో తాను కూడా పాలుపంచుకోవాలనుకుంటుంది. బాల్యంలో చదివిన పుస్తక పఠన ప్రభావం సత్యవతిగారి పై ఇక్కడ కనిపిస్తుంది. "లోకమున భర్తతో పాటు భార్య కూడ కష్టసుఖములయందు పాల్గొనుట సతీధర్మము. కాని సుఖముగ నున్నప్పుడు భర్తను గౌరవించుటయు, కష్టకాలమున విడనాడుటయు ధర్మము కాదు. సర్వదా భర్తృ సహచరీత్వమే భారతనారీమణులకు పరమధర్మమని నా ఆశయము". (సత్యవతి, ఏడిదము. 1934 : 35)

### వివాహానంతరం భర్త దగ్గరకు వెళ్ళేటప్పుడు

సత్యవతిగారిని భర్త దగ్గరకు పంపేటప్పుడు తోడుగా ఒక ముసలావిడను కూడా పంపుతారు. అక్కడ ఇంటి పనులలో సత్యవతిగారికి సహాయంగా ఉంటుందని పంపుతారు. "మా బంధువులలో నొక ముసలమ్మను నాతో పంపవలెనని తలచి, మా నాయనగారు నన్ను, మా అమ్మను, మా తాతగారి గ్రామమగు నిందుపల్లికిం బంపిరి." (సత్యవతి, ఏడిదము. 1934 : 36) ఈ ఘట్టం చూస్తే ఒకప్పుడు రాజుల కాలంలో వివాహానంతరం రాణి కూడా ఒకరిద్దరు చెలికత్తెలు రాజ్యానికి వచ్చేవారు. వారు రాణిగారికి సపర్యలు, రాణిగారి యొక్క సొంతపనులు చేసేవారు. పై ఘట్టం ఈ సంప్రదాయాన్ని తలపిస్తుంది.

### భర్త దగ్గరకు వెళ్ళే ప్రయాణం

ఈమె భర్త దగ్గరకు వెళ్ళే ప్రయాణం తీర్థయాత్రలకు వెళ్ళే ప్రయాణాన్ని తలపిస్తుంది. వెనుకటి రోజులలో తీర్థయాత్రలు అంటే కొన్ని నెలలపాటు గాని లేదా సంవత్సరాల పాటుగాని చేసేవారు. అదేవిధంగా సత్యవతిగారు కూడా కొన్ని నెలల పాటు ప్రయాణం చేసి భర్త ఉండే ప్రాంతానికి వెళ్ళడం జరుగుతుంది. ఆ రోజులలోని ప్రయాణాలు, వారికి ఎదురయిన ఇబ్బందులను తదితర విషయాలన్నింటిని ఇందులో వివరిస్తారు.

### భర్త చనిపోయినప్పుడు

ఈ రచనలో మరొక ఘట్టం భర్త చనిపోయినపుడు సత్యవతిగారి మనసు ఏవిధంగా తల్లడిల్లిందో తెలియజేస్తుంది. ఆమెలోని మనోవ్యథ ఆమె మాటలలో "యీ దీనురాలిని కరుణింపవా? అయ్యో ! ఆనాడు సావిత్రికి యముడు దర్శనమిచ్చి భర్తను పునర్జీవితుని జేయలేదా? నీ కాపాటి చేతకాదా? తండ్రీ! నాకే దైవమును కనుపడని కారణమేమీ? బ్రహ్మ విష్ణు మహేశ్వరులారా! మీరలనేకమంది పతివ్రతల దీనాలాపముల నాలకించి వారిని రక్షించితిమని గ్రంథముల వ్రాయించుకొంటిరే! నన్నేల రక్షింపరాదు. నా జీవితేశ్వరుని జీవముల నివ్వలేరా?" (సత్యవతి, ఏడిదము. 1934 : 47) అని రచనలో కనిపిస్తుంది. సావిత్రికి యముడు దర్శనమిచ్చి భర్త ప్రాణాలు కాపాడినట్లుగా తన భర్త ప్రాణాలు కాపాడమని భగవంతునితో మొరపెట్టుకుంటుంది. ఎంతోమంది సాధ్వీమణుల వృత్తాంతాలను బాల్యంలో చదువుట కారణంగా వారి ప్రభావం సత్యవతిగారి పై కనిపిస్తుంది.

### సతీసహగమనం

దీన్ని ఒక ఆచారంగా రచనలో పేర్కొన్నారు. భర్త చనిపోయినపుడు భర్త ఎడబాటు తట్టుకోలేని స్త్రీలు సతీసహగమనం చేయడం మేలని, ఈమె కూడా సతీసహగమనాన్ని కోరుకుంది. ఆ రోజులలో ఈ దురాచారాన్ని ఆచారంగా భావించేవారిలో సత్యవతిగారు కూడా ఉన్నారని తెలుస్తుంది. ఆ రోజులలో ఆడవాళ్ళు భర్త చనిపోయిన తర్వాత వారికి జీవితం లేదనుకునేవారు. ఇది అప్పటి స్త్రీల మానసిక పరిస్థితి. దీనినిబట్టి వారు ఈ దురాచారాన్ని ఆచారంగా అంగీకరించేవారని తెలుస్తుంది. ఇటువంటి పరిస్థితులకు కారణం



స్త్రీకి చదువులేకపోవడం, అలాగే కొద్దోగొప్పో చదువుకున్నా ఆ విజ్ఞానం కేవలం ఇంటిధర్మాలు నేరవేర్చడం, పిల్లల్ని పెంచడం, పెద్దవారితో ఎలా మెలగాలో తెలుసుకోవడం, పతివ్రతా ధర్మాలు, ఆరోగ్యం, నీతిసూత్రాలు మొదలైనవాటిని తెలుసుకునేందుకు ఉపయోగపడే చదువు మాత్రమే అప్పట్లో స్త్రీలకి ఉండేది.

### హేతువాదం- హరికథకుల అజ్ఞానం

భగవంతునిపై మొట్టమొదట్లో నమ్మకం ఉండేది. తర్వాత ఆమెలో హేతువాది కనిపిస్తుంది. కొంతమంది హరికథకులు కథ చెప్పడానికి ముందు గణపతి ప్రార్థన చేసి తరువాత స్త్రీ నిందలు చేస్తారు. కలియుగంలో పతివ్రతలు లేరని వీరి అభిప్రాయం. స్త్రీలనే గాని పురుషులను నిందించరు'. వీటన్నింటిని సత్యవతిగారు ఖండించారు.

### అనాథలకే అవస్థలా?

భర్త పోయిన ఆడవాళ్ళపట్ల చేయు విపరీత చర్యలను ఖండించారు. "భర్త పోయిన వెంటనే, కేశఖండనము చేయించుట, సైనుగుడ్డ కట్టించి ముసుగు వేసి మూలను కూర్చుండబెట్టుట, రాత్రులయందు తిండిని మాన్పించి పిండియో రొట్టెయో పెట్టుట''. అన్నింటి కంటే ముఖ్యమైనది. ''శిరోముండనము చేయించుటయంత అక్రమమైన పని

వేరొకటిలేదు. ఏలయన, స్త్రీలకు పరపురుష స్పర్శము నిషిద్ధము కదా! అట్టియెడ నందరును చేరి, యిది భర్తృ వియోగదు:ఖమున హృదయము పగిలి యేడ్చుచుండ, పైగా, దీన్ని మంగలివాని కప్పగించుటెంత విరుద్ధము. వాడు పరపురుషుడు కాదా? వానిని స్పృశించుటెంతయు అపసవ్యము కాదా? ఇంకను ప్రాణాపాయము కలిగిన నితరుని ముట్టుకొనిన దోషము కాదు కాని విధవ ఊరక పరపురుషుని ముట్టుకొనుట మరింత దోషము కాదా? లేక యీ శిరోజములు తీసివైచిన పునర్భవములు కాకుండునా?... (సత్యవతి, ఏడిదము. 1934 : 53) మొదలైన విషయాలను ప్రశ్నిస్తూ, భర్త పోయిన ఆడవాళ్ళు ఎదుర్కొనే ఇబ్బందులను వివరించారు.

**మరికొన్ని అంశాలు**

బాల్య వివాహాలు, పునర్వివాహాలు, దాంపత్య ధర్మాలు మొదలైన విషయాలను ఈ రచనలో చర్చించారు. తల్లిదండ్రులకు అన్నం పెట్టని పిల్లలు వారు చనిపోయిన తరువాత తమను ఇతరులు మంచివారను కొనవలెనని శ్రాద్ధంనాడు రకరకాల వంటలు చేయడం... తదితర అంశాలన్నింటి గూర్చి ఈ రచనలో సత్యవతిగారు ప్రస్తావించారు.

సత్యవతిగారు ఆ రోజులలో జరిగే దుశ్చర్యలు చూసి చలించిపోయి వాటన్నింటిని స్వవిషయాలతో పాటుగా ఆత్మకథ రూపంలో రాసి ఉండొచ్చు. అంతేగాకుండా ఈ రచనలో సత్యవతిగారి బాల్యం, వివాహం, సంసారం, కొంతకాలం తర్వాత భర్త మరణం, దాంతో సత్యవతిగారు తిరిగి పుట్టింటికి చేరడం మొదలైన సంఘటనలు కనిపిస్తాయి. తదుపరి జీవితం అంటే భర్త చనిపోయిన తర్వాత ఆమె జీవితం గూర్చి గాని దానికి సంబంధించిన సంఘటనలు గూర్చి గాని ఈ రచనలో కనిపించవు. దీనికి కారణం భర్త చనిపోయేంత వరకు మాత్రమే ఆమె జీవితం అనుకుంది. ఆ తరువాత తాను జీవించియున్నా అంటే శరీరం బతికి ఉన్నప్పటికీ తాను చనిపోయినట్లే అనుకుంది. తరువాత ఆమెకు జీవితం లేదనే భావన కలిగి ఉంది. భర్త చావుతోనే తన జీవితం కూడా ముగిసిపోయిందని భావించి యుండవచ్చు. అందుకే అంతవరకు మాత్రమే ఆమె జీవితంలో జరిగిన సంఘటనలు, మంచిచెడులు గూర్చి ఆత్మకథలో రాసి ఉండ వచ్చు. ఆ తర్వాత విషయాలేమి ఆమె ఈ రచనలో పేర్కొనలేదు.

**ముగింపు**

మనిషి జీవితం కంటే ఆసక్తికరమైన అంశం మరొకటి ఉండదు. ప్రతిఒక్కరూ వారివారి జీవితాలలో వివిధరకాల సమస్యలను ఎదుర్కొంటుంటారు. వాటికి ఒక్కొక్కరూ ఒక్కొక్క విధంగా స్పందిస్తారు. ఇదేవిధంగా సత్యవతిగారు కూడా వారికాలంలో (1934) జరిగిన సాంఘిక దురాచారాలకు స్పందించి, వాటి నిర్మూలనకై ఈ రచన చేసినట్లుగా తెలుస్తుంది.

ఈ రచన కేవలం రచయిత్రి జీవితాన్ని మాత్రమే కాకుండా ఆనాటి సమాజ జీవితాన్ని, తదితర విషయాలను తెలియజేస్తుంది. రచయిత్రి ఈ రచన ద్వారా ఆ కాలంనాటి సామాజిక చరిత్రను భవిష్యత్ తరాలకు అందించారు. అప్పట్లో ఆత్మకథను రాయాలనే ఈ ఆలోచన రచయిత్రికి కలగడం మాత్రం విశేషం. అంతేగాకుండా సాహిత్యం ఆయాకాలాల నాటి సమాజాన్ని చిత్రిస్తుందనడానికి నిదర్శనం ఈ **ఆత్మచరితము.**

**ఉపయుక్త గ్రంథసూచి**

1. రమాపతిరావు, అక్కిరాజు. ఏప్రిల్ 16, 1984. *తెలుగులో స్వీయచరిత్రలు.* యువభారతి ప్రచురణ. సికిందరాబాద్.

2. సత్యవతి, ఏడిదము. 1934. *ఆత్మచరితము.* (సంపా. వకుళాభరణం రాజగోపాల్) అస్మిత రిసోర్స్ సెంటర్ ఫర్ విమెన్. సికిందరాబాద్.

## ఇస్త్రీ బట్టలు

పీఠం కోసం
ఆయనకెన్ని పాట్లో
పీఠమెక్కితే
ఆయనకెన్ని ప్లాట్లో

పదవికోసం
ఆయన మొక్కినకాళ్ళెన్నో
పదవిలో
ఆయన తొక్కినకాళ్ళెన్నో

గడప గడపకువారు పంపిన
ద్రవ్యమెంతో
అభివృద్ధి మాటున
వారు దాచుకున్న ధనమెంతో

ప్రచారంలో
చేతులెత్తి దండం
పదవిలో
చేతులెత్తేసే వైనం

పదవికై
ప్రాంతానికొక్క వేషం
పదవిలో
మాయని ఇస్త్రీ బట్టల తేజం

ఎజ్జు మల్లయ్య
ఫోన్ : 965 287 1915





# అష్టాదశ శక్తి పీఠ వైభవం




**లంకాయాం శాంకరీదేవి (ట్రింకోమలి (శ్రీలంక) కాళీమాత)**

శ్రీలంకన్ కొలువైనదేవి! నెలవౌ చిద్రూప! ట్రింకోమలీ!
శైలారూఢవు శాంకరీ! శివరసీ ! శక్త్యంశ సంధాయినీ!
లీలామాత్రము దృష్టి సోక జననీ! క్లేశమ్ము వైదొల్గదా?!
బాలేందీవర దివ్యనేత్రి! వరదా భద్రాత్మ వాగ్దేవతా!

**కామాక్షీ కంచికాపురే (కంచిలో కామాక్షీదేవి)**

కామాక్షీ! వరకంచిలోన వెలయన్ కాంక్షల్ సదా తీర్చగా
నేమా వైభవమద్ది? శక్తివయి నీవే మమ్ము కాపాడగన్!
నీమమ్ముల్ ధర నేర్పి బ్రోచు జగతిన్ నీహార వస్త్రాంచితా!
రా! మాతా! మము గావగన్! సుపదదా! రమ్యాక్షి వాగ్దేవతా!

**ప్రద్యుమ్నే శృంఖలాదేవి (ప్రద్యుమ్నపురి(పశ్చిమబెంగాల్) శృంఖలాదేవి)**

వంగోర్విన్ ధర శృంఖలాఖ్యవయి, నీ వాల్లభ్యమున్ జూప నా
గంగాసాగర తీరమందు స్థిరమౌ కారుణ్యమున్ బంచెదున్
సింగారంబగు దివ్యమూర్తి పుడమిన్ శ్రేయమ్ము కాంక్షించితిన్
బంగారమ్మగు జీవితమ్ము నిడుమా! ప్రార్థింతు వాగ్దేవతా!

**చాముండీ క్రౌంచ పట్టణే (మైసూరులో చాముండీదేవి)**

చాముండీ! మహిషూరునందు కొలువై, చైతన్య వాగ్జ్యోతివై
ధృమచ్ఛక్తిని ధాత్రి నింప చిరమౌ దేదీప్యమౌ కీర్తులే
క్షేమమ్మున్ గురిపించు హస్తమదియే! చిన్మాత్ర సంపోషిణీ!
ప్రేమమ్ముల్ ప్రజకంత బంచ వరమౌ! ప్రీత్యంశ వాగ్దేవతా!

**ఆలంపురే జోగులాంబా (అలంపురంలో జోగులాంబ)**

ఆలంపూరున జోగులాంబవయి నీ వానందమందించగన్
సాలంకారిత శక్తి పీఠమదియే! సంపూజ్య శక్త్యాత్మ! భా
వాలంగూర్చి కలమ్ము రక్తి వెలుగన్ వాక్ప్రజ్ఞనందిమ్ము! స
చ్ఛీలాలోలుర జేయనొప్పు జనులన్ చెన్నార వాగ్దేవతా!

**శ్రీశైలే భ్రమరాంబికా (శ్రీశైలంలో భ్రమరాంబికాదేవి)**

శ్రీశైల భ్రమరాంబికా కొలిచెదన్ శ్రీలింపుగూర్పంగ! నా
క్లేశాలం దొలగంగ జేయుము భువిన్ లీలావినోదమ్ముతో
లేశమ్మౌ యశమెంతయో వెలుగనుల్లేఖింతు నీ గాథలే!
యాశాలోల సదంతరాత్మవగుచు న్నానంద వాగ్దేవతా!

**కొల్హాపురే మహాలక్ష్మీ (కొల్హాపూరులో మహాలక్ష్మి)**

కొల్హాపూరున లక్ష్మివౌచు, చిరమౌ కొంగ్రొత్త శ్రేయంబిడన్
కల్హారమ్మది పీఠమై నిలువగా కాంతుల్ భువిన్ నిండెగా!
కల్హల్ నేనన చక్కదిది, సతమున్ కారుణ్యమున్ జూపు! ప్రా
వల్హీకమ్మును గూరుచ శక్తినిడు! నే వర్ధిల్ల వాగ్దేవతా!!

**మాహూర్యే ఏకవీరికా (మాహూరులో ఏకవీరాదేవి)**

మాహూరన్ గల యేకవీర! వరమై మాహాత్మ్యమౌ దైవమై
యాహారించును దుష్టశక్తులను! తా నానందమందీయగన్
మోహావేశము రూపుమాపి జనులన్ మోదమ్మొయింపారగా
నీహారాకృతి నీదు వృష్టి నిడుమా! నిర్మాల్య వాగ్దేవతా!

**ఉజ్జయిన్యాం మహాకాళీ (ఉజ్జయినిలో మహాకాళీ)**

క్షిప్రా తీరమునందు నిల్చి, భువికిన్ క్షేమమ్ములొప్పారగన్
సప్రామాణ్యము కాళికాంబ! వెలుగై సంతృప్తి నందించగా
సుప్రీతమ్మగు భక్తకోటి తనియన్ సొంపారునా పూజలై
యీ ప్రాకాశము భానుడై వెలుగగా నీడేర్చు వాగ్దేవతా!

**పీఠికాయాం పురుహూతికా (పిఠాపురంలో పురుహూతికాదేవి)**

పీఠిక్యాం పురుహూతికాంబ యనుచున్ పేరార నిన్గొల్వ, నీ
కాఠిన్యమ్మగు మానవాళి హృదిలో కారుణ్యమున్నింపుమా!
పాఠమ్మై సరిజేయవమ్మ ప్రజలన్! పంతమ్ములే వీడగన్
రాఠన్నింపుము దివ్యశక్తి ఝురివై, రమ్యాక్షి వాగ్దేవతా!

---

**– అవధాని భానుప్రకాశాచార్య**
**సంగారెడ్డి, ఫోన్ : 9603204507**

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 12 (46) హైదరాబాద్ అక్టోబర్ : 2022




**ఓఢ్యానాం గిరిజాదేవి (ఓఢ్యానపురిలో గిరిజాదేవి)**

ఒరిమన్ భక్తిని ముక్తినిచ్చు ఘనమౌ నోఢ్యాణ సంవాసినీ
గిరిజాదేవిగ నీదు రూపమెపుడున్ కీర్తింప సాఫల్యమే!
సరిలేరెవ్వరు దివ్యశక్తులిడగన్ సద్భక్త చింతామణి!
ధరకున్ ప్రేయము గల్గజేయు వరమై దాక్షణ్య వాగ్దేవతా!

**మాణిక్యా దక్షవాటికే (ద్రాక్షారామంలో కొలువైన మాణిక్యాంబ)**

మాణిక్యాంబవు దక్షవాటికను! నీ మాహాత్మ్యమౌ శక్తులీ
క్షోణిన్ వర్ణన జేయ నాకు తరమా? శోణార్క బింబాననా!
త్రాణమ్మే చరణ ప్రభావము లసత్త్రైలోక్య సంచారిణీ
వీణాతంత్రుల నాదసత్త్వమిదుమా! వేవేల్పు వాగ్దేవతా!

**హరిక్షేత్రే కామరూపా (అస్సాం గౌహతిలో కామరూపాదేవి)**

తరగల్ పొంగెడు బ్రహ్మపుత్ర నదికిన్ తాదాత్మ్యమందించగన్
స్మరణీయమ్మగు 'కామరూప' నిలువన్ స్థాయమ్ము లొల్కించుచున్
వరమౌనుత్సవ 'మంబవాచి' జరుగన్ వర్ధిల్లు కళ్యాణమే!
మురియున్ జీవన నేత్రపర్వమదియే మోదమ్ము వాగ్దేవతా!

**ప్రయాగే మాధవేశ్వరీ (ప్రయాగలో మాధవేశ్వరీదేవి)**

ఇలలో వైభవ మాధవేశ్వరివి! మాయీ జన్మ సార్థక్యమౌ
విలువన్ జేరె అలోపిదేవి యనగన్, వేమారు దండాలివే
కలలోనైనను కష్టమింత గనకే కాంక్షిళినీడేర్చుమా!
పలుకుల్ లటను మాటలేక నడువన్ పాండిత్య వాగ్దేవతా!

**జ్వాలాయాం వైష్ణవీదేవీ (హిమాచల్‌ప్రదేశ్‌లోని వైష్ణవీ జ్వాలాదేవి)**

జ్వాలాలోలిత దివ్యశక్తి గద నీ జాజ్వల్యమౌ రూపమే!
ప్రాలేయాచాల సప్తదీప్తులెటులో? ప్రాగ్వైభవాదర్శినీ!
వ్యాలాలంకృత వైష్ణవీ పదముతో వ్యాపించు సద్భుక్తులే!
మాలా లాలిత కుంతలా! రసధునీ! మారాజ్ఞి వాగ్దేవతా!

**గయా మాంగళ్య గౌరికా (గయలో మంగళగౌరీదేవి)**

నీవే మంగళగౌరివౌచు పుడమిన్ నిత్యమ్ము వెల్గొందగన్
నీ వాల్లభ్యము జూపుదేవి ప్రజకున్ నిత్యత్వమందించుమా!
సేవాతత్పరమింత నేర్పి నడతన్ సేద్యమ్ము నే జేయగన్
ప్రోవదన్ నీ హృదయాంతరాళ కృపతో పుణ్యాత్మ వాగ్దేవతా!

**వారణస్యాం విశాలాక్షి (వారణాసిల విశాలాక్షి)**

ధరపై నిండిన వారణాశి వెలుగై దాక్షిణ్య భావాత్మవై
సురలోకమ్మున దీప్తిరేఖ జిలుగై, సొంపౌ విశాలాక్షివై
వరదుండౌ తగు విశ్వనాథు సతివై, వాగ్రూప చిచ్ఛక్తివై
వరణీయమ్మగు శబ్దశక్తి నిదుమా వాత్సల్య వాగ్దేవతా!

**కాశ్మీరేతు సరస్వతీ(కాశ్మీరులో సరస్వతీదేవి)**

ధ్వాంతమ్మే హృది దొల్గజేయుమవనిన్! ధావళ్య హంసాసనీ
కాంతుల్ నింపగ నిల్చినావు ఘనమౌ కాశ్మీర దేశమ్మునన్
శాంతమ్మున్ భువికందజేయు వరమై సాహిత్య సంశోభినీ
చింతల్ దీర్చుము 'కీర్భవాని' వెలుగై! చిన్మాత్ర వాగ్దేవతా!!





ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 12  UGC Care List Approved Journal
హైదరాబాద్ అక్టోబర్ : 2022

# అడిగోపుల వెంకటరత్నం కవిత్వం– ప్రపంచీకరణ ప్రభావం

**ఎన్.వి. పద్మకుమారి,** తెలుగు అధ్యాపకురాలు, విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల. ఫోన్ : 7661070343

వలసవాద, వాణిజ్య, సంస్కృతిని రాజ్యవ్యవస్థలో ఒక భాగంగా మార్చుకున్న అగ్రరాజ్యం అమెరికా దేశపు మానసిక పుత్రిక ప్రపంచీకరణ (Globalization) ప్రపంచ దేశాలన్నీ అనుసరిస్తున్న సరళీకృత (Liberalization) ఫలితంగా నేడు ప్రపంచమే ఒక చిన్న గ్రామం (Global Village) గా మారిపోయింది. గతంలో లాగా కాకుండా ఏ దేశమైనా తమ దేశపు ఉత్పత్తులను ఏ దేశములోనైనా సులభంగా అమ్ముకోవడానికి అవకాశాలను సులభతరం చేయడం జరిగింది. ఈ పరిస్థితికనుగుణంగా అన్ని దేశాలు ఆచరిస్తున్న ప్రైవేటీకరణ సరళీకరణలే, ప్రపంచీకరణకు మార్గం వేశాయి. అగ్రదేశాల హస్తాలతో నడిపే ప్రపంచ బ్యాంకు విధించిన నిబంధనల ప్రకారం ఆర్థిక సరళీకృత విధానం (Liberalization) ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ (Privatization) పద్ధతి ప్రపంచీకరణ (Globalization) లో భాగంగా మారిపోయింది. ఈ విధానాన్నే ఎల్.పి.జి. అంటారు ఈ ఎల్.పి.జి.విశ్వరూపమే ప్రపంచీకరణ.

ఈ ప్రపంచీకరణ వల్ల సాంకేతిక పరిజ్ఞానం విపరీతంగా పెరిగిపోయింది. ఆ జ్ఞాన ఫలితాలను ఉపయోగించుకోవడంలో మానవ జీవన విధానంలోనూ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక విషయాలలోను ఎన్నో పరిణామాలు చేరిపోయి మొత్తం ప్రపంచమే అనూహ్య మార్పులకు గురైంది. ఈ కారణంగా ఆయా దేశాలలోని స్థానిక సాంఘిక జీవితాలలోను, సాంస్కృతులలోను ఎన్నో మార్పులు వచ్చాయి. ఈ మార్పుల్లో కొన్ని మేలు చేసేవి ఉన్నాయి. కానీ దుష్ఫలితాలే ఎక్కువగా కన్పిస్తున్నాయి. ఈ దుష్ఫలితాలను సాహితీవేత్తలు తమ రచనల్లో ప్రతిఫలింప చేస్తూ సమాజాన్ని దుష్ఫలితాలువైపు ఆకర్షితులు కాకుండా మంచి ఫలితాలను స్వీకరించే వైపు దృష్టి మళ్ళించే ప్రయత్నాలు చేస్తూనే వున్నారు. గ్లోబలైజేషన్ దుష్ఫలితాలపై కవులు తమ కలం ఖడ్గాలను ఝుళిపిస్తూనే వున్నారు. అలాంటి వారిలో అడిగోపుల వారూ ఒకరు. ప్రపంచీకరణ ఏఏ రంగాలలో ఎలా ప్రభావితం చూపిందో అడిగోపుల తన కవిత్వంలో చక్కగా పొందుపరిచారు. వీరు కవిత్వంలో కనిపించే ప్రపంచీకరణ ప్రభావాన్ని ఏడు రకాలుగా విభజించుకొని పరిశీలించవచ్చు. అవి.

1. ప్రైవేటీకరణ
2. అవినీతి
3. మద్యపానం
4. విద్య – వైద్యరంగాలు
5. రోడ్లు, వాహనాలు, భవంతులు,
6. హింస – ఉగ్రవాదం
7. శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం



**1. ప్రైవేటీకరణ:** ఇది గత శతాబ్దిలోని 9వ దశకం అరంభం నుంచీ ఆరంభమైంది. అప్పటి ఆంధ్రప్రదేశ్ (Privatization, Globalization) చివరి రూపాన్నే నేడు (Globalization) పేరుతో పిలుసుకుంటున్నాము. ఈ ప్రపంచీకరణలో అన్ని ప్రజావ్యవస్థలను, ప్రభుత్వ వ్యవస్థలను క్రమంగా ప్రైవేటుపరం చేయడమే ప్రధానాంశం. దీనివల్ల పేదవాడు ఇంకా పేదవాడిగా, ధనవంతుడు ఇంకా ధనవంతుడిగా మారిపోతున్నాడు. ఎన్నో స్థానిక వ్యవస్థలు, కులవృత్తులు మంట కలిసిపోయాయి. మానవ సంబందాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. మనిసికి ధనార్జనే ప్రధానంగా మారిపోయింది. మనిషి మనస్సు డాలర్ల చుట్టూ తిరగడం ఆరంభమయ్యింది. ఈ విషయాలను అడిగోపుల తన కవిత్తంలో ప్రతిఫలింపచేశారు.

ప్రభుత్వ రంగాలను ఎప్పుడైతే ప్రైవేటీకరించడం ఆరభమైందో న్యాయం కూడా కండబలం, ధనబలం వున్న వారికనుగుణంగా మారిపోతోంది. గుండాగిరి, దోపిడీ, దౌర్జన్యాలు మితిమీరి పోయాయి. ఇది ప్రపంచీకరణవల్ల సమాజంలో వచ్చిన మార్పు. ఈ మార్పును సూచించే కవితా ఖండిక.

**ఒక ప్రశ్నకు వినయ వినమ్ర సమాధానం**
**అజ్ఞకు వంచిన శిరస్సు ప్రత్యుత్తరం**
**కండబలం న్యాయస్థానమైన తీర్పు**
**కూడాగిరి శిక్షలు అమలు**
**దోపిడి దౌర్జన్యాల విశృంఖలత**

**కాళ్ళకింద మట్టి కనుమరుగు** – (అదృశ్యకుడ్యం)–పుట 84

**2. అవినీతి :** ప్రపంచీకరణ ప్రభావంతో సమాజంలో అవినీతి ఎక్కువైపోయింది. ప్రతీ రంగంలోను అవినీతి పాతుకుపోయింది. సులభంగా వచ్చేధనం (Easy Money) కోసం వెంపర్లాట ఎక్కువైంది. దాని కోసం ఎంతటి అక్రమానికైనా మనిషి వెనుకడాని పరిస్థితి ఏర్పడింది. ప్రపంచీకరణ పుణ్యమా అని అక్రమ సంపాదనా మార్గాలు ఎక్కువైపోయాయి. మనుషులంటే విలువ లేకుండా పోయింది. మనిషి కండ్లకు డబ్బులే కనిపిస్తున్నాయి. కానీ మనుషులే కనిపించడమే లేదు. "నన్ను వెళ్ళిపోనీ" కవితంలో ఈ విషయాన్నే వ్యక్తం చేస్తారు అడిగోపుల.

**"అద్దాల చట్రంలో బొమ్మనౌతాను**
**నా గళం నిశ్శబ్దం**
**నా ఉనికి నిక్షిప్తం**
**పాదం నడవాలనుకుంటుంది.**
**మనుషులు కనిపించరు.**
**లక్ష్యం డబ్బుగా మారాక**
**ఉచ్ఛ్వాస నిశ్వాసాలు కరెన్సీ వాసనలు**
**అ అ లను.**
**ఆ పైన నన్ను నేను మరచే ప్రమాదం వుంది.**– (రేపటి వర్తమానం) – పుట. 17

డబ్బుల సంపాదనలో నడిచే బొమ్మలా మారిపోయిన మనిషికి ఊపిరిగా మారిన డబ్బు మనిషి తన్నుతాను మరచిపోయి తాను మనిషినేనన్న నిజాన్నే మరిచిపోయి ప్రమాదం ఈ ప్రపంచీకరణ మూలానే సంభవిస్తోంది. అందుకే ఎన్నో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇలాంటి స్థితిలో నీతి తలెత్తుకొని నిలబడడం కష్టమైపోతోంది. అవినీతి విశ్వరూపం దాల్చుతోంది. ప్రజలచేత ప్రజలకొరకు ఏర్పాటయ్యే రాజ్యాన్నీ ప్రజలే పరిపాలించుకుంటారన్న ప్రజాస్వామ్య మూలసిద్ధాంతం మంట కలిసిపోతుంది. ఎన్నో మార్పులు అన్నీ అవినీతికి ఆస్కారము కల్పించేవే. "బొమ్మ బొరుసు లేని నాణెం" కవితలో దీన్ని–చిత్రించారు కవి.

**"నీతి మాట్లాడుతుంది**
**నిజం ప్రకటిస్తుంది**
**యుద్ధం మొదలౌతుంది**
**ప్రజల చేత ప్రజాస్వామ్యం**
**ప్రజలదే ప్రజాస్వామ్యం**
**ప్రజలకోసమే ప్రజాస్వామ్యం**
**సిద్ధాంతం వీగిపోతుంది**
**అవినీతి విశ్వరూపమై**
**సత్యం సూక్ష్మ చిత్రమౌతుంది**
**వాక్యాలను వాక్యాలు**
**పేజీలకు పేజీలు**
**చొప్పించబడతాయి"** – (రేపటి వర్తమానం)– పుట. 23

**3. మద్యపానం:** ప్రపంచీకరణ ఫలితంగా దేశంలో మద్యం ఏరులై పారుతోంది. రాష్ట్రాలకు ప్రధాన ఆదాయవనరు ప్రజల మద్యపానం అయిపోయింది. మద్యం దిగుమతులు ఎక్కువైపోయి విదేశీ మద్యం పట్టణాల్లోనే కాదు పల్లెల్లోను సులభంగా దొరికే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ మద్యపాన నేపథ్యంలోనూ అడిగోపుల కవిత్వం రాశారు. ఆ కవిత్వంలో ప్రపంచీకరణ ప్రభావం ఎలా వుందో మచ్చుకొక ఉదాహరణ ద్వారా పరిశీలిద్దాం.

**"సీసాలు చప్పుడైనప్పుడు"** కవిత మొత్తం మద్యంపైన రాసిందే.....

మందుసీసాలు ముందు పెట్టుపోగానే నంజుకునే ముక్క మబ్బుగాను, లైట్ల మసక కాంతి మబ్బుల్లో మసగ్గా కనిపించే చంద్రుడిగాను వర్ణిస్తూ ఈ గేయంలో 'బార్' వాతావరణం ఎలాంటిదో కళ్ళముందుంచుతాడు.

**శీతల గిద్దంగుల్లోంచి బయటపడ్డా**
**సీసాల చప్పుడైనప్పుడు**
**మబ్బు ముక్క**
**మింగిన చంద్రుని ముఖంలా**
**లైట్లు మసక కాంతిని తెచ్చుకుంటాయి**
**గోడలపై దాగిన ఉషాపూతమ్ గానం**
**ఆషాఢ మేఘమై కమ్ముకుంటుంది**
**హద్దులు లేని పాశ్చాత్య సంగీతం**
**తుఫానై అందర్నీ ముంచుతుంది** – (మట్టి మౌనం వహించదు) –పుటలు 10,11

ఇలాంటి 'పబ్'లు నగరాలలో ఎన్నోవున్నాయి. ప్రతీ 'పబ్' లోనూ మద్యం ఏరులైపారుతుంది. అశ్లీలగీతాలు, శృంగారచేష్టలు వికృతరూపం దాల్చుతాయి. ఆ చీకటి కోణంలో సాధింపబడే అగ్రిమెంట్లు, కాంట్రాక్టులు పర్మిట్లు సాధించబడతాయి. ఇంకా మద్యంతో బాటు రక్తం పారడమూ, అప్పుడప్పుడూ సహజమే. అదంతా ఈ గేయంలోనే చిత్రించడం గొప్ప నేర్పరితనం.

**అంతవరకు దైవాంశ సంభూతులైన వారి చేతులు**
**ఏదో స్పర్శ కోసం వెదుకులాడతాయి**
**ఆదికవి నన్నయ్యను అలపించిన నోరు**
**కవి చౌడప్ప పద్యాల్ని కంఠస్థం చేయిస్తుంది**
**అక్కడ కులమతాలన్నీ ఒకటే.** – (మట్టి మౌనం వహించదు) – పుట. 12

**4. విద్యా–వైద్యరంగాలు:** ఎప్పుడో 19వ శతాబ్దారంభంలో బ్రిటీషువారు, వారికి కావల్సిన సేవా సిబ్బంది అనుగుణంగా మెకాలే సూచనలతో మన దేశంలో ఆంగ్ల ప్రభావ విద్య అరంభమైంది.

అంతకు ముందు వీధి బడులుండేవి. వీధి బడులకంటే ముందు అగ్రమ విద్య వుండేది, మెకాలే విద్యావిధానం వల్ల మన సాంప్రదాయ విద్యా విధానం మూలబడింది. దాదాపు 200 సంవత్సరాలు ఈ దేశాన్ని పాలించిన బ్రిటీషువారు మన దేశాన్ని వదిలిపోయి 72 సంవత్సరాలు దాటుతున్నా ఇంకా ఆంగ్లేయుల విద్యావిధానం కొనసాగడం దురదృష్టం. పెను పిశాచంలా ఈ దేశంలోకి వచ్చి పడిన ప్రపంచీకరణ ఫలితంగా విద్యా వ్యవస్థలోనూ పెను మార్పులు సంభవించాయి. స్థానిక భాషల పాఠ్యాంశాలకు ప్రాధాన్యత తగ్గిపోయింది. ఆంగ్ల భాషా వ్యామోహం పెరుగిపోయింది. దాంతో విద్యా వ్యవస్థ ప్రైవేటుపరం చేయబడ్డది. ఫలితంగా ఎన్నో కార్పోరేట్ పాఠశాలలూ, కళాశాలలూ వచ్చాయి. ప్రైవేటు విశ్వ విద్యాలయాలు సైతం ఆవిర్భవించాయి. విద్యా వ్యవస్థ ఖరీదు మారిపోయింది.

ఇదిలావుండగా జ్యోతిషం, వాస్తు వంటి మూఢాచారాలను, మూఢనమ్మకాలను పెంపోందించే అంశాలు విశ్వవిద్యాలయ స్థాయిలో వచ్చి చేరిపోయాయి. అయితే నేడు చదువు కూడా వ్యాపారంగా మారిపోయింది. జ్ఞానం మరుగుజ్జు అయిపోయింది. ఈ క్రమంలో ఉద్యోగాలు వేలంపాటలో పాడుకోవాల్సి పరిస్థితి దాపురించుతుంది. ఈ విషయాన్ని **'కన్నీటి సముద్రం'** కవితంలో ఇలా వ్యక్తం చేస్తారు కవి.

**సాగని చదువు ఆగని బతుకు**
**మరుగుజ్జు జీవితాన్ని ప్రసాదించాయి**
**కొనుగోలు అమ్మకాలు మధ్య విద్యను**
**వేలం పాటలో అత్యధిక ధరకు కొని**
**ఒక జిల్లా పగ్గాలు చేపట్టిన ఉద్యోగం నాది** – (విశ్వగీతం) – పుట. 101

**5. రోడ్లు, వాహనాలు, భవంతులు :** ప్రపంచీకరణలో ప్రధానపాత్ర వహిస్తున్నది ప్రపంచబ్యాంకు. ఇదివర్తమాన దేశాలకు అప్పులిచ్చి ఆయా దేశాలపైన పెత్తనం చెలాయిస్తుంటుంది. మన రాష్ట్రం చాలా ఏళ్ళ నుంచీ ప్రపంచబ్యాంకు నుంచీ అప్పులు తీసుకొని రోడ్లను వెడల్పు చేయడం జరిగింది. పలు పట్టణాలకీ బైపాస్ రోడ్డు అలా వచ్చినవే. రోడ్లు డబుల్ రోడ్లు, బైపాస్ రోడ్లపైన బైపాస్ రైడర్స్ పేరుతో వేగంగా వాహనాలు ప్రయాణం చేయడం జరుగుతోంది. వెడల్పాటి రోడ్ల సౌకర్యం వల్ల రోడ్ల ప్రక్కన విలువైన భవంతులు వెలిశాయి. వ్యాపార సంస్థలు వెలిశాయి. అలాగే వేగంతో పరుగెత్తే బైపాస్ కార్ల రైడర్స్ ఎక్కువైపోయారు. ఇలా మిగిలిన వాహనాలు వేగంగా దూసుకుపోవడం వల్ల ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయి. వీటన్నింటినీ కవులు తమ రచనల్లో చిత్రించడం జరుగుతోంది. ఇలా చిత్రించే కవుల సరసన అడిగోపుల వారూ నిలుస్తారనడంలో సందేహం లేదు. దీనికీ కొన్ని ఉదాహరణలు ఒకప్పుడు రోడ్లు పక్కన గాక దూరంగా పెట్రోలు బంకులు, హోటళ్ళు, వైన్‌షాపులూ వుండేవి. నేడు అన్నీ రోడ్ల ప్రక్కనే దొరుకుతున్నాయి. సిగరెట్లు తాగేవాళ్ళు మందు కొట్టేవాళ్ళు ఎక్కువైపోయారు. ఈ కారణంగానే యాక్సిడెంట్లు ఎక్కువ జరుగుతున్నాయి. ఈ విషయాన్ని **'కోకిల పాడుతుంది'** కవితలో వుంది.

**కారు నడుపుతూ టక్కున ఆపి**
**పెట్రోలుతో ప్రత్యక్షమైన**
**భైరవుడ్ని చూసి**
**రోడ్డుపై నడుస్తూ**
**నోరెండి**
**సోడా సీసాల్తో విశృంఖలంగా**
**ఎదురొచ్చిన వాడ్ని చూసి నేనంత భీతిల్లాను**
**చౌరస్తాలో సిగరెట్టు ముట్టించను నిల్చి**
**అగ్నిచేత బట్టి**
**యముడై ఎదురైన**
**వాడ్ని చూసి నేనంత వణికి పోయాను** – (విప్లవానికి పురిటి నొప్పులు) – పుట. 33

పై గేయంలో సోడా సీసాలు, సిగరెట్లు, మత్తు పదార్థాలకు ప్రతీకరగా తీసుకున్నవే. ఈ మత్తులో మునిగే వాహన చోదకులు వాహానాలను నడపడం వల్లనే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. నేను రోడ్డు ప్రమాదాలు జరగని రోజు లేదు. మరణకాండ ఇలాగే కొనసాగించాల్సిందేనా! దీని పరిష్కారం లేదా! అన్న ప్రశ్నలకు అదే కవితలా సమాధానం అదే కవితలో సమాధానం ఆశావహంగా వ్యక్తం చేశారు కవి.

**రేపు ఆకుల మాటున**
**కోకిల పాడుతుంది**
**ఎగసిన మారణకాండ**
**ముగిసి తీరుతుంది.**

ప్రపంచ బ్యాంకు నియమాలనుగుణంగానే ప్రభుత్వాలు గుడిసెల స్థానాల్లో భవంతుల్ని లేపుతాయి. అభివృద్ధి పేరుతో భూ ఆక్రమణ. వాటి నక్షత్ర భవనాల ఆవిర్భావాలు అన్నీ జరిగిపోతాయి. న్యాయ వ్యవస్థా దీన్ని సమర్పిస్తుంది. ఈ విషయాలను 'గుడిసె ఆత్మకథ' కవితలో చాలా ఆవేదనతో ఆవిష్కరిస్తారు అడిగోపుల.

**న్యాయమూర్తి ఇంటి వద్ద**
**అత్యవసరంగా నిద్రలేచిన కోర్టు**
**భూ ఆక్రమణ చట్టాన్ని భుజాన వేసుకొని**
**అర్ధరాత్రి గుడిసెల్ని అదృశ్యం చేసి**
**నక్షత్ర భవనాలకు నాంది పలుకుతుంది**
**గుడెసెల ఆస్థికల్ని ఊరేగింపుగా మోసుకెళ్తాయి**
**పట్టపగలే పాదాల కింద తొక్కి**
**ఏరువాక సాగిస్తాయి** – (యుద్ధమంటే మాకు భయం లేదు) – పుట 29.

ప్రపంచీకరణ ఫలితంగా అభివృద్ధి పేరుతో లబ్ధి పొందేవి ఎప్పుడూ ధనిక వర్గాలు, వాళ్ళ కొమ్ము కాసే ప్రభుత్వాలే పేదలకు వరిగేది ఏమి లేదు. పేదవాడని ఇంకా పేదవాడిగా, ధనవంతుల్ని ఇంకా ధనవంతులుగా చేస్తున్నది ఈ గ్లోబలైజేషన్ ప్రభావమే. ఈ విషయాన్ని పై గేయ భాగంలో చిత్రించడం జరిగింది.

**6. హింస- ఉగ్రవాదం :** ప్రపంచీకరణ పుణ్యమని వెబ్‌సైట్లు, వాట్సప్‌లు, ముఖ పుస్తకాలు ఎక్కువైపోయి ఎవరు ఎవరితో ఎలాంటి సంబంధాలు పెట్టుకుంటున్నారో తెలియని పరిస్థితి ఏర్పడింది. అంతర్జాలం ఒక మాయాజాలం అయిపోయింది. దీనిపైనా నిఘా లేదు. అలా చేయడానికీ వీలులేని పరిస్థితి ఇతరులను హింసించడాలు, లైంగిక వేధింపులు, హత్యలు, ఉగ్రవాద చర్యలు అన్నీ వాటి ద్వారా సులభమై పోతున్నాయి. ఎవరిపైనా పర్యవేక్షణా లేని స్థితి. దీన్ని దృష్టిలో పెట్టుకుని సమాజంలో పెరిగిపోతున్న హింసలు, హత్యలు, ఉగ్రవాద చర్యలు మొదలైన ఈనాడు హింస ఎలా విజృంభిస్తోందో, **'మేల్కొలుపు'** కవితలో తెలియజేస్తారు, జ్ఞానానికి గుర్తింపులేదు. శాంతికి తావు లేకుండా అయిపోతోంది. దోపిడీ, దౌర్జన్యాలు నరమేధ రూపంలో దాల్చాయి. ఈ విషయాన్నే ఈ గేయంలో ఇలా చెప్పారుకవి.

**జ్ఞానం బిచ్చమెత్తుతూంది.**
**భీకరమై / ఘోరమై**
**బీభత్సమై / యుద్ధం సాగుతూంది**
**పిరికిగా / బేలగా**
**దీనంగా / నిస్సహాయంగా**
**శాంతి బతుకు యాడుస్తూంది**
**అరాచకమై / దౌర్జన్యమై**
**దోపిడీయై / నరమేధమై**
**హింస విజృంభిస్తూంది -** (రేపటి జ్ఞాపకం)- పుటలు-94,95

**7. సాంకేతిక పరిజ్ఞానం:** ప్రపంచీకరణ ప్రభావంతో నేడు సాంకేతిక పరిజ్ఞానం అపురూపంగా పెరిగిపోయింది, ఈ సాంకేతిక పరిజ్ఞానమే ఈ గ్లోబల్ సెల్ రూపంలో మనిషి అరచేతిలోకి వదిగిపోయింది. సినిమా చూడాలన్నా, పాటలు విన్నాలన్నా, వార్తలు తెలుసుకోవాలను కున్నా, అమెరికాలోని బిడ్డను చూడాలన్నా, మాట్లాడాలన్నా సెకన్లలో జరిగిపోతొంది. యూట్యూబ్‌లు, పేస్‌బుక్కులు, వాట్సాప్‌లు, ట్విట్టర్లు, వికీపీడియా, గూగుళ్ళు అంతర్భాగాలై మనిషే సాంకేతిక విజ్ఞానానికి నిలువెత్తు ఆకారంగా మారిపోయాడు. ఈ విషయాన్నే అడిగోపుల వారు 'నేటి-మానవుడు' కవితలో ఇలా తెలియజేస్తారు.

**నాకు ఆగ్రహం వచ్చిందా**
**సముద్రాన్ని పిడికిల్లో యిముడ్చుతూ**
**వుఫ్‌మని వూదేనా**
**అగ్నిదేవుడు నక్షత్రాలు చూస్తాడు**
**కాలు అడ్డం పెట్టేనా**
**వరదలు పిల్లకాల్వాలౌతాయి**
**ఇంతకీ నేనెవరో తెలుసా?**
**మానవుణ్ణి**
**నాటి సాంకేతిక పరిజ్ఞానాన్ని-** (సూర్యోదయం)-పుట.67

పై గేయ భాగంలో చెప్పినట్లుగా మానవుణ్ణి సాంకేతిక పరిజ్ఞానానికి ప్రతీకగా మార్చేసింది ప్రపంచీకరణేనని గుర్తించాల్సిన అవసరం వుంది.

**అధార గ్రంథాలు :**

1. అదృశ్యకుడ్యం 2. రేపటి వర్తమానం
3. మట్టి మౌనం వహించదు 4. విశ్వగీతం
5. విప్లవానికి పురిటి నొప్పులు 6. యుద్ధమంటే మాకు భయంలేదు
7. రేపటి జ్ఞాపకం 8. సూర్యోదయం

# అమ్మ

అందమైన అమ్మ రూపం
నాకు ప్రకృతి వనం
అమ్మ మాట
నాకు పూల బాట
అమ్మ జ్ఞానం
నాకు విజ్ఞానం......

అమ్మ పాదాలను
మట్టి ముద్దాడితే
మనసు పులకరించి
పలకరించినట్లుంది....

నేను నడిచే
డాంబార్ రోడ్
నన్నెందుకో
ఎక్కిరిస్తున్నట్టుంది.....

అమ్మ నెత్తి మీద
గంప నెత్తుకొని
నా నెత్తి మీద
టోపీనెత్తింది....

అమ్మ చంకల
నన్నెత్తుకొని
లాలించి, పాలించి

నా చంకకి
పుస్తకాల
సంచినందించింది..

పచ్చని పొలాలు
అమ్మ నేస్తాలైతే
అమ్మ అందించిన
పుస్తకాలే నా నేస్తాలు.....





**విశాల**
**ఫోన్ : 99515 96598**

తెలంగాణ విస్మృత కవులు - 4

# జి.వి. జగదీశ్వర స్వామి, అనుముల శ్రీహరి

**డా. పెబ్బేటి మల్లికార్జున్,** సహాయ ఆచార్యులు, నాగర్ కర్నూలు, ఫోన్: 9491881916

తెలంగాణ చరిత్రలో అనేక రకాల ఉద్యమాలు కన్పిస్తాయి. వాటిల్లో మూడు పధానమైనవి. మొదటిది రైతులు, కూలీలు, మేధావులు, కవులు మరియు కళాకారులు ఏకమై పోరాడిన నిజాం రాజ్య విమోచనోద్యమం. రెండవది ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర తొలిదశ ఉద్యమం. మూడవది ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర మలిదశ ఉద్యమం. నిజాం నుండి విముక్తి చెందామన్న ఆనందం నుండి తేరుకోక ముందే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడి భాష, చదువు, ఉద్యోగాలు, నీరు అన్ని రంగాలల్లో ఆంధ్రావారి ఆధిపత్యం కొనసాగి నిజాంపాలన నుండి ఆంధ్రుల పాలనలోకి తెలంగాణ పోయింది. ఆంధ్రుల బాధలు భరించలేని తెలంగాణ ప్రజలు ఆంధ్రాగోబ్యాక్, నాన్‌ముల్కీ గోబ్యాక్ పేరుతో 1969లో పెద్ద ఉద్యమం నడిపారు. ఇందులో 369 మంది తెలంగాణా వీరులు అమరులయ్యారు.

హృదయాన్ని కదిలించే సంఘటన జరిగినప్పుడు సహృదయులైన కవులు, రచయితలు స్పందిస్తారు. తొలిదశ తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణలో కవులు స్పందించారు. కాని ఆనాటి ఉద్యమ సాహిత్యం చాలా పరిమితంగా మనకు నేడు లభిస్తున్నది. చాలామంది కవుల సాహిత్యం, కవులు మరుగునపడి ఉన్నారు. అలాంటి వాళ్లలో జి.వి. జగదీశ్వరస్వామి, అనుముల శ్రీహరి కవులు ఉన్నారు. వీరి గురించిన సమాచారం ఆచార్య ఎస్.వి.సత్యనారాయణ గారు అందించారు.

**జి.వి. జగదీశ్వరస్వామి**

ఈ కవి గాదెపాగ వెంకటస్వామి-దానమ్మ అనే దళిత దంపతులకు హైద్రాబాద్ పాతనగరంలోని సుల్తాన్‌షాహిలో 1952లో జన్మించాడు. జన్మతః వచ్చిన అంగవైకల్యం (కుంటితనం)ను లెక్క చేయకుండా సాహిత్య కృషి, భజన గాయకుడిగా సంగీత కృషి చేశాడు. బాబన్న, బాబుదాసు అన్నవి అతని కలం పేర్లు. బాల్యం పాతనగరం లోని బాలాగంజిలో గడిచింది. ప్రభుత్వ ఉన్నత పాఠశాల సుల్తాన్‌షాహిలో 1969లో హెచ్.ఎస్.సి.పూర్తి చేశాడు. విద్యానగర్ లోని సెంట్రల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (సిటిఐ)లో సాంకేతిక విద్యలో అభ్యసించి అనారోగ్య కారణాల వలన పరీక్ష రాయకపోవడంతో చదువు అర్థాంతరంగా ఆగిపోయింది.

తొలి రోజుల్లో భావ, అభ్యుదయ కవితలు రాశాడు. చింతపట్ల సుదర్శన్, ఎస్.వి. సత్యనారాయణతో కలిసి 1970లో నవ్యసాహితీ, ఉషస్సు లిఖిత పత్రికల నిర్వహణలో కీలక పాత్ర వహించాడు. ఒక వైపు అంగవైకల్యం మరోవైపు క్షయవ్యాధి సోకడంతో నిరాశావాదిగా మారాడు.

తండ్రి ఊహ తెలిసే నాటికి మరణించడంతో తల్లి దానమ్మ పోషణలోనే పెరిగాడు. తండ్రి నిజాం ప్రభుత్వంలో పోలీస్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం చేసి మరణించినందున అతని పెన్షన్ ఆ కుటుంబానికి చాలీచాలని ఆర్థిక వనరుగా ఉంది. నిజాం ఛారిటబుల్ ట్రస్ట్ వారిచే ఈ పరిమిత పెన్షన్ సరిపోక మైసయ్య బీడీ కంపెనీ (జబల్‌నాథ్ బీడీ ఫ్యాక్టరీ) లో బీడీలు చుట్టి సంపాదించిన అరకొర డబ్బులతో కుటుంబం నికృష్ట పేదరికంలో గడిచింది.

చదువు ఆగిపోయిన తరువాత జగదీశ్వరస్వామి కొంతకాలం పాటు పాతనగరంలోని ప్రైవేట్ రేషన్ దుకాణంలో కార్మికుడిగా పని చేశాడు. అయినా బతుకు కష్టాల కొలిమిలోనే కొనసాగింది. అతడు రాసిన కొన్ని కవితాపంక్తులు పాతనగర రచయితలకు గుర్తుండి పోయాయి.

**'ఏది వసంతం ఏది**
**ఏది ఎంతకని కనిపించలేదు'**

అనే పల్లవితో సాగే గేయంలో

**'రగిలి రగిలి కోపమంతా**
**కాలిపోనీ లోకమంతా'** అన్న పంక్తులు అతనిలోని కేంద్రమైన నిరాశకు అద్దం పడుతుంది. ఇతడు అవివాహితుడిగానే ఉండిపోయాడు.

పాతనగరంలోని భజన మండలుల ప్రభావంతో భజనకవిగా మారిపోయాడు. హృదయాలను ద్రవింపజేగల విషాద భజన కీర్తనలను అనేకం రచించాడు. అవి పుస్తక రూపంగా అచ్చుగానప్పటికి పాతనగర భజనకళాకారుల నాలుకలపై నాట్యం చేస్తున్నాయి.

''ధరణి బాలాగంజివాసియై వెలసిన బాబుదాసు'' అన్న ముక్తాయింపు ఇతని భజన పాటల్లో కన్పిస్తుంది.

**'అయ్యో రామ ఇక ఎంత పనాయే**
**జీవమెల్లిపాయె**
**ఈ మాయ జగములో మాబాబన్న**
**దోస్తీ విడిచిపాయె'** అంటూ పాడే మరణ సందర్భగీతం బాగా ప్రాచుర్యం పొందింది. దేవుని భజన కీర్తనల్లోనూ, చావు సందర్భంగా భజనమండలివారు నిర్వహించే భజన పాటల సన్నివేశంలోనూ పాటలల్లుతూ, పాడుతూ, ఆ వచ్చే పరిమిత పారితోషికంతో జీవనం సాగించేవాడు. ఇతనికి ఒక అక్క ఉన్నది. అతని పాతికేళ్ల ప్రాయంలో తల్లి మరణించింది. మాతృవియోగం ఇతన్ని మరింత కృంగదీసింది.

ఒంటరి జీవితం గడుపుతూ భజన పాటలు పాడుతూ హైద్రాబాద్ పాతనగరంలోని ఉప్పుగూడ ప్రాంతంలో కొన్ని సం॥ నివసించి 30-35 ఏండ్ల చిన్న వయస్సులోనే ఆరోగ్యం క్షీణించి అంతిమశ్వాస విడిచాడు.

ఇతని మిత్రులు, బంధువులు, అభిమానులు వందలాదిగా పాల్గొన్న జగదీశ్వరస్వామి అంతిమ యాత్ర హైద్రాబాద్ పాతనగరమంతా తిరిగి ఉప్పుగూడ శ్మశానవాటికలో దహనం చేయబడింది. ప్రముఖ రచయితలు ఎస్.వి.సత్యనారాయణ, చింతపట్ల సుదర్శన్, ఇతర పాత నగర రచయితలు, భజన బృందాలవారు అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

ఈ కవి 1969నాటి ప్రత్యేక తెలంగాణ ఉద్యమం గురించి బలంగా కవిత్వం రాశాడు. జగదీశ్వరస్వామి 'కాసు రాకాసి' కవితలో కాసు బ్రహ్మానందరెడ్డిపై అక్షర తూటాలను కురిపించాడు.

**'కాసుగాడు గద్దెమీద**
**కూసుంటే ముప్పు వచ్చె**
**చూసి చూసి మనలను రా**
**కాసి అయ్యి మ్రింగవచ్చె**
**జైజై తెలంగాణమనే**
**చదువరులను కాల్చినాడు**
**తెలంగాణ వీథుల**
**గుండెల రక్తం త్రాగినాడు**

అని కాసుబ్రహ్మానందరెడ్డి తెలంగాణ ఉద్యమంపై చేస్తున్న కుట్రలను, కాల్పులను, తెలంగాణకు చెందిన ద్రోహులను జగదీశ్వరస్వామి చీల్చిచెండాడు. అట్లాగే తెలంగాణ ప్రజల దీక్ష, పౌరుషాన్ని కూడా తెలిపాడు.

**దెబ్బ తిన్న తెలంగాణ**
**దీక్ష వదలి పెట్టదురా**
**కాసూ! నీ గుంటనక్క**
**మోసమింక సాగదురా!**

**మానదురా తెలంగాణ**
**మనసులోని గాయం**
**కాసూ! త్వరలోనే నీకు**
**కాటి యాత్ర ఖాయం**

'తెలంగాణ మేల్కొన్నది' అనే గేయంలో జగదీశ్వరస్వామి ఆంధ్రులు చేసే కుట్రలను తెలిపాడు.

**"ఎత్తులు వేసే నక్కల**
**కుత్తుకలను చీల్చిచూచి**
**ఊసరవెల్లుల రంగుల**
**దోసిలిలో విషం చూచి**
**గద్దెలపై ఉన్న బొల్లి**
**గద్దల ఆకలిని చూచి..."**

అని మోసాలను తెలియజేస్తూ

**"భావి తెలంగాణ జాణ**
**ఎవరికి దాస్యం చేయదు**
**జన్మహక్కు నపహరించు**
**ఉన్మాదులను క్షమించదు**
**స్వయం రాజ్య పాలనలో**
**శాంతికపోతాలు పెంచి**
**జోహరులనందుకొనును**
**జైజై కరాల స్వనం**
**చైతన్యం పొంది విశ్వ**
**సీమల నలరించగలదు**
**శ్రీలను వరియించగలదు"** అని 1969లోనే స్వయం రాజ్య పాలనలోకి రావాలనే బలమైన ప్రజల కాంక్షకు జగదీశ్వర స్వామి గొంతుకయ్యాడు.

**అనుముల శ్రీహరి**

శ్రీహరిగారు హైద్రాబాద్ పాతనగరంలోని బాలాగంజి ప్రాంత వాస్తువ్యుడు. ఇతను వృత్తిరీత్యా వైద్యుడు. 1972 నాటికే ఉస్మానియా వైద్య కళాశాలలో ఎమ్.బి.బి.ఎస్. డిగ్రీ పూర్తి చేసి, వైద్యవృత్తిలో కొనసాగాడు. మున్నూరు కాపు కుటుంబంలో జన్మించాడు. మెడికల్ విద్యార్థిగా ఉన్నప్పుడే 1969నాటి ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ప్రభావితుడైనాడు. కవిత్వం, కొన్ని గీతాలు రచించాడు. కాని వేదికలపై వినిపించేవాడు కాదు. ఉద్యమ కవితలను ప్రచురణ కోసం పంపేవాడు కాదు.

వైద్యుడైనప్పటికి పురాణ, ప్రబంధాలను లోతుగా అధ్యయనం చేయడం వలన తెలుగుభాషపై పట్టు సాధించాడు. సామాజిక పరిణామాలపై ఆగ్రహంతో ఆవేశపూరితమైన భావోద్వేగంతో కవితలు రచించాడు. సోదర తుల్యులైన తమ బస్తీవాసులు (బాలాగంజి) అయిన ఎస్.వి. సత్యనారాయణ, జగదీశ్వరస్వామిలను ప్రోత్సహించి ప్రత్యేక తెలంగాణ ఉద్యమ గీతాలను రాయించాడు. ఈ ముగ్గురు రాసిన గేయ సంకలనం 'విప్లవ శంఖం' పేరిట ప్రచురించారు. ముగ్గురు ఇంకా విద్యార్థి దశలోనే ఉన్నందున ప్రభుత్వానికి, పోలీసులకు భయపడి వారు తమ పేర్లను ప్రకటించకుండా రచన దగ్గర "ఎవరో" అని వేసుకున్నారు. దీన్ని 'డి' కోడ్ చూస్తే ఎ-ఎస్.వి., వ-జగదీశ్వర, రో-శ్రీహరి - ఇలా గుప్తనామాలతో 'ఎవరో' అని ప్రకటించుకున్నారు.

ఎంతో ఆవేశంతో రాసిన కవి అనుముల శ్రీహరిగారు 'పోలీసు దౌర్జన్యం' అనే కవితలో 1969 నాటి ఉద్యమంపై పోలీసులు చేసిన

జులుంను కళ్లముందుంచాడు.

**'కుక్షి పోషణ రాచరికానికి**
**కుక్కల మాదిరి అమ్ముడుపోయిన**
**....................................**
**ప్రజా సమితి శిబిరాలను కాలిచి**
**పస్తు దీక్ష కర్తల దండించి**
**ప్రశాంత సత్యాగ్రహాలను కొట్టుచు**
**బాష్పగోళములు విసిరేస్తున్నది**
**నిర్భయంగా సమ్మెను సాగిస్తే**
**నిరంకుశముగా ప్రజలపై ఫైరింగ్'** అని నాటి పరిస్థితిని చరిత్రకందించాడు. 'తెలంగాణ విడి కాకుంటే' అనే కవితలో –

**తెలంగాణ విడికాకుంటే**
**అంతా ఆంధ్రుల దాసులమే**
**తెలంగాణమే విడికాకుంటే**
**................................**
**నూరేళ్ళైనా తెలంగాణీయుల**
**నోళ్ళకు తాళం వేతురురా**
**మన సిరిసంపదలన్నీ దోచుకొని**
**మనకు జోలె తగిలింతురురా** అని చెప్పాడు

ఆచార్య ఎస్.వి.సత్యనారాయణతో కలిసి ముగ్గురు 'విప్లవ శంఖం' అనే గేయ సంకలనాన్ని వేయడంలో వీరి యొక్క ఉద్యమ, సాహిత్య అభిమానాన్ని అంచనా వేయవచ్చు. తాము కష్టపడి రచనలు చేసినా కీర్తికాంక్ష లేకుండా తమ రచన ఉద్యమానికి, ప్రజలకు ఉపయోగపడితే చాలు అనుకున్న నిస్వార్థులు. ప్రఖ్యాత పరిశోధకులు సంగిశెట్టి శ్రీనివాస్, డా॥సుంకిరెడ్డి నారాయణరెడ్డి గార్లు '1969–1973 తెలంగాణ ఉద్యమ కవిత్వం' పేరుతో ఒక సంకలనాన్ని తీసుకొచ్చి అప్పటి ఉద్యమ కవిత్వానికి శాశ్వత రూపం ఇచ్చారు.



## మేఘాలు – జీవ ప్రాణాలు

## (మణిపూసలు)

నీలినింగిన మేఘాలు
గాలిన వర్ష రాగాలు
దూది పింజల్లా తేలుతు
మనసుకిల సంతోషాలు!



గగనం కాదుగ శూన్యము
చుక్కల వెన్నెల వైనము
ప్రేమ మేఘ సందేశం
కాళిదాసు మహకావ్యం!



ఉరుములతోవానలుకురియు
పిడుగులమెరుపులతోజడియు
పొలాలలో పడగానే
హాలికుల మనసులు మురియు!



రైతు పంటలకు మూలము
ఆకలి తీర్చుడి జీవము
మానవ మనుగడకు మేలు
అన్నపూర్ణయే మేఘము!

జడమనుకునే మేఘాలు
జలధిని త్రాగె యోగాలు
వడిగ వర్షాకాలంలో..
మబ్బులతో జల ధారలు!



మేఘాలునింగిన లేక
ప్రజలకిల ఆకలి కేక
సరిగవానలుకురిపించ
సాగు రైతు ఏరువాక..!!!

**చింతోజు పద్మావతి**
**పెద్దపల్లి, ఫోన్ : 8464954860**

# సమాజాన్ని జాగృతపరచే నవల 'అవతలి గుడిసె'

**బొమ్మెర సతీశ్,** తెలుగు పరిశోధక విద్యార్థి, కాకతీయ విశ్వవిద్యాలయం, ఫోన్ : 9502333175

ఇతర దేశాల పాశ్చాత్య ఆంగ్ల సాహిత్యం నుండి ఆధునిక సాహిత్యం వరకు భారతదేశంలోని ఇతర భాషల ప్రాచీన సాహిత్యం నుండి ఆధునిక సాహిత్యం వరకు రచించినటువంటి అనేక రచనలను తెలుగు భాషలలోకి అనువాదం చేయడం అనేది ఎప్పటి నుండో వస్తున్న ఒక ప్రక్రియ. అనేక ఉత్తమ రచనలు తెలుగు నుండి వివిధ ప్రాంతీయ భాషల్లోకి, దేశంలోని వివిధ ప్రాంతీయ భాషల నుండి తెలుగులోకి రూపాంతరం చెంది ఇక్కడి పాఠకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. అలా ఆకట్టుకున్న రచనల్లో కబీర్‌దాస్, రవిదాస్, రవీంద్రనాథ్ ఠాగూర్, డా.బి.ఆర్ అంబేద్కర్, ప్రేమచంద్, శరత్‌చంద్ర చటర్జీ, రాహుల్ సాంకృత్యాయన్, ఓం ప్రకాష్ వాల్మీకిలతో పాటు కారల్ మార్క్స్, గోర్కి, షేక్స్పియర్, టాల్ స్టాయ్ లాంటి అనేక మంది ఇతర భాషల రచయితల రచనలు తెలుగులోకి అనువదింప బడి తెలుగు పాఠకులను, సాహితీ ప్రియులను ఎంతగానో అలరించాయి. జ్ఞానాన్ని పంచాయి. అలా అనువదింపబడిన రచనల్లో **'అవతలి గుడిసె'** నవల ఒకటి. ఇది హిందీ సాహిత్యపు మొట్టమొదటి దళిత నవల.

హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయంలోని హిందీ విభాగంలో గత మూడు దశాబ్దాలుగా ప్రొఫెసర్‌గా సేవలు అందిస్తున్న వి.కృష్ణ గారు అనువాదకులుగా మంచి పేరు గాంచారు. గతంలో పిన్ని, సావిత్రి బాయి పులే కవితల్ని తెలుగులోకి అనువదించారు.

"రచన కత్తిమీద సామైతే, అనువాదం రెండు కత్తుల మీద సాము. అనువాదకునికి రెండు భాషలు "బాగా" వచ్చి ఉండక తప్పదు. అందులో ఒకటి మాతృభాష. రెండవది దాదాపు కృత్రిమంగా నేర్చుకొన్న "పరాయిభాష" అని వల్లంపాటి వెంకట సుబ్బయ్యగారు అన్నట్టు అనువాదం అత్యంత కష్టతరమైన ప్రక్రియ మూల రచన యొక్క భావాన్ని, అంతర్యాన్ని, రచయిత చెప్పదలుచుకున్న విషయాన్ని యధాతథంగా చెబుతూనే ఏ భాషలోకి అయితే అనువాదం చేస్తున్నామో ఆ భాష యొక్క పాఠకులకు సులభంగా అర్థం అయ్యే రీతిలో అనువాదం చేయడం అనేది నిజంగా కత్తి మీద సాము లాంటిదే. అలాంటి అసాధ్యమైన పనిని డా.వి. కృష్ణ గారు ఎంతో అద్భుతంగా చేశారని ఈ నవల చదివినప్పుడు మనకు అర్థం అవుతుంది. ఈ నవల చదువుతున్నంతసేపు ఎక్కడ కూడా ఒక అనువాద రచన చదువుతున్న భావన కలగదు. ఈ నవల ముందు మాటలో అనువాదం గురించి, ఈ నవల మూల రచయిత డా. జయప్రకాష్ కర్దంగారు మాట్లాడుతూ ఇలా రాశారు **"జ్ఞానాన్ని పెంపొందించడంలో అనువాదం ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఎందుకంటే అనువాదం రెండు భాషలను కలిపే వంతెన లాంటిది. రెండు భాషా సమాజాలను దగ్గరకు తీసుకు వస్తుంది."**

హిందీ సాహిత్యపు ప్రముఖ రచయిత అయిన జయప్రకాష్ కర్దం గారు రాసినటువంటి నవల ఈ చప్పర్. ఈ నవల మొట్టమొదటి హిందీ దళిత నవలగా కూడా అత్యంత ప్రాచుర్యం పొందింది. ఈ 'అవతలి గుడిసె' నవల ద్వారా రచయిత సమాజంలో అత్యంత వెనకబడిన దళిత సమాజం యొక్క పీడనని, జీవన సంఘర్షణను, వేదనను హృద్యంగా చిత్రీకరించారు. అంతేకాకుండా దళిత సమాజంపై ఆధిపత్య కులాల వాళ్ళు చేస్తున్న దోపిడి, అణచివేతతో పాటు దళిత, శ్రామిక మహిళలపై చేసే సాముహిక అత్యాచారాలను గూర్చి కూడా ఈ నవలలో చర్చించారు.

ప్రముఖ హిందీ రచయిత, ఉద్యమకారుడు శ్యౌరాజ్ సింగ్ బేచైన్ 'చప్పర్' (అవతలి గుడిసె) నవల గురించి మాట్లాడుతూ ఇలా అంటాడు. **"చప్పర్ అంబేద్కర్ దార్శనికతను సమర్థించే నవలగా మనకు కనిపిస్తుంది. అందుకే ఈ నవల యొక్క పాత్రలు ప్రారంభం నుంచి ముగింపు దాక తమ సామాజిక బాధ్యతతో పాటు ఆత్మ విశ్వాసాన్ని నింపుతాయి. ఉన్నత విద్య వైపు ప్రేరేపిస్తాయి. ప్రజలకు జ్ఞానాన్ని పంచుతాయి."**

ఉత్తర ప్రదేశ్‌లోని మాతాపూర్ అనే ఒక మారుమూల గ్రామంలో ఉండే ఒక దళిత కుటుంబం. ఆ కుటుంబంలోని సుఖ్ఖా, రమియాల ఏకైక కుమారుడు అయిన చందన్ కుమార్ బాగా చదువుకోవాలని అనుకుంటాడు. అతని తల్లిదండ్రులు సైతం తమ కుమారుణ్ణి గొప్పగా చదివించాలని అనుకుంటారు. **"దేవుడి దయవల్ల చందన్ ఎక్కడైనా కలెక్టరో, ఇన్స్పెక్టరో కానీ, వాడు కారులో తిరుగుతాడు. బంగళాలో ఉంటాడు."** ఇలా తమ కుమారుడు తమలా ఒక కూలివాడిగా, రోజువారి శ్రమజీవిగా మిగిలిపోకుండా, పెద్ద పెద్ద చదువులు చదువుకుని ఒక ప్రభుత్వ ఉద్యోగిగా స్థిరపడాలని కలలు కంటాడు. అందుకోసమని ఉన్నత చదువులకై ఢిల్లీ పట్టణానికి పంపిస్తాడు. ఈ విషయం తెల్సిన మాతాపూర్ గ్రామ పెద్ద ఠాకూర్ హర్నాంసింగ్, ఆ వూరి పండితుడు, చందన్‌ను తిరిగి ఊరికి తీసుకురమ్మని, ఇక్కడే ఏదో ఒక చిన్నా చితక ఉద్యోగం చూసుకోమని, ఇంతవరకు చిన్న కులాల పిల్లలు ఎవరు కూడా పెద్ద చదువుల కొరకు పట్టణం వెళ్ళలేదు. ఒకవేళ అలా వెళ్తే మన ఊరికే అరిష్టం అని సుఖ్ఖాను బెదిరింపులకు గురి చేస్తూ ఆ ఊరి పండితుడు ఇలా అంటాడు **"పశ్చాత్తాపం పడాలి సుఖ్ఖా పశ్చాత్తాపం. వెంటనే కబురు పెట్టి నీ**

**కొడుకును తిరిగి రమ్మను. చేసిన పాపాన్ని సరిదిద్దుకునే ప్రయత్నం చేయి"** అంటూ సుఖ్కాపై ఒత్తిడి తెస్తాడు. లేదంటే అనేక దుష్పరిణామాలు చోటు చేసుకుంటాయని బయపెడతాడు. ఈ సంఘటన ద్వారా మనకు అర్థమయ్యే విషయం ఏమిటి అంటే ఒకప్పుడు దళితులకు చదువుకునే హక్కు లేదని, ఒకవేళ చదువుకునే సాహసం చేసినా కూడా ఆ ఊర్లో ఉండే ఆధిపత్య కులాల వాళ్ళు శాస్త్రం పేరుతోనో, మూఢనమ్మకాల పేరుతోనో దళితుల్ని చదువుకు దూరం చేయడమో, ఉన్నత చదువులు చదవకుండా అనేక రకాలుగా అడ్డుకునే ప్రయత్నమో చేస్తూ ఉండేవాళ్ళు అన్న విషయం మనకు ఈ నవల ద్వారా మరొక్కసారి అవగతం అవుతుంది.

ఊరి పెద్దలు ఎన్ని రకాలుగా ఒత్తిడి చేసినా కూడా సుఖ్కా ఉన్నత చదువుల కొరకు పట్టణం వెళ్ళిన తన కొడుకుని తిరిగి ఊరికి తీసుకురావడానికి ఇష్టపడడు. అంతేకాకుండా ఎన్ని అవరోధాలు, అడ్డంకులు ఎన్ని వచ్చినా కూడా తన కొడుకుని చదివించే తీరుతాను అని సుఖ్కా శపథం పూనుతాడు. దానికోసం ఎవరిని ఎదిరించడానికైనా సిద్ధపడతాడు. దాంతో ఆగ్రహించిన ఊరి పంచాయితీ పెద్దలు సుఖ్కాను వెలి వేస్తారు. పాత బకాయిల సాకుకింద ఇల్లును, పొలాన్ని జప్తు చేస్తారు. దాంతో ఊర్లో జీవనాధారం కోల్పోయిన సుఖ్కా రమియా దంపతులిద్దరూ పక్కనే ఉన్న టౌనుకు వెళ్లి అక్కడ కూలినాలి చేసుకుని బ్రతుకీడుస్తారు. ఆంక్షల పేరుతో దళితుల్ని సామాజికంగా వెలేయడం కొత్త కాదు. ఇది తరతరాలుగా కొనసాగుతున్న ఒక భయానక సామాజిక రుగ్మత. కాని ఇన్నేళ్ళ తర్వాత కూడా ఎంతో కొంత ప్రగతిని సాధించాక కూడా ఇంకా ఈ వెలి వేతలు, కుల బహిష్కరణలు ఇంకా ఆగకపోవడం అత్యంత బాధాకరం. నవలలో సుఖ్కా, రమియాకు జరిగిన ఈ వెలివేత సంఘటన ఇంకా మారని ఆధునిక భారతీయ సమాజంలో కులం, కట్టుబాట్లు, నియమాలు అంటూ వెలివేత అనే అమానవీయ చర్యలు ఇంకా సజీవంగా కొనసాగుతున్నాయి.

డా.బి.ఆర్.అంబేద్కర్ గారు దళితుల ఆలోచన విధానాన్ని పూర్తిగా మార్చారు. అంటరానితనం, అస్పృశ్యత, బానిసత్వం మన తలరాత అన్న భావనను అంబేద్కర్ గారు తిరస్కరించారు. ఈ వివక్షలకు వ్యతిరేకంగా పోరాటాన్ని సాగించారు. అంతేకాకుండా ఈ వివక్షల వెనక ఉన్న ఆధిపత్య కులాల కుట్రలను, నిచ్చెనమెట్ల కుల వ్యవస్థ నియంతృత్వ ధోరణులను ఆధారాలతో సహా బయటపెట్టి బాధిత సమాజం కళ్ళు తెరిపించడంలో సఫలం అయ్యారు. తన రచనలు, ఉపన్యాసాలు, పత్రికా వ్యాసాలతో ప్రజలలో ఉన్న మూఢత్వాలను, అజ్ఞానాన్ని రూపుమాపేందుకు కృషి చేశారు. భారతీయ దళిత సాహిత్యానికి, దళిత సమాజానికి నూతన లక్ష్యాలను, చేయాల్సిన పోరాటాలను నిర్దేశించి ఆ వైపుగా ప్రజలను ప్రేరేపించిన మహోన్నత వ్యక్తి బాబా సాహెబ్ డా. బి.ఆర్ అంబేద్కర్. ఆయన




ఆశయాల ప్రతి రూపంగానే సుఖ్కా రమియాల కుమారుడు చందన్ ఈ నవలలో అసమానతలను, కుల మత భేదాలను నిర్మూలించే కథానాయకుడిగా మనకు కనిపిస్తాడు.

ఢిల్లీ పట్టానికి వెళ్ళిన చందన్‌కు హరియ అనే ఒక వృద్ధుడు తన ఇంట్లో ఉండటానికి గదిని ఇస్తాడు. అందుకోసం ఎటువంటి కిరాయి ఇవ్వాల్సిన అవసరం లేదు అంటాడు. అనేక ఆశలతో పట్టణానికి వెళ్లిన చందన్‌కు అక్కడ భంగపాటు ఎదురవుతుంది. గ్రామాలలో మాదిరిగా పట్టణాల్లో కుల మత భేదాలు ఉండవని, ఉన్నవాళ్ళు లేని వాళ్ళు అనే తారతమ్యాలు ఉండవని అనుకుంటాడు. కాని గ్రామాల్లోలాగే పట్టణంలో కూడా వివక్ష, దోపిడీ, అణచివేతలు ఉంటాయని తెలిసి ఒకింత నిరాశకు గురవుతాడు చందన్. అక్కడకి వెళ్ళిన చందన్ అక్కడ ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని అనుకుంటాడు. అక్కడ రకరకాల పనులు చేసుకుని జీవనం కొనసాగించే వివిధ నిమ్న కులాల శ్రామికుల పిల్లలకు చదువు చెప్పించాలని నిశ్చయించుకుంటాడు. మూఢనమ్మకాల పట్ల కూడా అక్కడి ప్రజలను జాగృతం చేసే ప్రయత్నం చేస్తాడు. వర్షాకాలం మొదలు అయినప్పటికీ వర్షాలు పడకపోవడంతో అక్కడ ఉండే కొంతమంది ప్రజలు యజ్ఞయాగాలు చేయాలని నిర్ణయించుకుంటారు. ఆ క్రమంలో తన వద్దకు చందా కోసం వచ్చిన వాళ్ళతో చందన్ ఇలా అంటాడు **"యజ్ఞం, యాగం అన్ని వ్యర్థం, అంతా మోసం, వంచన దీనివల్ల ఒరిగేది లేదు. ప్రపంచంలో దేవత, భగవంతుడు లేడు. అందుకే వర్షాలు కురిపించడానికి సాధ్యం కాదు"** చందన్ మాటలు విన్న చందాదారులు చందన్ మాటలు ధిక్కరిస్తారు. చందా ఇస్తే ఇవ్వు లేకుంటే మానేయ్ అని అంతే కాని దేవుడు లేడని నాస్తికుడిలా మాట్లాడకు అంటారు. దాంతో వాళ్లను మరింత జాగృతం చేయడానికి మళ్ళీ ఇలా అంటాడు. **"మీ పిల్లలు రోజంతా మట్టిలో ఆడుతూ తిరుగుతారు. వాళ్ళ భవిష్యత్తు గురించి ఆలోచించండి. వాళ్ళ కోసం స్కూల్ ప్రారంభించవచ్చు. వీధి, వాడలు ఎంత అధ్వాన్నంగా ఉన్నాయి. కొద్దిపాటి వర్షానికే గుంతల్లో నీళ్ళు.**

**వీటిని బాగు చేయవచ్చు. ఇంట్లో ఉండే మహిళలకు కుట్టు పని ఏర్పాట్లు చేయవచ్చు."** ఈ విధంగా తన జ్ఞానపూర్వకమైన మాటలతో వాళ్ళలో ఉన్న అజ్ఞానాన్ని దూరం చేసే ప్రయత్నం చేస్తాడు. ఆ తదనంతరం అక్కడి బస్తీ పిల్లలకోసం ఒక చిన్న పాఠశాలను ఏర్పాటు చేసి అందరికి విద్యను అందిస్తాడు. ఆ సందర్భంలో అక్కడి స్కూల్లో తన కుమారుణ్ణి చేర్పించడానికి వచ్చిన కమలతో పరిచయం ఏర్పడుతుంది. కమల ఒక సాముహిక బలత్కారానికి గురి అయిన బాధితురాలు. ఆ సాముహిక బలాత్కారం కారణంగా ఒక కుమారునికి జన్మనిస్తుంది. వాడి పేరు కిల్లర్. ఈ క్రమంలోనే కమలకు జరిగిన అన్యాయాన్ని తెలుసుకుంటాడు చందన్. కమల తల్లితండ్రులు ఇటుక బట్టిలో పని చేస్తుంటారు. ఒకసారి అనుకోకుండా ఇటుకబట్టీలు మీద పడి గర్భిని అయిన కమల తల్లి చనిపోతుంది. కొద్ది రోజుల తర్వాత ఒకసారి అక్కడికి వచ్చిన ఇటుక బట్టి ఓనర్ తన స్నేహితులతో కలిసి సాముహిక అత్యాచారం చేస్తాడు. ఆ తర్వాత కేసు కాకుండా ఉండడంకోసం డబ్బుతో అందరు అధికారులను కొనేస్తాడు. దాంతో కమలకు న్యాయం దక్కక పోగా న్యాయం కోసం వెళ్ళిన తన తండ్రిని పోలీసులు అమానుషంగా కొడతారు. ఒక పక్క అధికారుల జులుం, చుట్టు పక్కల వాళ్ళ సూటి పోటి మాటల కారణంగా ఎంతో ఆవేదన చెందిన కమల తన తండ్రికి చెప్పాపెట్టకుండా ఊర్లోంచి వెళ్లిపోతుంది. దాంతో మరింత క్రుంగిపోయిన తండ్రి తన కూతురి జీవితం పాడు చేసినవాళ్లలో ఒకడిని చంపి తన పగను తీర్చుకుంటాడు. ఆ తర్వాత జైలుకు వెళ్లిన కొంత కాలానికి సరైన సాక్ష్యాలు లేని కారణంగా బయటికి వచ్చి ఢిల్లీలోని జే.జే కాలనీలో ఉంటాడు.

ఓ పక్క చదువు, ఇంకో పక్క సామాజిక పోరాటం నిత్యం ఏదో ఒక కార్యక్రమంతో చందన్ మునిగి తేలుతుంటాడు. తన పి.జి చదువు పూర్తి చేసి, పిహెచ్.డి చేయాలి అనుకుంటాడు. కాని కొన్ని ఆర్థిక ఇబ్బందుల వల్ల పరీక్ష ఫీజు కట్టలేక ఇబ్బంది పడుతుంటాడు. చందన్ బాధపడటం చూసిన హరియా విషయం కనుక్కుని పరీక్ష ఫీజు కట్టడానికి సిద్ధపడతాడు. **"నీవొక్కడివే సమాజం కోసం ఎంతో చేస్తున్నావు. నేను చదువుకోలేదు సత్తువ తగ్గిన ముసలోడ్ని. నీవు చేస్తున్న గొప్ప పోరాటంలో కలిసి నడవలేను. నేను కూడా ఏదైనా చేయాలి. అది నా నైతిక బాధ్యత. నేనా నీకు ఎక్కువ చేయలేను. కాని ఈరోజు నుంచి నీ ఖర్చులన్నీ నేను భరిస్తాను"** అంటూ తనకున్న సామాజిక స్పృహను, బాధ్యతను వ్యక్తపరిచి చందన్ ఆత్మవిశ్వాసాన్ని పెంచుతూ, తన పోరాటానికి మరింత మద్దతుగా ఉంటాను అని మాటిస్తూ మళ్ళీ ఇలా అంటాడు **"తెలుసు కదా బిడ్డ. నాకు తాగే వ్యసనం ఉంది. నా సంపాదనలో ఎక్కువ భాగం మందుకే ఖర్చు చేస్తాను. అయితే ఈ రోజు నుంచే నేను తాగడం మానేస్తాను"** మార్పులు సులభంగా రావు దానికోసం త్యాగాలు చేయాలి, పోరాటం చేస్తున్న వారికి అండగా ఉంటూ కావాల్సిన మద్దతును ఇవ్వాలి. 'అవతలి గుడిసెలోని హరియా పాత్ర ద్వారా దళిత సమాజంలో వ్యసనాలకు బానిసయ్యి తమ బ్రతుకులను, కుటుంబాలను మరింత కష్టాలలోకి నెడుతున్న వాళ్లకు సందేహంగా ఉంటుంది. హరియా కష్టజీవి తన జీవితంలో జరిగిన విషాదాన్ని మర్చిపోలేక నిత్యం కుంగిపోతు ఉంటాడు. అలా చీకటిమయం అయిన హరియా జీవితంలోకి చందన్ రావడంతో ఒక కొత్త జీవితం మొదలైనట్టు అనిపిస్తుంది. అన్ని బాధలను మర్చిపోయి ఆనందంగా ఉంటాడు. అందుకే చందన్ కోసం తనకున్న మద్యం అలవాటును మానేందుకు సిద్ధమవుతాడు. ఇలా హరియ చందన్‌కు ఆర్థిక పరమైన అవసరాలను తీరుస్తూ పోరాటంలో భాగం అవుతాడు. ఇంకో పక్క కమల సైతం చందన్ సామాజిక పోరాటంలో ప్రధాన పాత్ర పోషిస్తూ ఎవ్వరు కూడా చేయని త్యాగం చేసి సమ సమాజ స్థాపన పోరాటానికి జీవం పోస్తుంది.

మరోవైపు ఏ లక్ష్యంతో సామాజిక ఉద్యమాన్ని ప్రారంభిస్తాడో కాలాంతరంలో ఆ ఉద్యమం లావాలా వ్యాపించి అనేక గ్రామాల్లో మార్పులు మొదలౌతాయి. తన గ్రామం అయిన మాతాపుర్ కూడా ఈ మార్పులకు కేంద్రం అవుతుంది. చందన్ చిన్ననాటి మిత్రురాలు, హర్నాం సింగ్ గారాల కూతురు రజని ఈ మార్పుల్లో ప్రధాన పాత్ర పోషిస్తుంది. అంతేకాకుండా తన తండ్రి మనసును కూడా మారుస్తుంది. ఇల్లు, పొలం కోల్పోయి పొట్టకూటి కోసం పక్క ఊరికి వలస వెళ్ళిన చందన్ తల్లి తండ్రుల బాగోగులు కూడా తానే చూసుకుంటుంది. అటు చందన్ కుటుంబ బాధ్యతతో పాటు, మాతాపూర్ చుట్టూ పక్కల గల గ్రామాల్లో సామాజిక ఉద్యమానికి, కుల నిర్మూలన పోరాటానికి విస్తృత ప్రచారం కల్పించి, అక్కడి ప్రజల్లో చైతన్యాన్ని నింపి చందన్ యొక్క మహాసంకల్పానికి కొండంత అండగా ఉంటుంది. ఉన్నత చదువులు చదువుకుంటూ, పట్టణంలో ఉంటూ సమాజంలో మార్పులు కోరుకుంటూ, మానవత్వం, తెగింపు, ధైర్యం ఆధునిక భావాలు కలిగిన వ్యక్తిగా రజని పాత్ర మనకు ఈ నవలలో కనిపిస్తుంది. అంతేకాకుండా రాజ్యాంగాన్ని గౌరవిస్తూ, రాజ్యాంగం కల్పించిన హక్కులు, అధికారాలు అట్టడుగు కులాలకు దక్కాలనే ఆలోచన విధానాన్ని కలిగి ఉంటుంది. వాటికోసం పోరాటాలు చేసే వాళ్ళకు తన మద్దతు ఇస్తుంది. సమాజంలో తక్కువ, ఎక్కువ అనే భేదాలు ఉండాలని, దళితలు దళితులుగా, శ్రామికులు, శ్రామికులుగానే ఉండాలి అని అలా ఉండడంలోనే మన ఉనికి, మన సంపదకు రక్షణ ఉందని భావించే తండ్రి ఠాకూర్ హర్నాం సింగ్‌తో వాదిస్తూ ఇలా అంటుంది **"మన స్వార్థం కోసం ఇతరులను బలి చేయడం మంచిది కాదు. వ్యక్తి అయినా, వర్గం అయినా స్వతంత్రంగా, స్వావలంబనంతో జీవించాలని కోరుకుంటారు. పేదరికంలో బ్రతకాలని ఎవరు అనుకోరు. దోపిడీ జీవితాన్ని ఎవరు కూడా కోరుకోరు. కాలం మారుతుంది. ప్రజలు తమ హక్కులను తెలుసు కుంటున్నారు. దళితులు, పీడితులు అన్యాయం, దోపిడీ**

**సంకెళ్ళ నుండి విముక్తి పొందడం కోసం తపిస్తున్నారు. పట్టణాల్లోని ప్రజలలో ఇలాంటి చైతన్యం చాలా వేగంగా వస్తుంది. దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలు ఐక్యం అవుతున్నారు. సమాజం మెల్లిమెల్లిగా ఒక ఉద్యమం రూపు దాలుస్తుంది".**

దాదాపు 26 సంవత్సరాల క్రితం రాసిన ఈ 'అవతలి గుడిసె' నవలలోని పై ఉదంతం నేటికి ప్రాసంగికమే. దేశంలో మహిళలపై, చిన్న పిల్లలపై అనేక అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయి. నిర్భయ, దిశా లాంటి ఎన్ని చట్టాలు వచ్చినప్పటికీ ఈ అత్యాచారాలు ఆగడం లేదు. అత్యాచారాలు జరిగినప్పుడు కులాన్ని బట్టి, హోదాలను బట్టి స్పందించే విధానాన్ని కూడా మనం చూస్తూనే ఉన్నాం. రచయిత ఈ నవలలో అన్ని ఆధిపత్యాలతో పాటు పురుషాధిక్యతను కూడా ప్రశ్నించాడు. అంతే కాకుండా ఈ నవలల్లో మూడు బలమైన స్త్రీ పాత్రలను మనముందు ఉంచాడు. అందులో ఒకటి కమల రెండు చందన్ తల్లి రమియా మరియు అతని బాల్య స్నేహితురాలు రజిని. ఈ విధంగా ఒక ప్రజాస్వామ్యవాదిగా, మానవ అధికారాలను గౌరవించి, అణచివేతకు గురి అవుతున్న వాళ్ళ హక్కులకు భంగం వాటిల్లే విధానాన్ని రజని తిరస్కరిస్తూ తనలో ఉన్న సమానత్వ భావనలతోనే పోరాట పంథాను కూడా ఎంచుకుంటుంది.

ఈ నవలలో చందన్ ఒక జ్ఞానవంతమైన సమాజాన్ని నిర్మించాలని అనుకుంటాడు. అందులో భాగంగానే పాఠశాలను ప్రారంభించిన చందన్ పట్టణంలోని అనేక మంది పిల్లలకు విద్యను బోధిస్తాడు. అందుకోసం తన మిత్రుల సహాయం తీసుకుని బాబా సాహెబ్ చెప్పిన బోధించు.. పోరాడు... సమీకరించు అన్న సందేశాన్ని ఆచరించి చూపిస్తాడు. ఏ విద్య లేని కారణంగానైతే దళిత సమాజం వేల ఏండ్లపాటు వెనకబాటుతనానికి, అణచివేతకు, వివక్షకు, దోపిడీకి గురైందో ఆ విద్యను అందరికీ అందించాలనే సంకల్పంతో ఒక ఉద్యమంగా తన ఆశయాన్ని ముందుకు తీసుకువెళతాడు చందన్. అందరికి విద్య అందినప్పుడు వాళ్ళ హక్కులకోసం, అధికారంకోసం కొట్లాడే జ్ఞానాన్ని, సత్తువను అందించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తాడు.

తెలుగులో వచ్చిన అనేక నవలలు దళిత జీవితాన్ని, వాళ్ళు ఎదుర్కొంటున్న వివక్షను, దోపిడిని, సమానత్వాన్ని సాధించేందుకు చేస్తూవస్తున్న ఉద్యమ ఘట్టాలను సైతం కొన్ని నవలల్లో చిత్రీకరించారు. ఇతర భాషల నుండి మరీ ముఖ్యంగా హిందీ సాహిత్యపు మొట్టమొదటి దళిత నవలను తెలుగు పాఠకులకు అనువాద రూపంలో అందించడంలో గల ఉద్దేశం ఉత్తర భారతంలోని దళితుల దీన స్థితిని, వాటి నుండి విముక్తి పొందేందుకు చేసే జ్ఞానవంతమైన శాంతియుత పోరాటాన్ని, విద్యనూ ప్రధాన ఆయుధంగా చేసుకుని చేస్తున్న ఉద్యమ కథా వస్తువు కలిగిన ఈ నవలను మనకు అందించడంలో భాగంగా చేసిన ప్రయత్నంగా చూడాల్సి ఉంటుంది. తల్లి తండ్రులు సుక్కా రమియా చిన్ననాటి మిత్రురాలు రజని, కమల మరియు హరియా అందరు కూడా చందన్ చేస్తున్న సామాజిక పోరాటంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా భాగం అవుతూ తను అనుకున్న లక్ష్యాన్ని సాధించడంలో తోడ్పాటు అందిస్తారు.

**ముగింపు :**

జయప్రకాష్ కర్దం గారు 'అవతలి గుడిసె' నవల ద్వారా దళిత సమాజంలో వస్తున్న చైతన్యవంతమవుతున్న మార్పులను, దళిత సమాజం చేస్తున్న నిరంతర సామాజిక పోరాటాలను, ఆధిపత్య కులాల ద్వారా ఎదుర్కొంటున్న అన్ని రకాల ఆటుపోట్లను, వివక్షకు అడ్డుకట్ట వేస్తున్న విధానాన్ని సరళమైన భాషలో వివరించడం జరిగింది. ఏ గ్రామంలో అయితే అంటరానితనాన్ని, కుల పరమైన అంతరాలను పాటించడం, ధార్మిక సందేశంగా భావిస్తారో అదే గ్రామంలో అన్ని కులాల వాళ్ళు ఎటువంటి భేదభావాలు లేకుండా, అన్ని తారతమ్యాలను వీడనాడి కలిసి మెలిసి ఉండేలా మార్పు చెందడం ఈ నవలలో కథానాయకుడు సాధించిన గొప్ప విజయంగా చూడవచ్చు. దాంతో పాటు కలిసి కూర్చోవడం, కలిసి భోజనాలు చేయడం లాంటి మార్పులను మనం ఈ నవలలో గమనించవచ్చు. అంతేకాకుండా మనం గమనించాల్సిన ముఖ్యమైన విషయం ఏంటి అంటే ఏ వ్యక్తి అయితే ఈ నవలలో కథానాయక పాత్ర పోషించి సమ సమాజ స్థాపనకు నడుము బిగించాడో, ఏ వ్యక్తి అయితే కుల మత భేదాలను. అంధకారాలను రూపుమాపాడో ఆ వ్యక్తి దగ్గర ఉన్న ఒకే ఒక ఆయుధం చదువు. ఆ చదువే తను స్వాప్నించిన సమాజాన్ని స్థాపించడంలో కీలకంగా మారుతుంది. చదువే సమాజంలో ఉన్న అన్ని విధాల రుగ్మతలను రుపుమాపుతుంది అని నిరూపించడం మనం చూడవచ్చు. అందులో భాగంగానే ఊరి పెద్ద ఠాకూర్ హర్నాం సింగ్ సైతం తనలో ఉన్న ఆధిపత్య భావాలను అన్నిటిని త్యజించి మాతాపూర్ గ్రామంలోని ప్రజలతో కలిసి మెలసి ఉంటూ ఇంతకాలం ప్రజల శ్రమతో కూడబెట్టిన సంపదనంతా ప్రజలకు పంచి పెడతాడు. కుల కట్టుబాట్లు, శాస్త్రం పేరుతో జప్తు చేసి తీసుకున్న భూములను, ఆక్రమించిన ఎవరి ఇళ్ళను వాళ్లకు పంచి పెట్టి సమజాభివృద్ధికి తోడ్పాటును అందిస్తాడు. సమానత్వ సమాజ స్థాపనలో తనవంతు పాత్రను పోషిస్తాడు.

భారతీయ దళిత నవలల్లో ఇదొక ఆణిముత్యం లాంటి నవల. అందుకే దేశ వ్యాప్తంగా ఉన్న అనేకమంది పాఠకుల మన్ననలు పొందడమే కాకుండా ఎన్నో పురస్కారాలను అందుకుంది. దళితుల యథార్థ జీవితాలను చిత్రించిన ఈ నవలలో బుద్ధుడు, పూలే, అంబేద్కర్ లాంటి మహనీయుల ఆలోచనా విధానానికి ప్రచారం కల్పించిన నవలలాగా కూడా 'అవతలి గుడిసె' ప్రసిద్ధి చెందింది.

# శతజయంతి సాహితీమూర్తుల కెత్తిన పతాకశ్రీ

**డా. శ్రీరంగాచార్య,** హైద్రాబాద్, ఫోన్ : 9502333175

ఆచార్య ఎస్వీ రామారావు విమర్శారంగంలో ప్రఖ్యాతులై, అనేకానేక నూతన విషయావిష్కరణలతో బహువిధ సాహిత్య చరిత్రలనందించిన నిరంతర సాహిత్య పరిశోధనా వైభవులు. తెలుగువారికి సమగ్ర సాహిత్య చరిత్ర లేదనే అపప్రథను దూరం చేసిన శ్రీ రామారావుగారి చింతన కాల పరిశోధనా గ్రంథం **'శతజయంతి సాహితీమూర్తులు'.** దీనిలో వీరు తెల్పిన తెలంగాణ రచయితలు-48, పరిశిష్టం-51; రాయల సీమ-20, పరిశిష్టం-6; ఉత్తరాంధ్ర-48, పరిశిష్టం-8; దక్షిణదేశం - 12. ఇక రచయిత్రుల్లో తెలంగాణ-5, ఉత్తరాంధ్ర 1, దక్షిణదేశం 2. ఇదీ స్థూలంగా వీరు విభాగించుకొనిన ఒకనాటి సకలాంధ్రదేశ శతవర్ష సాహితీమూర్తులు. గ్రంథం చివర్లో అకారాది క్రమంగా గ్రంథస్థ రచయితల / కవుల సూచిక చేర్చినారు. వీరి యీ రచనకు సాహితీలోక సుప్రసిద్ధులు శ్రీమాన్ కోవెల సుప్రసన్నాచార్యులుగారు సంక్షిప్తంగా అభినందన వ్రాయటం ఆనందదాయకం.

కేవలం ఒక్క తెలంగాణ వారిని గూర్చి వ్రాస్తే అది సంక్షిప్తమై, ఇతర ప్రాంత సాహితీమూర్తులను గురించి తెలుసుకునే అవకాశం కల్గదనే భావంతో ఒకనాడు మనం వ్యవహరించిన కోస్తా, రాయలసీమ, ఉత్తరాంధ్ర, దక్షిణదేశ నామాలతో ఆ ప్రాంతంవారిని పరిచయం చేసినారు. దీనివలన గ్రంథ విషయ సమగ్రత ఏర్పడి వివిధ ప్రాంత పాఠకుల సమాదరణ పొందే అవకాశం ఏర్పడింది. గ్రంథకర్త దీని చివర్లో 'సమీక్ష' వ్రాసి ఎన్నో విషయాలను తెల్పటం వలన గ్రంథంలోని సంక్షేపత్వానికి జవాబు లభించింది. అయితే చివర్లో యిచ్చిన ఉపయుక్త గ్రంథాలు శీర్షికలో వీరికి బాగా వుపయోగపడిన గోలకొండ కవుల సంచిక పేరు తప్పిపోయింది. దీనితో పాటు నల్లగొండ కవులు పండితులు... ఇట్లే మరికొన్ని వున్నాయి.

ఈ పుస్తకంలో వివరించబడిన కొందరు కవులు, పండితులను గూర్చి వివిధ విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు జరిపి డాక్టరేట్లు పొందినారు. ఐనా ఎవరి రీతి వారిది గదా! రాయలసీమ వారిని గురించినప్పుడు 'కవిత్వ వేది' మారు పేరుతో సాహిత్య చరిత్ర వ్రాసిన నారాయణరావుగారు చేరలేదు. ఇటీవల మూసీపత్రికలో ఘట్టమరాజు వారు వీరిని గూర్చి తెల్పినారు. 4వ పుటలోని ఫోటో ఎవరో స్మార్త పండితునిది. అక్కడ హెూసదుర్గంవారున్నారు. 129వ పుటలో వున్నది గడియారంవారి ఫోటోయేనా? శ్రీయుత ఎస్వీ రామారావుగారు ఈ గ్రంథంలో ఎందరి చిత్ర పటాలనో సేకరించి వేయటం భవిష్యత్తుకొక సాహితీమూర్తుల నిధి వంటిది. వీరు పరిశిష్టం పేర సూచించిన కవులయందు విస్తృత చరిత్ర గలవారున్నారు. 53వ పుటలో సరిపల్ల విశ్వనాథశాస్త్రి అన్నారు. అది 'సరిపల్లి' కావలెను. గ్రంథకర్త తన ప్రవేశికయందు 'ఈ మార్గంలో ఇంతకుపూర్వం కొన్ని రచనలు వెలువడ్డాయి కాని అవి సమగ్రమైనవి కావు" అనే ఈ వాక్యాన్ని విశ్వసించే వారెందరో కాని 'సాహిత్య చరిత్రలు ఎప్పటికప్పుడు మార్పులు చేర్పులతో పునర్వివేచన దిశలో సాగటం అవసరం అనేది యదార్థం. దీనికుదాహరణగా ఈ గ్రంథకర్త వివిధ సాహిత్య చరిత్రలతో పాటు ఈ 'శతజయంతి సాహితీమూర్తు'లొక ఉదాహరణ.

కొండ యద్దమందు కొంచమైయున్న విధంగా అగాధ విషయ సముపేతులైన ఎందరో దీనియందు ఒక పుటలో ఇరికినారు. (సంక్షేపించటం ఒక కళ గదా) శతవర్ష సముపేతులైన మన సాహిత్య మూర్తులను గమనించి విషయ సేకరణ చేసి ఒక క్రమ పద్ధతిలో వారిని చేర్చి ముఖ్య విషయాలను పాఠకజన రంజనం గావించిన రామారావు గారి కృషికి సాహిత్యాక్షర రూపాన్ని కల్పించి శ్రమతో ప్రకటించిన నీల్‌కమల్ ప్రచురణ సంస్థ అధిపతి సురేశచంద్ర శర్మగారు శాశ్వత అభినందనీయులు.

అందమైన ముద్రణ, మంచి కాగితం. ఆకర్షణీయ ప్రచురణ. గ్రంథం చివరలో రామారావుగారిట్లు వ్రాసినారు. **"నేను వ్రాసినదే తుది వాక్యం అన్న భావంతో నేను పుస్తకాలు వ్రాయను. వాటికి కొనసాగింపుగా మరిన్ని గ్రంథాలు రావాలని ఆకాంక్ష".** ఇది సత్యం.

**శతజయంతి సాహితీమూర్తులు**
**రచయిత : ఆచార్య ఎస్వీ రామారావు**
**పేజీలు : 275, వెల : 450**
**ప్రతులకు : నీల్‌కమల్ బుక్ హౌస్.**



ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 12 (59) హైదరాబాద్ అక్టోబర్ : 2022

# 'జీవితం ఒక నాటక రంగం' నవలా దర్శనం

**తుళ్ళూరు రవి,** పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, హైదరాబాద్ విశ్వ విద్యాలయం. ఫోన్ : 9959977393

గుజరాతీ సాహిత్యంలోని 1985లో "మానవినీ భావై" నవలకి పన్నలాల్ పటేల్ జ్ఞానపీఠ పురస్కారం పొందారు. "జీవితం ఒక నాటక రంగం" అనే పేరుతో వేమూరి ఆంజనేయశర్మగారు తెలుగులోకి అనువాదం చేశారు. కనీసం పూట గడవని కుటుంబంలో పుట్టి, భారతదేశంలోని అత్యుత్తమ పురస్కారం జ్ఞానపీఠం దక్కించుకోవడం గొప్ప విశేషం.




ఓ రైతు యాభై సంవత్సరాల వయసులో గడచిన జీవితాన్ని గుర్తు చేసుకుకోవడం ఇతివృత్తంగా సాగుతుంది ఈ నవల. కాళా జీవితం ఎన్నో చిత్ర విచిత్ర మలుపులతో సాగడమే కాకుండా దీనితో ముడిపడి ఉన్న ఆ కాలం నాటి పరిస్థితులు పేదరికం, కరువుల భయంకర సన్నివేశాలు ఈ నవల చదివే పాఠకుడిని కట్టి పడేస్తాయి. ఈ సమాజంలోని ఎంతోమంది జీవితాలవలే అతని జీవితంలో కూడా ప్రేమ, విరహం, బంధువుల ద్వేషం, దరిద్రం అతిహీనస్థితిని అనుభవించాల్సి వచ్చింది.

వాలాభాయి పటేల్ కు అరవై ఏళ్ళ వయసులో కాళా జన్మించాడు. కాళా కంటే ముందు పుట్టిన పిల్లలెవ్వరు బతకడానికి నోచుకోలేదు. బిడ్డకు అన్ని ముచ్చటలు తీర్చగల శక్తి తండ్రి దగ్గర లేదు. కానీ కాళాను ఒళ్ళో కూర్చోపెట్టుకుని ప్రపంచాన్ని తన మాటలతో పరిచయం చేశాడు. ఈ పాఠాలే అతనికి యాభై ఏళ్ళదాకా నడవడానికి తోడ్పడ్డాయి.

ఆ రోజుల్లో ఆచారం ప్రకారం పిల్లవాడికి మూడేళ్ళు నిండకుండానే పెళ్లి కూతురిని చూసి పెళ్లి నిశ్చయం చేసుకోవాలి. అలా పిల్ల దొరకపోతే అది ఎంతో పెద్ద అవమానంగా భావించేవారు. తండ్రిలేని కాళాకు పేదరికం కారణంగా ఎవరు పిల్లనిచ్చేవారు లేరు. దీనిని చిన్నతనంగా తీసుకొని పినతల్లి మాలి తన కొడుకులిద్దరి కంటే తక్కువ చేసి మాట్లాడుతుండేది. కాళాకు ఇటువంటి అవమానాల నుంచి పూలీ అనే మంత్రగత్తె రూపంలో దైవంగా ఆ తల్లీ కొడుకులకు అండగా నిలిచింది. పూలీ నిజానికీ మంత్రకత్తె కాదు. ఆ పల్లె ప్రజలను భయంతో ఉంచడానికి అలా ఉండేది. ఈమె పేదల పక్షాన నిలబడి మంచి పనులు చేస్తూ, కాళాకు పెద్దింటి పిల్లని చూసి పెళ్లికి నిశ్చయిస్తుంది. కాళా, రాజు కలసి చిన్నతనంతో ఆ గ్రామంలో కలసిమెలసి ఆనందంగా పిల్లలతో ఆడుకుంటూ జీవనం గడుపుతుంటారు. తొలకరి వస్తుంది.

ఆ గ్రామంలో రైతులందరూ అరకలు కట్టి దున్నడం ప్రారంభిస్తారు. రూపా పొలంలో అరక దున్నడానికి మగాళ్ళు ఉండరు కాళా ఇంకా చిన్నవాడు. మరిదిని తోడికోడలు రానివ్వదు. ఆమెకి ఏమి చేయాలో తోచక సాహసించి పిల్లవాడిని తీసుకొని అరక్కి ఎడ్లను కట్టి పొలం దున్నడం మొదలు పెట్టింది. తొలకరిలో పొలం దున్నకుండా వదిలేస్తే అది ఆ పల్లెలో పెద్ద అనాచారం అవుతుంది. అందుకే ఆమె అరక పట్టింది. ఆడమనిషి అరక పట్టి పొలం దున్నడం ఆ పల్లెలో కొత్తగా కన్పిస్తుంది. నిరక్షరాస్యులకు అలవాటుగా ఉన్నది తప్ప ఏది కొత్తది చేసిన తప్పుకిందే లెక్కేసి జనమంతా కలసి తప్పు పడతారు. ఎవరు నోరు తెరచి అడగరు కానీ తోడికోడలు మాలి ఒప్పుకోదు. రూపా చేసిన పనికి ఊళ్లో వర్షాలు పడవని, ప్రజలందరికి అరిష్టమని అంటూ ఊరంతా ప్రచారం అయ్యేలా చేస్తుంది. మొదట్లో ఎవరు నమ్మరుగానీ రోజులు గడిచే కొద్ది వర్షం కూడా పడదు. మరికొన్ని రోజులు గడచినా వానచుక్క రాదు ఊరంతా ఇదే కారణం అనుకోని స్త్రీ అరక పట్టడం పెద్ద మూఢనమ్మకంగా నమ్ముతారు.

ఆ గ్రామంలోని పెద్దలు పరిష్కారానికి మార్గం ఆలోచిస్తారు. రూపా కూడా పశ్చాత్తాపంతో దీనికి కారణం నేనైతే నేను ఆ పొలంలో మట్టిమీద పడుకొంటాను. నా మీద నుంచి ఎడ్లను నడిపించి అరకను తిప్పండి ఇదే నేను చేసిన తప్పుకి పరిహారం అంటుంది. ఊరంతా బాధపడుతూ పొలందగ్గరకి వెళ్తారు. పసివాడు కాళా నిస్సహాయంగా నిలబడి చూస్తూ ఉంటాడు. శిక్ష అమలు జరగబోతు ఉండగా ఇంతలో ఈశాన్య దిక్కునుండి మబ్బులు కమ్ముకొని మెరుపులతో కుంభవృష్టి వర్షం కురుస్తుంది. గ్రామ పెద్దలంతా ఆశ్చర్యపోతారు. ఈ సమాజంలో స్త్రీల మీద ఉన్న ఎన్నో ఆంక్షలను, మూఢనమ్మకాలను పన్నాలాల్ పటేల్ ఈ సన్నివేశంలో ఎక్స్‌రే తీసినట్టుగా ఇదంతా పెద్ద బూటకమని జనాల కళ్ళకు చూపించడం కన్పిస్తుంది.

కాళా పెద్దవాడై వ్యవసాయం చేస్తుంటాడు. పెళ్ళిచేసుకోవాలనే సమయంలో పినతల్లి తన కొడుక్కి రెండో భార్యగా చేసుకోవాలనే ఉద్దేశం మనస్సులో పెట్టుకొని వక్రబుద్ధితో రాజుని కాళాకు కాకుండా పక్కఊరిలో వేరేవ్యక్తితో సంబంధం కుదిర్చి పెళ్లి చేస్తుంది. చివరకు ఏమి తోచక భలీని కాళా ఇంటికి తీసుకొని వస్తాడు. ఇష్టంలేక కాళా భలీని పట్టించుకోపోవడంతో విసిగి పుట్టింటికి వెళుతుంది. కాళా అన్ని పనులు చేసుకోలేక విసిగిపోయి భలీని ఇంటికి తీసుకొచ్చుకొని జీవితం ఏదోక విధంగా గడుపుతున్న సమయంలో రాజు భర్తకి ఆరోగ్యం క్షీణించిదనే విషయం తెల్సి ఆమెపై ఉన్న అభిమానంతో ఆమె కుటుంబానికి కూడా అండగా ఉంటాడు. భలీకి కోపంవచ్చి వారిద్దరి మధ్య సంబంధాన్ని అనుమానిస్తే కాళా ఒక చిరునవ్వు నవ్వి "నువ్వనుకునే సంబంధం కాదు. కానీ ఆమెతో ఉన్న సంబంధమే నన్ను జీవింపజేస్తుంది." ఇక్కడ కవి మానవుని జీవితంలో ఉండవలసింది ఆవేశం కాదు సర్దుబాటు చేసుకునే గుణం ఉండాలనేది తెలియజేశాడు.

రోజురోజుకి వర్షాలు లేకుండా పోయాయి. పొలాలు ఎండి పోవడం మొదలెట్టాయి. రైతులు ఎదురుచూపులకి ఋతువులు గడిచిన చినుకు లేకుండా పోయింది. ధాన్యం దాచుకున్నవారి దగ్గర అయిపోవడంతో కాళా ఇంటిలో దాచిన గింజలను భార్య కాదన్న సరే మనిద్దరమే కదా! మన తిండి తగ్గించుకుందాం అని అందరికి పంచి పెడతాడు. ఈ మాటలో కవి అందరిలో మనమనే సిద్ధాంతాన్ని బలపరుస్తూ రైతు బిడ్డలకు అవసరమైన గుండెధైర్యం చూపెట్టాడు.

ఆ గ్రామల్లో ప్రజలకు ఆకలి బాధకంటే దొంగల భయం ఎక్కువౌతుంది. అందువల్ల ఎటువైపు నుంచి ఎలాంటి ఆకలిదాడులు జరుగుతాయో తెలియని పరిస్థితిలో ఉన్నవాళ్ళకు ధైర్యం చెప్పి నాయకుడౌతాడు. ఆకలిబాధకి భిల్లులు పిశాచాల్లా మారిపోయి ఊళ్ళమీద పడి పశువులను అడవులకు తోలుకొనిపోయి పచ్చి మాసంతో కడుపు నింపుకోవడం చేస్తుంటారు. కాళా ఒకరోజు భిల్లులు వెంట తుపాకీ తీసుకొని వెళ్తే వాళ్ళు కన్పించరు. కొంత దూరం నడచి కొండెక్కి చూడగా పశువులను పీక్కుతినడం గమనించి నేను ఎందుకు వచ్చాననే విషయం మరచి వాళ్ళాకలిని చూసి ఈ ఆకలిని మరపించే శక్తి దేనికి లేదా? అంటూ ఆకలి బీభత్సం గురించి ఈ నవలలో వాపోయాడు రచయిత.

ప్రజలు దాచుకున్న ధాన్యాన్ని బందిపోటు దొంగలు దోచుకోవడం ఎక్కువై కొద్దికొద్దిగా సర్వం కోల్పోవడం జరిగింది. అలాంటి రోజుల్లో ప్రతి సంవత్సరం పన్నులు వసూలు చేసే ఠాకూర్ కూడా పన్నులు సంగతి మరిచారు. చివరకు స్మశానంగా మారక ముందే పక్కపల్లెలకు వెళ్ళిపోయారు. దేగడియా గ్రామంలో విష్టుభక్తులు అన్నదానం చెస్తున్నారని తెల్సి, రాజు భర్త, వాళ్ళిద్దరి పిల్లలని తీసుకొని వెళ్ళి క్యూలో నిలబడింది. ఐతే చాలామంది స్త్రీలు అక్కడకి చేరాక భర్తల్ని వదిలి తమదారి తాము చూసుకున్నారు. తిండి గింజలకోసం శరీరాలను అమ్ముకోవడం మొదలుపెట్టారు. ఇదంతా చూసి కాళాకు అర్థంకాని పరిస్థితి అయ్యింది.

అన్నదానం వరుసలో నిలబడమని రాజు అతన్ని బలవంతంగా తీసుకెళ్ళింది. కానీ అలా తినడం అతనికి ఇష్టంలేదు. తాను రైతుబిడ్డ కష్టించి పొలంలో పండించి పదిమందికి తిండి పెట్టగలవాడు. అలాంటివాడు పొట్టనింపుకోవడం ఒకరిముందు చెయ్యి చాచలేక పోయాడు. భూతాలలో కెల్లా మహాభూతం ఆకలి అని రాజు అంటే, కాదు చింత అని చెప్పి మళ్లీ కాళా ఇలా భిక్షమెత్తడమే. అది ఆత్మను కూడా హరిస్తుంది అంటాడు. సమాజంపట్ల రైతుకుండే మనోభావాన్ని ప్రపంచానికి తెలియాజేశాడు పన్నాలాల్ పటేల్.

జ్యేష్టం గడించింది. ఆషాఢం సగం గడచినా ఒక్క చినుకులేదు. రాజు, కాళా ఇద్దరూ చిక్కిపోయారు. భలీ కూడా ఏదో ఒక దారి చూసుకొని వెళ్ళిపోయింది. కానీ ఇక్కడ రాజు ప్రాణమంతా కాళా మీదనే. ఇక ఇద్దరూ మృత్యువు తప్పదని గ్రహించి ఆ ఊరి వదిలి ఒంటరిగా ఒకే చోటకెళ్ళి చచ్చిపోవాలనుకుంటారు. మానవ కుటుంబ సంబంధాలన్నీ ఆ కరువుతో తెగిపోయాయి. రాజు ఇద్దరి పిల్లలని వదిలి కాళాతో బయలుదేరింది. ఇద్దరూ మృత్యువుకి దగ్గరకు వెళ్ళిపోయి దాహంతో నాలుకలు ఎండిపోయిన దశలో ఆశ్చర్యంగా ఆకాశం మేఘాలతో నిండిపోయింది. వారి శరీరం నవచైతన్యాన్ని పులకరించి తొలకరి వర్షం కురవసాగింది. ఈ వర్షాన్ని చూసేసరికి కాళా మనస్సు ఎక్కడలేని ఆనందంతో నిండిపోయింది.

యాభై ఏళ్ళ తర్వాత కాళా గడచిన జీవితాన్ని నెమరువేసుకోవడం ప్రారంభించాడు. రాజు అతనికి ఎలాగూ దూరమైపోయింది. భార్య అయిన భలీతో ముగ్గురు పిల్లలు ఇద్దరు ఆడపిల్లలు, భార్య మరణించారు. కొడుకును దాయాది సన్యాసుల్లో కలిపేశాడు. కాళా ఇప్పుడు ఒంటరి జీవితాన్ని అనుభవిస్తూ ఎప్పుడు ప్రకృతి వైపుకి చూస్తూ గడుపుతుంటాడు.

రచయిత ఈ నవల్లో ప్రేమ కథ చుట్టూ ఉన్న జీవిత సమస్యలను, ఆర్థిక, సామాజిక కరువు అనేక కోణాలను సూక్ష్మదృష్టితో విశ్లేషించారు. కవి తన జీవితానికి కొంత దూరంగా ఉండి సమాజంలో జరుగుతున్న మానవుని జీవితాలను ఆకలి బాధలను, మృత్యువు వీటితో సమానంగా, ప్రేమలేని సంసారం తాలూకు వేదనను గమనించగలిగి మనిషి జీవితమంతా ఒక నాటకరంగం అనుకోగలుగుతున్నానని ఈ నవల ద్వారా పాఠకులకు తెలియజేశారు.




**మణిపూసల రామాయణం (కావ్యం)**
– టి. ఆశీర్వాదం
వెల : 200 /-
**ప్రతులకు :** శ్రీమతి శశికళ ఆశీర్వాదం,
4 – 143, 11/19/1, ఓం నగర్, కిస్మత్‌పూర్,
గండిపేట (మం) రంగారెడ్డి జిల్లా – 500086.
ఫోన్ : 90102 08191ద









**ఆణిముత్యాలు**
చౌదూరి నరసింహా రావు
వెల : 100/-
**ప్రతులకు :** చౌదూరి పద్మావతి, 504,
సాయి దుర్గా టవర్స్, ఎస్ఆర్‌కె పురం,
రోడ్ నెం. 3, కొత్తపేట, హైదరాబాద్.
ఫోన్ : 773 190 3333




**గాండ్ల మిట్ట (కథలు)**
– ఆర్.సి. కృష్ణస్వామి రాజు
వెల : 200 /-
**ప్రతులకు :** రచయిత, 22-4-71,
బ్యాంక్ ఎంప్లాయిస్ కాలనీ, మంగళం రోడ్,
తిరుపతి – 517 507
ఫోన్ : 939 366 2821




**34 గోఖలే రోడ్ నార్త్ (కథలు మరియు కవితలు)**
– డా. తాటి నరహరి
వెల : 150 /-
**ప్రతులకు :** 1604, బెల్లెజ్జా, 16వ ఫ్లోర్,
భవాని శంకర్ రోడ్, దాదర్ (పశ్చిమ)
ముంబై – 400 028.
ఫోన్ : 093 224 00 551




**జీవన ప్రవంతి**
– టేకులపల్లి గోపాల్ రెడ్డి,
లిప్యంతరీకరణ : ధూళిపాళ అరుణ
వెల : 450/-
**ప్రతులకు :** రచయిత, సిద్ధిపేట, తెలంగాణ
ఫోన్ : 8500 304 654

## మూసీ పబ్లికేషన్స్ వారి పుస్తకములు

**వివరాలకు : మూసీ మాసపత్రిక, 3-4-245/1, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్ -27, ఫోన్ - 27560616**

1. భారతదేశ చరిత్ర – సంస్కృతి (17భాగాలు 4,5 మరియు 7 నుండి 21 వరకు) రూ. 175/- ఒక్కొక్క భాగానికి రూ. 2875 - 00
2. బ్రాహ్మణ రాజ్య సర్వస్వము రూ. 1200 - 00
3. నల్లగొండ జిల్లా కవులు – పండితులు రూ. 350 - 00
4. మల్యాల వంశ చరిత్ర – శాసనములు రూ. 100 - 00
5. శాసన సంపుటి రూ. 150 - 00
6. కందూరు చోడుల శాసనములు – చరిత్ర – సంస్కృతిరూ. 100 - 00
7. షబ్నవీస్ శతజయంతి సంచిక రూ. 100 - 00
8. విజయనగర శాసనములు – సాహిత్య సాంస్కృతిక విశేషములు 90 - 00
9. త్రిపురాంతక దేవాలయ శాసనములు రూ. 75 - 00
10. పులిజాల రంగారావు సంక్షిప్త జీవిత చరిత్ర రూ. 75 - 00
11. దేవాలయ వాస్తుశిల్పము రూ. 50 - 00
12. మూసీ ద్వైవార్షిక ప్రత్యేక సంచిక రూ. 50 - 00
13. మూసీ 'తెలుగు సంస్కృతి' ప్రత్యేక సంచిక రూ. 75 - 00
14. 'సుచరిత' (బి.ఎన్.శాస్త్రి సంస్మరణ) ప్రత్యేక సంచిక రూ. 100 -00
15. మూసీ 'మన తెలుగు' ప్రత్యేక సంచిక రూ. 100 - 00
16. ఆంధ్రదేశ శాసన సాహిత్యంలో స్త్రీలు రూ. 175 - 00

## చిరునామా

**మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.**

చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా
సంపాదకుడు, మూసీ మాసపత్రిక,
ఇం.నెం. 2-2-1109/
బికె-ఎల్.ఐ.జి.10, బతుకమ్మకుంట,
బాగ్అంబర్‌పేట, హైదరాబాద్-500013.
చందాలకు ఆన్‌లైన్ అకౌంట్
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట,
హైదరాబాద్.
అకౌంట్ నెం. 52019740642
IFS Code : SBIN0020083
editormusi@gmail.com

# దుఃఖం లేనోడు



కవిత రాయాల్ననిపించి
ఈసారి దుఃఖం లేనోడి గురించి రాద్దమనుకున్న
నిజంగా దుఃఖం లేనోడుంటడా గీ ప్రపంచంల!
బుద్ధుడేం జెప్పిండు, దుఃఖానికి కారణం కోర్కెలే అన్నడు!
గది నిజమే! కోర్కెలున్నయి ఇగ దుఃఖమెందుకుండదు?
మరి కోర్కెలు లేకుంట బతుకుంటదా?
మరి కోర్కె లేకుంట దుఃఖం లేకుంట బతుకాల్నంటె
బుద్ధుడు గావాలె భర్తృహరి గావాలె,
వేమన గావాలె మనిషి ! అట్ల ఉన్నరా గిప్పుడు ఎవలైనా?
అంత కూడవెట్టుడే ! నాది, నావొళ్ళు, నావోళ్ళకు.
ఆఖరికి మిగిలేదేంది బూడిది !
ఇంక జ్ఞానోదయమెక్కడిది?



దుఃఖం ఎప్పటికుంటది నువ్వు నియ్యత్ గల్లోనివి కాకపోతే
నువ్వు ఈర్ష్య గల్లోనివైతే,నువ్వు లోకం కోసం బతుకకపోతే
ఈ బత్కుల దుఖఃమే మిగుల్తది !
ఎంత మైల లేనిది బత్కు కన్న తల్లి పాలోలె
ఎంత కల్తీ లేనిది బత్కు కన్నీళ్లోలె !
ఎంత మైలను పోగొట్టుకుంటె, ఎంత రాకుడుబడితే బత్కు
వజ్రమైతది !
మైలను పోగొట్టుకున్న బంగారంల మెరువాలె బత్కు
ఎన్ని సుత్తె దెబ్బలు తింటె బత్కు బంగారమైతది !
ఎప్పుడు కష్టాలకు ఎదురునిల్సినోడికి
బత్కు విలువ తెలిసినోడికి
బత్కును సమానంగ చూసినోడికి దుఃఖ మెక్కడిది ?
బత్కుల దుఃఖం నుంచి దుఃఖం లేని తొవ్వంటె
మనిషికి స్వార్థం లేని తొవ్వే సక్కటి తొవ్వ.



**డా. సబ్బని లక్ష్మీనారాయణ**
ఫోన్ : 89852 61271

Regd No. R.N.37723/80
P.R.No.HSE-824/2020-2022
Date of Publication 1st of Every Month
Date of Posting 5th / 6th of Every Month




From :
**The Manager, MUSI Telugu Monthly Magazie**
# 2-2-1109/BK - LIG - 10, Batukammakunta, Bagh Amberpet, Hyderabad- 500 013.
Cell : 9347971177, Email : editormusi@gmail.com

Printed, Published and Owned by : B.Anantha Laxmi, Printed at Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
Published at H.No.3-4-245/1, Lingampally, Hyderabad - 500 027. Telangana
Editor : Dr.Sagi Kamalakara Sharma